: fb.com/vaartha Digital




epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

3-11-2025 సోమవారం

సంపుటి: 31 సంచిక: 272

పేజీలు: 12 వెల: 6.50

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam





## 'బాహుబలి' రాకెట్ ప్రయోగం సక్సెస్

**4410 కిలోల బరువైన ఉపగ్రహం నింగిలోకి**

**మెరుగైన ఇంటర్నెట్ సేవలు, కమ్యూనికేషన్ రంగానికి మరింత తోడ్పాటు**

**సూళ్లూరుపేట, నవంబరు 2 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం శ్రీహరికోట నుంచి ఆదివారం ప్రయోగించిన ఎల్‌విఎం03-ఎం5 రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్ అయింది. శ్రీహరికోటలోని లాంచ్ ప్యాడ్ నుంచి శనివారం 5 గంటల 26 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ 24 గంటల అనంతరం భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు ఈ రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగసింది. ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఈ రాకెట్ ద్వారా 4,410 కేజీల బరువు గల భారీ ఉపగ్రహం జిశాట్ 7ఆర్ (సిఎంఎస్03)ను రోదశిలోకి ప్రవేశపెట్టారు. పూర్తిస్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన >>2

# మహిళలపై నేరాలు కట్టడి

**● గతంతో పోల్చితే 4.84% మేర తగ్గుదల ● 15% తగ్గిన హత్యలు, 59% తగ్గిన ఆత్మహత్యలు ● సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు: సిఎం చంద్రబాబు**

**విజయవాడ,నవంబరు 2, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మహిళలపై నేరాలను పూర్తిగా కట్టడి చేశామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.క్రైమ్ ఎగెనెస్ట్ విమెన్ అనే పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టామన్నారు.ఆడబిడ్డల జోలికి వస్తే సమాజంలో మసిలేందుకు అదే వారికి ఆఖరి రోజు అనే పరిస్థితి తీసుకుని వచ్చామన్నారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిస్థితు,సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాల నియంత్రణ తదితరంశాలపై సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగాను, సిఎంఒ విడుదల చేసిన సమాచార పత్రంలో స్పష్టం చేసారు.

మహిళలపై రాష్ట్రంలో నేరాలుతగ్గాయి. గతంతో పోల్చుకుంటే 4.84 శాతం మేర మహిళలపై నేరాలు తగ్గాయి. వరకట్న మరణాలు 43 శాతం తగ్గాయి. మహిళా హత్యలు 15 తగ్గాయి. మహిళా ఆత్మహత్యలు 59 శాతం తగ్గాయి. మహిళలపై సైబర్ వేధింపులు 17 శాతం తగ్గాయి. వరకట్న వేధింపులు 25 శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారిలో 343 మందికి శిక్షలు పడ్డాయి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. మహిళలపై నేరం జరిగితే కేవలం 8నుంచి 10 నిముషాల్లోపే ఘటనా స్థలికి చేరుకునేలా చర్యలుచేపట్టాం. శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసి మహిళల రక్షణపట్ల చర్యలు చేపడుతున్నాం.సెక్సువల్ అఫెండర్లపైనా రౌడీషీట్లను ఓపెన్ చేస్తాం, ఆన్ లైన్ లోనూ నేరస్తుల ఫోటోలు పెడతాం. రాష్ట్రంలో ఓఉద్యమంగా డ్రగ్స్ నియంత్రణ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా గంజాయి, మాదక ద్రవ్యాలను కట్టడి చేస్తున్నాం. రాష్ట్రంలో గంజాయిని జీరో కల్టివేషన్ స్థాయికి తీసుకువచ్చాం. అయితే పొరుగు రాష్ట్రాల నుంచి కొంతమేర అక్రమంగా రవాణా అవుతోంది. రాష్ట్రంలో సైబర్ ఫ్రాడ్స్ కోట్లలో నష్ట పోతున్నారు. బాగా చదువుకున్న వ్యక్తులు కూడా సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి డబ్బు నష్ట పోతున్నారు. సైబర్ క్రైమ్స్, ఫ్రాడ్స్ ఉచ్చులో పడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. సైబర్ క్రైమ్ నియంత్రణకు ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టాం. ఫోరెన్సిక్స్‌ను కూడా బలోపేతం చేస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. గత పాలకుల హయాంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారు. కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నాం. నేరస్థులకు అండగా ఉండే రాజకీయాలను నేను ఇంతవరకూ చూడలేదు. రాజకీయ ముసుగులో ఉన్న >>2



ఆదివారం లండన్‌లో సిఎం చంద్రబాబు దంపతులకు స్వాగతం పలుకుతున్న అక్కడి ఎపి సంఘాల ప్రతినిధులు

2లో

## లండన్ చేరిన సిఎం దంపతులు

**4న రెండు అవార్డులు అందుకోనున్న భువనేశ్వరి**



# భళా! భారత్ మహిళ

**ఉమన్స్ వరల్డ్‌కప్ విజేత టీమిండియా**

**ఫైనల్లో సౌతాఫ్రికాపై జయభేరి**

**తొలిసారి మహిళల ప్రపంచకప్ సాధించిన భారత్**

**52 పరుగుల తేడాతో ఘనవిజయం**

**నవీముంబయి, నవంబరు 2:** తొలి ప్రపంచకప్‌వేటలో భారత్ విజయం సాధించింది. 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయదుందుభి మోగించి దశాబ్దం కలను నెరవేర్చింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన భారత్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 298 పరుగులుచేసి దక్షిణాఫ్రికాకు 299 పరుగుల లక్ష్యం విధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(87), దీప్తి శర్మ(58)లు అర్ధ శతకాలతో కదం తొక్కగా ఫైనల్ చరిత్రలోనే రికార్డు పరుగులు చేసింది టీమిండియా. ఓపెనర్లు సెంచరీ భాగస్వామ్యంతో శుభారంభం ఇచ్చినా మిడిలార్డర్ వైఫల్యంతో 300 మార్క్ అందుకోలేకపోయింది. చివరి పది ఓవర్లో 69 రన్స్ మాత్రమే రావడంతో హర్మన్‌ప్రీత్ సేన 7వికెట్ల నష్టానికి 298 పరుగులు చేయగలిగింది. సొంత గడ్డపై వరల్డ్ కప్ >>2

# అధైర్యం వద్దు, అండగా ఉంటాం

## కాశీబుగ్గ బాధితులకు కేంద్ర, రాష్ట్ర మంత్రుల హామీ



ఆదివారం కాశీబుగ్గ ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు

**మృతుల కుటుంబాలకు రూ. 15 లక్షల ఆర్థిక సాయం పంచిన కేంద్రమంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు**

**క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి ఆనం**

**శ్రీకాకుళం, నవంబరు 2 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన ఘటనలో మృతి చెందిన కుటుంబాల నివాసాలకు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు వెళ్లి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని కేంద్ర మంత్రితో కలిసి అందించారు. టెక్కలి, నందిగాం మండలాల పరిధిలోని పిట్టలిసరియా, రామేశ్వరం, శివరాంపురం గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి అధైర్యపడవద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దైవ దర్శనానికి వెళ్లి ఇలాంటి ఘటన జరగడం తీవ్రంగా కలిచివేసిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

**క్షత్తగాత్రులను పరామర్శించిన దేవాదాయ శాఖా మంత్రి**

దేవాదాయశాఖామంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటన అనంతరం ఆలయ సందర్శన చేసి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి శివాజీ, ఎమ్మెల్యే శిరీష, దేవాదాయ శాఖ కమిషనర్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో దేవాదాయ శాఖ సమీక్ష చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దాదాపు 9 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఇది అనుకోకుండా జరిగిన ప్రమాదమని, సక్రమ ఏర్పాట్లు చేసి ఉంటే నివారించేవాళ్లమని అన్నారు. సొంత నిధులతో భక్తులు నిర్మించిన ఈ ఆలయం >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

**భక్తుల ప్రయాణంలో విషాదం**

## ట్రైలర్‌లోకి దూసుకు పోయిన వాహనం

**రాజస్థాన్‌లోని ఫలోడి జిల్లాలో దుర్ఘటన**

**18 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు**

**జైపూర్, నవంబరు 2:** పార్కుచేసి ఉన్న ట్రైలర్‌లోపలికి ఒక ప్రయాణీకుల వాహనం దూసుకుని పోవడంతో 18 మంది ప్రయాణీకులు స్పాట్‌లోనే చనిపోయారు. రాజస్థాన్‌లోని ఫలోడి జిల్లాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జోధ్‌పూర్‌లోని సురసాగర్‌ను దర్శించుకుని వస్తున్న భక్తులు ప్రయాణిస్తున్న వాహనం బికనీర్‌లోని కోలాయత్‌నుంచి బయలుదేరి వచ్చేమార్గంలోనే ఈప్రమాదంజరిగింది. రాజస్థాన్‌లో తరచూ రోడ్డుప్రమాదాలు భారీ ఎత్తున చోటుచేసుకుంటున్నాయి. గతనెలలోనే జైసల్మేర్‌లో 26మంది ప్రయాణీకులు బస్సుదగ్ధం కావడంతో సజీవదహనం అయ్యారు. ఎసిలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈప్రమాదం జరిగింది. బస్సుకు ఎగ్జిట్‌గేటు లేకపోవడంతో ఈప్రమాదం పెనుముప్పుగా మారింది. గతనెలలోనే ఒక ప్రైవేటు స్లీపర్‌బస్సు ఉత్తరప్రదేశ్‌లోని ఫిలిబిత్‌నుంచి 50 మంది కార్మికులను తీసుకువస్తూ అగ్నిప్రమాదానికి లోనయింది. మనోహరాపూర్‌ప్రాంతంలో విద్యుత్ తీగకు తాకి ప్రమాదానికి లోనయింది. ఇద్దరు మృతిచెందగా పదిమంది తీవ్రగాయాలపాలయ్యారు. కాగా ఆదివారం జరిగినప్రమాదం అనుకోని హటాత్పరిణామంగా చెపుతున్నారు. వేగంగా వస్తున్న >>2



ఆదివారం జోగి రమేష్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్తున్న పోలీసులు

## నకిలీ మద్యం కేసు మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు

**జోగి బ్రదర్స్ ఇళ్లలో సిట్ సోదాలు**

**విజయవాడ,నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో జోగి రమేష్‌ను అరెస్ట్ చేశారు. జోగి రమేష్ పాత్ర గురించి స్పష్టమైన ఆధారాలు సేకరించిన తర్వాత సిట్ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఆయనను అరెస్టు చేశారు. నకిలీ మద్యం కేసులో ఎ1గా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు జగన్మోహన్ రావును పోలీసులు 7 రోజుల పాటు సుదీర్ఘంగా విచారించారు. విచారణలో జోగి పాత్రపై జనార్దన్ రావు కీలక విషయాలు వెల్లడించారు. జోగి రమేష్ ప్రోద్బలంతోనే నకిలీ మద్యం తయారు చేసినట్లు కేసులో ఎ1గా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు.

తనకు 3 కోట్ల రూపాయలు సాయం చేస్తానని హామీ ఇచ్చారని సిట్ విచారణలో చెప్పారు. ఆ డబ్బుతో ఆఫ్రికాలో డిస్టిలరీ పెట్టుకోవచ్చని ఆశ చూపారని అందుకే జోగి రమష్ మాటల్ని నమ్మి ఈ దందాలోకి దిగినట్లు జనార్దన >>2

# మొంథా బాధిత చేనేతలకు భరోసా

**నీటి మునిగిన నూలు, ఇతర రసాయనాలకు రూ.5 వేలు**

**718 మందికి రూ.35.90 లక్షల పరిహారం**

**27,982 తుఫాన్ బాధిత కుటుంబాలుగా గుర్తింపు**

**మత్స్యకారుల మాదిరిగా బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఇతర నిత్యావసరాల పంపిణీ**

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



**అమరావతి, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాన్‌తో నష్టపోయిన చేనేత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. నీటి మునిగి తడిచిపోయిన నూలు, రంగులు, రసాయనాలకు రూ.5 వేల చొప్పున నష్టపరిహారం అందజేస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార కేజీ చొప్పున్న నిత్యావసరాలు అందజేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మత్స్యకారులకు, చేనేతలకు మాత్రమే 50 కేజీల చొప్పున బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదలచేశారు. ఇటీవల మొంథా తుపాన్ రాష్ట్రంలో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందేనన్నారు. ఈ తుపాన్ కారణంగా రైతులతో పాటు చేనేత కార్మిక కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. వర్షాల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో 27,982 చేనేత కుటుంబాలను తుఫాన్ బాధిత కుటుంబాలుగా అధికారులు గుర్తించారన్నారు. తీవ్ర వర్షాల కారణంగా నీట మునిగి మూడు మగ్గాలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. 718 మందికి చెందిన నూలు, రంగులు, రసాయనాలు వంటి ఇతర వస్తువులు నీటిలో తడిసిపోయా యన్నారు. తడిసిపోయిన నూలు, ఇతర రంగులకు రూ.5 వేలు చొప్పున రూ.35.90 లక్షలు అందజేస్తున్నామన్నారు. నీటి మునిగిన మూడు మగ్గాలు స్వల్పం నష్టం చేకూరిందని, ఆ మగ్గాలకు అవసరమైన పరికరాల కొనుగోలుకు బాధితులకు రూ.10 వేలు అందజేస్తున్నామన్నారు. వాటితో పాటు నిత్యావసరాలు అందజేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 8,567 మంది చేనేత కుటుంబాలకు తుపాన్ కారణంగా నష్టపోయాయన్నారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 4,278 కుటుంబాలు, కృష్ణాలో 3,900 కుటుంబాలు, శ్రీకాకుళంలో 3,333 కుటుంబాలు, నెల్లూరులో 2,400 కుటుంబాలు, తిరుపతి జిల్లాలో 1700 కుటుంబాలు మొంథా బాధిత కుటుంబాలు గుర్తించామన్నారు.

**పంచాయితీరాజ్‌లో 1500 మందికి పైగా**

## కార్యదర్శులకు ఉద్యోగోన్నతి!

**660 మందికి డిప్యూటీ ఎంపిడిఒలుగా పదోన్నతులు!**

**రెండేళ్ల కాలపరిమితిని యేడాదికి సవరిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం**

2లో

## యువత కోసం 'వసుధ'

**సర్కార్ కొత్త ప్రాజెక్టు**

**విజయవాడ,నవంబరు 2, ప్రభాతవార్త ప్రతినిధి:** యువతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో తీపికబురు వినిపించింది. ఆంధ్రప్రదేశ్ యువత విదేశాల్లోనూ ఉద్యోగాలు సంపాదించుకునేలా, విదేశాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా ఎపి ప్రభుత్వం వసుధ ప్రాజెక్టును అమలులోకి తీసుకువచ్చింది. ఈ వసుధ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని విద్యార్థులకు విదేశీ భాషలను నేర్పించి. నైపుణ్యాన్ని మెరుగుపరిచి.. ఇతర దేశాల్లోని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దనున్నారు. అయితే ఈ వసుధ ప్రాజెక్టును మరింత విస్తరించాలని ఎపి ప్రభుత్వం నిర్ణయించింది.

ఎపి మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ సూచనల ప్రకారం.. వసుధ ప్రాజెక్టును మరింత విస్తరించనున్నారు. ఇందులో భాగంగా గవర్నమెంట్ కాలేజీలలో పనిచేసే భాష పండితులకు విదేశీ భాషలు నేర్పించనున్నారు. తొలుత 60 మంది భాషా పండితులకు జర్మన్, కొరియన్, జపనీస్, ఇటాలియన్ భాషలు నేర్పించనున్నారు.

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వీరికి ట్రైనింగ్ ఇస్తారు. అయితే వచ్చే యేడాది నుంచి భాషా పండితులకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. యేడాది పాటు ట్రైనింగ్ ఇచ్చిన అనంతరం.. ఆయా భాషా పండితులు.. తమతమ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఈ జర్మన్, జపనీస్, ఇటాలియన్, కొరియన్‌భాషలు నేర్పించాల్సి ఉంటుంది. దీంతో గవర్నమెంట్ కాలేజీల్లో చదివే >>2

3-11pg2exHMNWJQE 2_3-11pg2exHMNWJQE.qxd 03/Nov/25 12:39 AM Page 1





ఆదివారం లండన్‌లో మంత్రి కందుల దుర్గేష్‌కు జనసేన నాయకుల ఘన స్వాగతం

## లండన్ చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్

### ఘన స్వాగతం పలికిన జనసేన నాయకులు

**విజయవాడ, నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** నవంబర్ 4నుంచి 6వ తేదీ వరకు యునైటెడ్ కింగ్డమ్‌లో జరుగనున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యుటిఎం)- 2025లో పాల్గొనేందుకు లండన్‌కు చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్‌కు స్థానిక హీత్రో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. లండన్‌లోని ఎన్ఆర్ఐ జన సైనికులు జనసేన జెండాలతో స్వాగతం పలికారు. అనంతరం వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ప్రదర్శన 2025కు సంబంధించిన ప్రోగ్రాం షెడ్యూల్‌ను టూరిజం కన్సల్టెంట్లు వివరించారు. లండన్ కాలమానం ప్రకారం సాయంత్రం వరల్డ్ ట్రావెల్‌మార్కెట్ ప్రదర్శన2025 వేదికను, అక్కడ ఏర్పాటుచేసిన ఎపి స్టాల్‌ను మంత్రి దుర్గేష్ పరిశీలించి పలు సూచనలు చేయనున్నారు.

## మాదకద్రవ్యాల వ్యసనానికి దూరం కావాలి

### యువతకు పోలీసుశాఖ పిలుపు

**తిరుపతి, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** యువతను, విద్యార్థులను చెడువ్యసనాలకు బానిసలు చేసే మాదకద్రవ్యాల వ్యసనానికి దూరం కావాలని తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరచారి, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, శాప్స్ ఛైర్మన్ రవినాయుడు పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యసనం విద్యార్థుల జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. "సే నో టు డ్రగ్స్"లో భాగంగా ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తూ ఆదివారం తిరుపతి నగరంలో పోలీస్ శాఖ, ఈగిల్ సెల్ అధికారులు కలసి 5కె రన్ చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తిరుపతిలోని స్వచ్ఛంద సంస్థ ఐఎంసి-పవర్‌స్లైడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సుమారు ఐదొందల మంది యువత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని సమాజంలో డ్రగ్స్ వ్యసనం నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై, యువతలో చైతన్యం కలిగించడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## కక్ష్యలోకి జి-శాట్ 7ఆర్

>> ఈ ఉపగ్రహం భారత భూభాగంతో సహా విస్తృతమైన సముద్ర ప్రాంతాల్లో సమాచారాన్ని సేకరించి సేవలు అందిస్తుంది. మెరుగైన ఇంటర్నెట్ సేవలను, కమ్యూనికేషన్ రంగానికి ఉపయోగపడే విధంగా ఈ ఉపగ్రహం పనిచేస్తుంది. నావికాదళంతో పాటు సైన్యానికి సాంకేతికపరంగా డేటాను అందించేందుకు ఉపయోగపడుతుంది. 43.5 మీటర్ల ఎత్తుగల ఈ రాకెట్ కౌంట్‌డౌన్ పూర్తయిన వెంటనే నింగికెగసింది. రెండు స్ట్రాపాన్ బూస్టర్ల ద్వారా తొలి దశ పూర్తయ్యేందుకు 400 టన్నుల ఘన ఇంధనం అవసరమైంది. రెండో దశకు 110 టన్నుల ద్రవ ఇంధనం, మూడో దశకు 25 టన్నుల క్రయో ఇంధనంతో శాస్త్రవేత్తలు నిర్దేశించిన గమ్యస్థానాన్ని చేరుకుంది. గతంలో నాలుగు దశల్లో ఉన్న ఈ ప్రయోగాన్ని ప్రస్తుతం మూడు దశలకు పరిమితం చేశారు. గమ్యస్థానాన్ని చేరుకునేందుకు ఈ రాకెట్ 16 నిమిషాల 29 సెకన్లు సమయం పట్టింది. అనంతరం ఈ రాకెట్ ద్వారా ప్రయోగించిన భారీ ఉపగ్రహం సిఎంఎస్03ని 29 వేల 970 కిలోమీటర్ల దూరంలో జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. అనంతరం హాసన్‌లోని శాటిలైట్ మానిటరింగ్ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు నిర్దేశించిన 36వేల కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. రాకెట్ నుంచి ఉపగ్రహం విడిపోయిన తర్వాత ఒక నిమిషం పాటు శాస్త్రవేత్తల్లో నిశ్శబ్దం అలముకుంది. ఇస్రో చరిత్రలో మొట్టమొదటిసారిగా క్రయోజనిక్ ఇంజన్‌ను తిరిగి రీస్టార్ట్ చేయడంద్వారా నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశ పెట్టారు. ఎల్‌విఎం సిరీస్‌లో ఇది 8వ ప్రయోగం. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో జరిగిన ఈ ప్రయోగ విజయంతో భారతదేశం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో మరోసారి తన సత్తా చాటింది. ఇస్రో శాస్త్రవేత్తల సమష్టి కృషికి ఈ ప్రయోగం నిదర్శనం.

## పంచాయితీరాజ్‌లో 1500 మందికి పైగా కార్యదర్శులకు ఉద్యోగోన్నతి!

**విజయవాడ, నవంబరు 2,ప్రభాతవార్త ప్రతినిధి:** పంచాయితీరాజ్ శాఖలో పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పదోన్నతులకు కనీస అర్హత రెండేళ్ల నుంచి యేడాదికి సడలిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఒకేసారి 1500 మందికి పైగా పంచాయితీ కార్యదర్శులకు ఉద్యోగోన్నత లభించనుంది. దీనిలో గ్రేడ్-1 కార్యదర్శులు,సీనియర్ అసిస్టెంట్లు 660 మంది డిప్యూటీ ఎంపీడీవోలుగా, మిగతా కార్యదర్శులు ఇప్పుడున్న గ్రేడ్ నుంచి అంతకంటే పైగ్రేడ్‌కు వెళ్ళనున్నారు. పంచాయితీ కార్యదర్శులకు భారీగా పదోన్నతులు కల్పించడం ఇదే మొదటిసారి. గ్రామ సచివాలయాపై పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులుగా డిప్యూటీ ఎంపీడీవోలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలాల్లో ప్రస్తుతం ఉన్న వారిని కేటాయించడంద్వారా ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని గమనించిన ప్రభుత్వం. అర్హత కల్గిన గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శులకు, జిల్లా మండల పరిషత్, జిల్లా పంచాయితీ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లకు కలిపి 660 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. ఒక క్యాడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలంటే నిబంధనల ప్రకారం ఇప్పుడున్న స్థానంలో రెండేళ్లపాటు విధిగా పనిచేయాలని. కూటమి ప్రభుత్వం పంచాయితీ కార్యదర్శి పోస్టులను కొన్నింటిని ఏడాది క్రితం పదోన్నతుల ద్వారా భర్తీ చేసింది. రెండేళ్లు పూర్తవ్వని కారణంగా 474 మంది కార్యదర్శులకు పదోన్నతులు కల్పించే విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి, పంచాయితీరాజ్‌శాఖ ఉన్నతాధికారులతో చర్చించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమస్యకు పరిష్కారం రెండేళ్ల కాలపరిమితిని ఏడాదికి తగ్గించేలా నిబంధనల్లో సవరణల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించడంతో పదోన్నతులకు మార్గం సుగమం అయింది.



ఆదివారం ముంబయిలో సచిన్ టెండూల్కర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి

## ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో నారా లోకేష్ ఫ్యామిలీ సందడి

**విజయవాడ,నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** భారత్, దక్షిణాఫ్రికా మహిళల జట్ల మధ్య నవీ ముంబై వేదికగా జరుగుతున్న ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో నారా లోకేష్ ఫ్యామిలీ సందడి చేసింది. డివై పాటిల్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌కు నారా లోకేష్ కుటుంబసమేతంగా హాజరయ్యారు. సతీమణి నారా బ్రాహ్మణి, దేవాన్ష్‌లతో పాటుగా ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చుని సందడి చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్‌ను నారా లోకేష్ ఫ్యామిలీ కలిసింది. సచిన్‌తో కలిసి ఫోటోలు దిగారు. అలాగే ఐసిసి ఛైర్మన్ జైషాను కలిశారు. లోకేష్ ఈ మ్యాచ్‌లో ఇండియన్ ఇటగాళ్లను ప్రోత్సహిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి కరతాళ ధ్వనులు, బిగ్గరగా నినాదాలు చేసారు. లోకేష్ కుమారుడు దేవాన్ష్ ఈ మ్యాచ్ స్టేడియంలో హల్‌చల్ చేసారు. కేరింతలు కొడుతూ అక్కడి మిత్రులతో ఆనందం పంచుకున్నారు.

## యువత కోసం 'వసుధ'

>> విద్యార్థులకు విదేశీ భాషలు నేర్చుకునే వెసలుబాటు కలుగుతుందని.. ఫలితంగా ఆయా దేశాల్లో ఉద్యోగాలు సంపాదించుకునేందుకు అవకాశం ఉంటుందనేది ప్రభుత్వం ఉద్దేశం.

మరోవైపు రాష్ట్రంలోని గిరిజన, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు కూడా జర్మన్ భాష నేర్పిస్తున్నారు. సుమారు 150 మంది విద్యార్థులకు ఇందులో ట్రైనింగ్ ఇస్తున్నారు. జర్మన్ భాష నేర్చుకున్న అనంతరం మిగతా భాషలపై తర్ఫీదు ఇస్తారు. అలాగే నర్సింగ్ కాలేజీల్లోని విద్యార్థులకు కూడా జర్మన్ భాష నేర్పిస్తున్న సంగతి తెలిసిందే. 13 నర్సింగ్ కాలేజీలలోని సుమారు 2300 మంది విద్యార్థులకు జర్మన్ భాష నేర్పిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

అయితే ప్రభుత్వం ఇంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని మన తెలుగు విద్యార్థులకు విదేశీ భాషలు నేర్పించడానికి కూడా ఓ కారణం ఉంది. జర్మనీ వంటి దేశాల్లో నర్సులకు మంచి డిమాండ్ ఉంది. అలాగే ఒక్కో ఉద్యోగానికి అక్కడ నెలకు కనీసం 2 లక్షల వరకూ జీతం చెల్లిస్తున్నారు. డిగ్రీ స్థాయి వరకూ జర్మన్ భాష నేర్చుకుంటే కచ్చితంగా అక్కడ ఉద్యోగాలు సంపాదించవచ్చనేది అధికారుల అంచనా. ఈ నేపథ్యంలో రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ వసుధ ప్రాజెక్టును చేపడుతోంది.

## మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు

>> రావు వాంగ్మూలం ఇచ్చారు. అంతకుముందు అరెస్టు తర్వాత వీడియో విడుదల చేసిన జనార్ధనరావు జోగి రమేష్ ప్రోద్బలంతోనే తాను నకిలీ మద్యం వ్యాపారంలోకి వచ్చినట్లు వెల్లడించారు. వైఎస్సార్సీ హయాంలోనే, జోగి మంత్రిగా ఉన్న సమయంలోనే తాను నకిలీ మద్యం తయారు చేశానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిఘా పెరగడంతో ఆపేశానని వీడియోలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జోగి రమేష్ ఆదేశాలతో చిత్తూరు జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం దుకాణం నిర్వహణను ప్రారంభించానని, ఒక వేళ పోలీసులు పట్టుకుంటే కూటమి ప్రభుత్వంపై బురద చల్లవచ్చని జోగి రమేష్ తనకు చెప్పారని వెల్లడించారు. జోగి రమేష్ తనకు బెయిల్ కూడా ఇప్పిస్తానని చెప్పారని జనార్ధనరావు వివరించారు. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ పట్టుబడటంతో ఆ వెంటనే ఆఫ్రికా వెళ్లిపోయానని చెప్పిన జనార్ధనరావు జోగి రమేష్ పథకం ప్రకారం తన మనుషులతో ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వం చేయిస్తుందనే ప్రచారం చేశారని, చంద్రబాబుకు చెడ్డపేరు తెచ్చేందుకే ఇలా చేశారని వివరించారు.

అదే సమయంలో ఆఫ్రికా వెళ్లే ముందు సెప్టెంబరు 23న ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ ఇంటికి వెళ్లినట్లు చెప్పడంతో దానికి సంబంధించి సీసీ కెమెరా దృశ్యాలను సిట్ సేకరించింది. ఈ నేపథ్యంలోనే జోగి రమేశ్ ఇంటికి పోలీసులు వెళ్లి అరెస్ట్ చేశారు. అయితే అరెస్టు చేసేందుకు అధికారులు రాగా జోగి రమేష్ రెండు గంటల పాటు డోర్ తీయలేదు. పోలీసుల్ని బయటే నిలువరించారు. ఆ తర్వాత డోర్ బద్దలు కొట్టిన పోలీసులు, జోగి రమేష్‌కు అరెస్టు వారెంట్ ఇచ్చి ఆయన్ని అరెస్టు చేశారు. ఇదే కేసులో జోగి రమేష్ సోదరుడు రాము ప్రమేయం కూడా ఉన్నట్లు పోలీసులు ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.

అరెస్టు తర్వాత విజయవాడలోని గురునానక్ కాలనీలోని ఎక్సైజ్ కార్యాలయానికి జోగి రమేష్‌ను తరలించారు. అక్కడ అధికారులు జోగి రమేష్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆయన నుంచి మరిన్ని వివరాలు రాబట్టిన తర్వాత న్యాయమూర్తి ముందు హాజరు పరిచే అవకాశం ఉంది. ఇక నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము నివాసాల్లో సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని వారి ఇళ్లల్లో సిట్, ఎక్సైజ్, పోలీస్, క్లూస్ టీం బృందాలు సోదాలు చేపట్టాయి. పలు హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## అధైర్యం వద్దు, అండగా ఉంటాం

>> అత్యంత విశిష్టమైనదని, తిరుమల తరహాలో ఇంత పెద్ద ఆలయం నిర్మించిన వ్యక్తి, భక్తుల భక్తి ప్రశంస నీయమైందని అన్నారు. ప్రైవేట్ ఆలయం అయినా ప్రభుత్వం బాధ్యతగా స్పందించిందని, అప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు ఎమ్మెల్యే శిరీషతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఐటీ మంత్రి లోకేష్‌లు విచారం వ్యక్తం చేసి పరిహారం ప్రకటించారు. దేవాదాయ శాఖ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఏకాదశి నాడు ఇలా జరగడం నిజంగా బాధాకరమన్నారు. 95 ఏళ్ల హరి ముకుంద పండా ఇంత పెద్ద ఆలయం నిర్మించడం గొప్ప సేవ అని, ఆయన ఆశయం ఎంతో పావనమైనదని, అందరూ ఆదర్శంగా తీసుకోవాలి కానీ ఇలాంటి ఘటన జరగకుండా ఉండాల్సింది. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని, కలెక్టర్ నివేదిక ఆధారంగా ఆలయం అభివృద్ధి చర్యలు ప్రారంభిస్తామని, దేవాదాయశాఖ పరిధిలో లేని ఆలయాల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. నాలుగు నెలల క్రితమే ప్రారంభమైన ఈఆలయం పునఃప్రారంభానికి ముందు ఆగమ పండితుల సూచనలు తీసుకుంటామన్నారు. ఒక అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసి ప్రైవేట్ ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుడతామన్నారు. అన్ని ఆలయాలు ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడా లేకుండా భద్రతా జాబితా సిద్ధం చేస్తామని, కలెక్టర్లు పూర్తి నివేదిక ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నామని, భక్తుల భద్రత, ఏర్పాట్లు, ప్రవేశ మార్గాలు, అత్యవసర సేవలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

**మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత:**

పలాస పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిసలాట దుర్ఘటనలో మంచామండ్లకు చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విధితమే. మందస పట్టణంలోని బోయ వీధికి చెందిన బోర బృందావతి, బెల్లుపటియా గ్రామానికి చెందిన డి.రాజేశ్వరి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. అలాగే పలాస సామజిక ఆసుపత్రిలో క్షతగాత్రులను అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం.రమేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులు పరామర్శించారు.

## దూసుకు పోయిన వాహనం

>> భక్తులవాహనం ఆగి ఉన్న ట్రైలర్‌లోనికి దూసుకునిపోవడంవల్లనే ఈఘోరం జరిగిందని స్థానిక పోలీసులు చెపుతున్నారు. మృతదేహాలను పంచనామా కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

### వారం - వర్జ్యం

03-11-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
త్రయోదశి రా.2.03
ఉత్తరాభాద్ర మ.3.01, స్వాతి కార్తె
వర్జ్యం : రా.1.46-3.12
దు.ము.12.14-1.00, 2) మ.2.33-3.19
శుభసమయం : ఉ.8.10-8.50, సా.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** ఉద్యోగస్తులు, సహోద్యోగులతో మెలకువలతో మెలగడం చెప్పదగినది. పాతబాకీలు వసూలవుతాయి.

**వృషభం:** అన్ని విషయాలు నిబంధనలకు అనుగుణంగా జరగవని గుర్తించి వ్యవహరించండి. ఆర్థికప్రగతిని సాధిస్తారు.

**మిథునం:** వ్యవహారాలలో అవాంతరాలు ఎదురవుతాయి. బంధువుల కలయిక. సన్నిహితులకు మీవంతు సహాయాన్ని అందిస్తారు.

**కర్కాటకం:** ఆర్థిక పరమైన వాయిదాలు సక్రమంగా చెల్లించడానికి కష్టపడవలసి వస్తుంది. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగులకు బదిలీలు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

**తుల :** ఒక ఆహ్వానం ఆశ్చర్యం కలిగిస్తుంది. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ధనలాభం. అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**ధనుస్సు:** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మకరం:** దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వస్త్రలాభం కల్గుతుంది.

**కుంభం:** సమస్యలు పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు. మానసిక ప్రశాంతత లోపిస్తుంది. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**మీనం:** నమ్మకం ఆత్మీయతల కన్నా ధనమే గొప్పదని నిరూపించే విధంగా సంఘటనలు జరుగుతాయి. భూవివాదాలు తీరి లబ్ధి పొందు తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నేరాలు కట్టడి

>> నేరస్తులను బయటపెట్టాలి. వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారు. నిద్ర లేచినప్పటి నుంచి నిద్ర పోయే వరకూ జాగ్రత్తగా ఉండే నాపై కూడా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేటియం బ్యాచ్‌లను పెట్టి పెద్ద ఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేయిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం పోయాక మరోలా ప్రవర్తిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా తీవ్రస్థాయిలో వేధింపులు చేస్తున్నారు. వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేశాం. ఫేక్ ప్రచారాలు చేసే నేరస్తులు ప్రపంచంలో ఎక్కడున్నా తీసుకువస్తాం. మహిళలపై కించపరిచేలా పోస్టులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ తరహా నేరాలపై సీరియస్ గా వ్యవహరిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత పాలకుల అరాచకానికి ప్రజలతో పాటు నేనూ బాధితుడిన్నేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తప్పుడు కేసులతో వేధించడానికి అరెస్టు చేసి జైల్లో పెట్టారనీ... జైల్లో కూడా తన కదలికలు చూడ్డానికి డ్రోన్ ఎగరేశారనీ అన్నారు గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడుపై అత్యాచారయత్నం కేసులు పెట్టారు. ప్రస్తుత స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన కేసుల బాధితులే. నాపై 17 కేసులు పెట్టి వేధించారు. ఇది అరాచకానికి పరాకాష్ట. యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేశ్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారు. అంగళ్లులో నాపై దాడి చేయించి మళ్ళీ నా పైనే కేసులు పెట్టారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు తొలగించి వేధించారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జేసీ ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బీటెక్ రవి, కూన రవి ఇలా నేతలపై కేసులు పెట్టి వేధించారు. రఘురామకృష్ణం రాజును అరెస్టు చేసినప్పుడు ఆయన్ను ఏం చేస్తారోననే ఆందోళన వెంటాడింది. గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే. అమరావతి రైతులు, మహిళలు రాజధాని కోసం పోరాడుతుంటే బాత్ రూమ్ లపై డ్రోన్లు ఎగరేశారు. అమరావతి రైతులు న్యాయస్థానం నుంచి దేవస్థానం పాదయాత్రకూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారు. గత పాలకుల అరాచకాలు భరించలేక పారిశ్రామిక వేత్తలు కూడా రాష్ట్రం నుంచి పారిపోయారు.

అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయారు. రాజకీయాల నుంచి కూడా తప్పుకున్నారు. ఆఖరుకు సింగపూర్ లాంటి ప్రభుత్వంపైనా అభాండాలు వేసి ప్రాజెక్టు నుంచి వైదొలిగేలా చేశారు. 2019-24 వరకూ రాష్ట్రం తీవ్రస్థాయిలో అరాచకాలను భరించింది. గత పాలకులు టిడిపి కార్యాలయంపై కూడా దాడి చేశార్ను అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే అరెస్టు చేసి ఉండేవాళ్లం. గతంలో సిఎంగా ఉండగా అలిపిరి వద్ద నక్సల్స్ 23 క్లైమోర్ మైన్లు బ్లాస్ట్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నా ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్దపడ్డాను. రాయలసీమలోనూ కరడు గట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను రూపు మాపాం. టిడిపి తీసుకున్న విధానాల వల్లే రాయలసీమలో ఇప్పుడు ఫ్యాక్షన్ లేదు. ఉమ్మడి రాష్ట్రంలో మత విద్వేషాలనూ సమర్ధవంతంగా కట్టడి చేశాం. గత పాలకుల హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఎమ్మెల్యేల ఆవేశానికీ అర్థం ఉంది. అయితే వారు ప్రవర్తించిన విధంగానే మనం కూడా ప్రవర్తించకూడదు. తప్పు చేసిన ఎవరికైనా శిక్షతధ్యం. చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరిస్తుంది. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా ఏపీ ముందుకు వెళ్లాలి. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలిఖిఖి అని సీఎం చంద్రబాబు అన్నారు.

## భళా! భారత్ మహిళ



>> ఫైనల్ ఆడుతున్న భారత జట్టు రికార్డు స్కోర్ చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికేస్తూ ఓపెనర్లు షఫాలీ వర్మ(87), స్మృతి మంధాన(45) శతక భాగస్వామ్యంతో బలమైన పునాది వేయగా మిడిలార్డర్‌లో దీప్తి శర్మ (58), రీచా ఘోష్(34)లు మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. డెత్ ఓవర్లలో స్లో బాల్స్‌తో సఫారీలు కట్టడి చేయాలనుకున్నా వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోర్ నమోదు చేసింది టీమిండియా. ఈ జాబితాలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. వర్షం అంతరాయంతో టాస్ గంటకుపైగా ఆలస్యమైన మ్యాచ్‌లో భారత జట్టుకు శుభారంభంలభించింది. దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికేస్తూ బౌండరీలతో రెచ్చిపోయారు షఫాలీ వర్మ(87), స్మృతి మంధాన(45). సఫారీ ప్రధాన పేసర్ మరిజానే కాప్ తొలి ఓవర్లో ఒక్క పరుగు రాకున్నా రెండో ఓవర్లోనే ఖాకాకు షఫాలీ బౌండరీతో స్వాగతం పలికింది. ఇక నాలుగో ఓవర్లో కాప్‌ను బెంబేలెత్తిస్తూ వరుసగా రెండు ఫోర్లు కొట్టింది లేడీ సెహ్వాగ్. ఖాక వేసిన ఆరో ఓవర్లో మంధాన రెండు వరుస బౌండరీలతో స్కోర్ 40 దాటించింది. 21 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మిథాలీ రాజ్ రికార్డును బ్రేక్ చేసింది మంధాన. 2017 వరల్డ్ కప్‌లో 409 పరుగులతో మాజీ కెప్టెన్ నెలకొల్పిన రికార్డును దాటేసింది. పవర్ ప్లేలో 64 రన్స్‌తో గట్టి పునాది వేసిన ఈ జోడీ సెంచరీ భాగస్వామ్యంతో సఫారీలను విసిగించింది. ప్రధాన పేసర్లు విఫలమైన వేళ బంతి అందుకున్న ట్రయాన్ మంధానను ఔట్ చేసి తొలి బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఖాక వరుస ఓవర్లలో షఫాలీ, జెమీమా రోడ్రిగ్స్(24)ను ఔట్ చేసి ఒత్తిడి పెంచింది. 57 పరుగుల వద్ద షఫాలీకి సునే లుస్ క్యాచ్ వదిలేయడంతో లైఫ్ లభించింది. కానీ, 5 పరుగుల తేడాతో రెండు కీలక వికెట్లు పడిన వేళ దీప్తి శర్మ(58) తో కలిసి హర్మన్‌ప్రీత్ కౌర్(20) కీలక ఇన్నింగ్స్ ఆడాలనుకుంది. కానీఎలంబా ఓవర్లో తను అనూహ్యంగా క్లీన్‌బౌల్డ్ అయింది. కాసేపటికే డీక్లెర్క్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది అమన్‌జోత్. అనంతరం క్రీజులోకి వచ్చిన రీచా ఘోష్ (34) సిక్సర్‌తో స్కోర్ 250 మార్క్ దాటింది. డెత్ ఓవర్లలో సఫారీలు మెరుగ్గా బౌలింగ్ చేసినా రీచా, దీప్తిలు బౌండరీలతో స్కోర్ వేగం పెంచారు. అయితే ఖాకా ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన రీచా బౌండరీ వద్ద డెర్క్‌సెన్ చేతికి చిక్కింది. ఆఖరి ఓవర్లో ఆరు పరుగులే రావడంతో భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 298 పరుగులుచేసింది. తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలోనే 246 పరుగులకే ఆలౌట్ అయింది. దీనితో 53 పరుగులతేడాతో భారత మహిళా జట్టు ప్రపంచకప్‌కైవసంచేసుకుంది.

## లండన్ చేరిన సిఎం దంపతులు

**విజయవాడ, నవంబరు2,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు దంపతులు లండన్ చేరుకున్నారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం సిఎం చంద్రబాబు, భువనేశ్వరి లండన్ వెళ్లారు. ఈ మేరకు లండన్ తెలుగు కుటుంబాలు చంద్రబాబు దంపతులకు స్వాగతం పలికారు. వారిని సిఎం దంపతులు ఆప్యాయంగా పలకరించారు. ఈనెల 4వ తేదీన ప్రతిష్టాత్మక సంస్థ ఐఒడి నుంచి నారా భువనేశ్వరి రెండు అవార్డులు అందుకోనున్నారు. డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డును ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో ఆమె అందుకోనున్నారు. ప్రజాసేవ, సామాజిక ప్రభావంలో నారా భువనేశ్వరి కృషికి గుర్తింపు రావడంతో ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు వరించింది. గోల్డెన్ పీకాక్ అవార్డును హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ విసిఎండి హోదాలో భువనేశ్వరి అందుకోనున్నారు. భువనేశ్వరి అవార్డు స్వీకరణ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఇక 'వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్ చేరుకున్న నాకు, నా సతీమణి భువనేశ్వరికి అక్కడి తెలుగు కుటుంబాలు ఘన స్వాగతం పలకడం ఆనందం కలిగించిందని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ నెల 4వ తేదీన ప్రతిష్టాత్మక సంస్థ ఐఒడి నుంచి భువనేశ్వరి రెండు అవార్డులు అందుకోనున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో ప్రజాసేవ, సామాజిక ప్రభావంలో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు, ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్సు విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ విసిఎండి హోదాలో గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అందుకోబోతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంతో సంతోషంగా ఎదురుచూస్తున్నాను అని ఎక్స్ ఖాతాలో చంద్రబాబు పోస్ట్ చేశారు.

**పారిశ్రామిక వేత్తలతో సీఎం భేటీలు..**

ఇక సిఎం చంద్రబాబు లండన్‌లో వివిధకార్యక్రమాల్లో పాల్గొనున్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరుగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించనున్నారు. దీనికి సంబంధించి సోమవారం వివిధ పరిశ్రమలు, సంస్థలకు చెందిన ప్రతినిధులను కలవనున్నారు. అక్టోపస్ ఎనర్జీ గ్రూప్ డైరెక్టర్ క్రిస్ ఫ్రిట్జ్ గెరాల్డ్, హిందూజాకు చెందిన వివిధ సంస్థల ఛైర్మన్లు అశోక్ హిందూజా, ప్రకాష్ హిందూజా, షోమ్ హిందూజాలతో సిఎం భేటీ కానున్నారు. ఇక రోల్స్ రాయిస్ గ్రూప్ చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసర్ నిక్కీ గ్రాడీ స్మిత్, శ్రామ్ అండ్ మ్రామ్ సంస్థ ఛైర్మన్ శైలేష్ హీరానందాని, శ్యామ్ కో హోల్డింగ్స్ ఛైర్మన్ సంపత్ కుమార్, ఆ సంస్థ సీఈఓ, డైరెక్టర్లు వైద్యనాథన్, అశ్వినీ సంపత్ కుమార్ లతో పాటు కొసరాజు గిరిబాబు వంటి వారితో సీఎం వరుస సమావేశాల్లో పాల్గొనున్నారు. మరోవైపు వివిధసంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు ముగిసినతర్వాత వివిధ పారిశ్రామిక వేత్తలతో సిఐఐ నేతృత్వంలో జరగనున్న రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో బ్రిటిష్ హెల్త్ టెక్ ఇండస్ట్రీ, ఎఐ పాలసీ ల్యాబ్, అరూప్, ఏథెనియన్ టెక్, ఫిడో టెక్, పీజీ పేపర్ కంపెనీ, నేషనల్ గ్రాఫెనీ ఇన్సిటిట్యూట్, వార్విక్ మాన్యుఫాక్చరింగ్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొననున్నారు. అలాగే లండన్‌లోని ఇండియన్ హైకమిషనర్ దొరైస్వామితో సిఎం చంద్రబాబు సమావేశం కానున్నారు. రాష్ట్రంలోపెట్టుబడులు, ఏయేరంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయనే అంశాన్ని దొరైస్వామితో జరపనున్న భేటీలో సిఎం వివరించనున్నారు.

3-11Pg3exHMNWJQE 3_3-11Pg3exHMNWJQE.qxd 02/Nov/25 11:14 PM Page 1



# అక్టోబరులోనూ హుండీ ఆదాయం వంద కోట్లు

## కానుకల రాబడి రూ.119.36కోట్లు



**తిరుమల, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సంతృప్తికరంగా దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యకు రెట్టింపుగా, స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డు సృష్టిస్తోంది. ఈ ఏడాది ఆరంభం నుండి ప్రతినెలా భక్తుల కానుకల ఆదాయం వంద కోట్లుపై గానే చేకూరుతోంది. అక్టోబరు నెలలో ఇప్పటివరకు దర్శించుకుని హుండీకి సమర్పించిన కానుకలు 119.36కోట్లు రూపాయలుగా నమోదైంది. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి వార్షిక బడ్జెట్ అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ నెల నుండి అక్టోబరు వరకు వెంకన్నకు చేకూరిన ఆదాయం వరుసగా పరిశీలిస్తే భక్తుల సంఖ్యకు అనుగుణంగా హుండీకి కానుకలు చేకూరాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 120 కోట్లు రూపాయలు ఆదాయం లభించగా, మే నెలలో కానుకల రూపంలో హుండీకి రూ.106.20కోట్లు, జూన్‌లో రూ.116.86 కోట్లు హుండీ ఆదాయం లభించింది. జూలైలో రూ.129.45 కోట్లు, ఆగస్టులో రూ.128.68 కోట్లు ఆదాయం లభించగా, వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన గత సెప్టెంబరు మాసంలో రూ.111 కోట్లు హుండీ ఆదాయం వచ్చింది. ఇక తాజాగా అక్టోబరు నెలకు సంబంధించి 22.78లక్షల మంది వరకు భక్తులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోగా హుండీ ఆదాయం రూ.119.36 కోట్లు రావడం విశేషం. ఇలా వరుసగా ఏడు నెలలుగా వంద కోట్లు రూపాయలు పైగానే దాటి రికార్డు స్థాయిలో నమోదైంది. అక్టోబరు నెలకు సంబంధించి హుండీ ఆదాయం గణాంకాలు పరిశీలిస్తే అక్టోబరు 19వ తేదీ హుండీ ఆదాయం రూ.4.97కోట్లు, 24వ తేదీ హుండీ ద్వారా రూ.4.89 కోట్లు, 7వ తేదీ రూ.4.74 కోట్లు, 16న రూ.4.66 కోట్లు, 31న రూ.4.47 కోట్లు, 14న రూ.4.35 కోట్లు, అక్టోబరు 21న రూ.4.34 కోట్లు, 6న రూ.4.16 కోట్లు, 9న రూ.4.15 కోట్లు, 12న రూ.4.06 కోట్లు, 29వ తేదీ రూ.4 కోట్లు ఆదాయం లభించింది. ఇక మిగిలిన రోజుల్లో వరుసగా సరాసరి 3.50 కోట్ల రూపాయలు పైగానే ఆదాయం చేకూరింది. నెలవారీగా ఏడుకొండలు చేరుకుంటున్న భక్తుల సంఖ్య సరాసరి 22లక్షల మంది వరకు ఉంటుండగా, ఆ భక్తులు సమర్పించుకుంటున్న మొక్కుల ద్వారా వడ్డీకాసులవాడి ఖజానాకు కానుల వరద వెల్లువెత్తుతోంది. ఇదిలా ఉండగా సెప్టెంబరు 24వ తేదీ నుండి అక్టోబరు 2వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాల్లోనూ ఆదాయం గణనీయంగా లభించింది. ఆ తొమ్మిదిరోజులు 7.30లక్షల మంది భక్తులు మూలవిరాట్టును దర్శనం చేసుకోగా, కానుకల ద్వారా హుండీ ఆదాయం 30.51కోట్ల రూపాయలు చేకూరింది.

# 7న సిపిఎం ఆధ్వర్యంలో రెడ్ వాలంటీర్స్ కవాతు

**విజయవాడ.నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో జరిగే రెడ్ వాలంటీర్స్ కవాతుని నవంబర్ 7న సీపీఎం నిర్వహిస్తుంది.ఈ మార్చ్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలో ఆదివారం సీపీఎం కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేసారు ఈ సందర్భంగా సిపిఎం యన్టీఆర్ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ .. విజయవాడలో రెడ్ వాలంటీర్స్ కవాతు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ర్యాలీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి రాఘవయ్య పార్క్ వద్ద ఉన్న మాకినేని బసవ పున్నయ్య భవనం వరకు జరుగుతుందని అన్నారు. ఈ ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం ఎంబివికెలో సోషలిజం ఔన్నత్యాన్ని, దాని అవశ్యకత, విశిష్టత మరియు ప్రస్తుత పరిస్థితుల్లో సామ్రాజ్యవాద ప్రమాదం అనే అంశం పైన సిపిఎం పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు కామ్రేడ్.బి.వీ రాఘవులు మరియు సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ సిహెచ్ బాబురావు పాల్గొని ప్రసంగింస్తారని అన్నారు. సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్. డి.కాశీనాథ్, ఇతర సిపిఎం నాయకులు పాల్గొనున్నారన్నారు. వీరులపాడు మండలంలో వీరులపాడు,దొడ్డదేవరపాడు, అల్లూరు, చౌటుపల్లి,చట్టన్నవరం, జుజ్జూరు తదితర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు పల్లి కంటి బాబు,షేక్ లాలా అహ్మద్, ఎస్ఎఫ్ఐ నాయకులు జాన్‌బాషా, సిపిఎం సీనియర్ నాయకులు కోడూరు పిచ్చేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# కైశికద్వాదశిన ఉగ్రశ్రీనివాసమూర్తి అభయం



**తిరుమల,నవంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో కైశిక ద్వాదశి పర్వదినాన ఆదివారం వేకువజామున శ్రీదేవి భూదేవిసమేతుడై ఉగ్రశ్రీనివాసమూర్తి భక్తులకు అభయమిచ్చారు. వేకువజామున 4.30గంటల నుండి 5.45గంటల లోపు శ్రీఉగ్రశ్రీనివాసమూర్తి ఉభయదేవేరులతో కలసి ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపుగా భక్తులను కటాక్షించారు. ఏడాదిలో ఒక్కసారి,కైశికద్వాదశిరోజు మాత్రమే సూర్యోదయానికి ముందే ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయం వెలుపలకు వచ్చి దర్శనమివ్వడం విశేషం, మిగిలిన అన్ని రోజుల్లో శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి ఊరేగుతారు. ఆదివారం ఉదయం ఊరేగింపు అనంతరం స్వామి అమ్మవార్లుకుఆలయంలోపల బంగారువాకిలిలో అర్చకులు పురాణపఠనంతో కైశికద్వాదశి ఆస్థానం శాస్త్రోక్తంగా ముగిసింది. భక్తులందరికీ స్వామి వారి కృపాకటాక్షాలు కలగాలని అధికారులు, అర్చకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇఒ ఎ.లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, పారుపత్తేదార్ నాయక్, విఎస్‌ఒ సురేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.

# ఆర్సెలాల్ మిత్తల్-నిప్పాన్ స్టీల్స్‌కు పర్యావరణ అనుమతి

**విజయవాడ,నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి సమీపంలో ఆర్సెలాల్ మిత్తల్ నిప్పాన్ స్టీల్స్(ఏఎం/ఎన్ఎస్) సంస్థ ఏర్పాటు చేయబోతున్న ఉక్కు కర్మాగారానికి కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఎక్స్‌పర్ట్ అప్రైజర్ కమిటీ (ఈఏసీ) పర్యావరణ అనుమతికి శనివారం సిఫారసు చేసింది. దీంతో ఆ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి అన్న అనుమతులూ వచ్చినట్లేనని, 14 నెలల రికార్డు సమయంలోనే దీన్ని సాధ్యం చేశామని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. రూ.1.5 లక్షల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ ఉక్కు కర్మాగారం దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ కర్మాగారంగా రికార్డు సృష్టించనుంది. ఈ నెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో ఆర్సెలాల్ మిత్తల్ కర్మాగారానికి భూమి పూజ చేయనున్నారు. మొదటి దశలో 82 లక్షల టన్నుల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ ఉక్కు కర్మాగారం నిర్మాణం చేపడతారు. చివరి దశలో దీన్ని 2.40 కోట్ల టన్నుల వరకు విస్తరించనున్నారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రస్తుతం వాతావరణ పరిస్థితులకు లోబడి అతి తక్కువ కాలుష్య కారకాలు వచ్చేలా పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. కర్మాగారం పూర్తి స్థాయిలో ప్రారంభమైతే ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్‌లో ప్రధాన పరిశ్రమగా నిలుస్తుంది. 2024 ఆగస్టులోనే మంత్రి లోకేష్ ఆర్సెలాల్ మిత్తల్ సంస్థతో చర్చించారు. ఆ సమయంలో భూమి,విధానపరమైన మద్దతును సంస్థ కోరింది. ప్రభుత్వం 3 నెలల్లోనే భూమి కేటాయించి,ఏక గవాక్ష విధానంలో పూర్తి సహాయ సహకారాలను అందించింది. ఇంత భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ఉక్కు కర్మాగారానికి 14 నెలల్లో అన్ని అనుమతులూ వచ్చేలా చేసి,శంఖుస్థాపనకు సిద్ధం చేయడం,రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పారదర్శక పారిశ్రామిక అనుకూల విధానాలకు నిదర్శనమని అధికార వర్గాలు తెలిపాయి.

ఏపి ప్రభుత్వం వేగం, పారదర్శకత, సమర్థత పరిపాలనకు ఇది నిదర్శనమని మంత్రి లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 'సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా పారిశ్రామిక సహాయక వ్యవస్థను అభివృద్ధి చేశాం' అని పేర్కొన్నారు.

# నర్సాపూర్-మైసూర్ రైలు నేటి నుంచి కాకినాడ టౌన్ వరకే

**గుంతకల్లు రైల్వే, నవంబరు 2, ప్రభాత వార్త:** రాయలసీమ జిల్లాల మీదుగా నర్సాపూర్ మైసూరునరసాపూర్ మధ్య తిరిగే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నేటి (ఈనెల 03 నుంచి 29 వరకు) నుంచి కాకినాడ టౌన్ వరకే పరిమితం చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాకినాడ టౌన్ నుంచి మైసూరు వెళ్ళే నంబర్ 07033 ఎక్స్‌ప్రెస్ ఈనెల 3 నుంచి 28 వరకు ప్రతిరోజూ ఉదయం 09:00 గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 04:00 గంటలకు మైసూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మైసూరు నుండి కాకినాడ టౌన్ వెళ్ళే నంబర్ 07034 ఎక్స్‌ప్రెస్ ఈనెల 24 నుంచి 29 వరకు ప్రతిరోజూ సాయంత్రం 05:20 గంటలకు మైసూరు నుండి బయలుదేరి మరుసటిరోజు రాత్రి 11:00 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. ఈరైళ్లు మార్గమధ్యంలో ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగంపేట్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం,యాద్గీర్, క్రిష్ణా,రాయచూరు, మంత్రాలయం,ఆదోని,గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, బెంగళూరు కంటోన్మెంట్, బెంగళూరు సిటీ, మాండ్యా స్టేషన్‌లలో నిలుస్తాయి.

# తిరుమల సమాచారం



## పండుగ వాతావరణంలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

**తిరుచానూరు,నవంబరు 2ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు తరహాలో ఒక పండుగ వాతావరణం ఉట్టిపడేలా తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా అందరూ కలసి పనిచేయాలని టిటిడి జెఈఒ వీరబ్రహ్మం ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, ముఖ్యమైన రోజుల్లో భక్తుల సంఖ్యకు తగ్గట్లు సౌకర్యాలు ఉండాలన్నారు. వారంరోజుల ముందే ఈ ఏర్పాట్లన్నీ పూర్తికావాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో ఈనెల17వతేదీ నుండి 25వతేదీ వరకు తొమ్మిదిరోజులపాటు వార్షిక కార్తీకమాస బ్రహ్మోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జెఈఒ వీరబ్రహ్మం అధికారులు,అర్చకులతో సమీక్ష నిర్వహించారు. టిటిడి సిఇ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఎప్ఎసిఎఒ బాలాజీ. ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు, డిప్యూటీ ఇఒలు, విజిలెన్స్ విభాగం, అర్చకులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు 16వతేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. నవంబర్ 11న ఆలయంలో కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు ,రాత్రి 7గంటల నుండి 9గంటల వరకు అమ్మవారి వాహనసేవలు ఊరేగింపు జరుగుతుంది. కాగా బ్రహ్మోత్సవాల్లో ఎంతో విశిష్టతవున్న గజవాహనం శుక్రవారం జరగనుండటం, చివరగా పంచమీ తీర్థం మంగళవారం అత్యంత ప్రధానమైన రోజులు. భద్రతపరంగా, భక్తులకు సౌకర్యాలపై రాజీలేని ధోరణితో పనిచేయాలని నిర్ణయించారు.

### 17నుండి బ్రహ్మోత్సవాలు

| తేదీ | ఉదయం | రాత్రి |
|---|---|---|
| 17 | ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 18 | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 19 | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 20 | కల్పవృక్షవాహనం | హనుమంతవాహనం |
| 21 | పల్లకీఉత్సవం | గజవాహనం |
| 22 | సర్వభూపాలవాహనం,స్వర్ణరథం (సాయంత్రం) | గరుడవాహనం |
| 23 | సూర్యప్రభవాహనం | చంద్రప్రభ వాహనం |
| 24 | రథోత్సవం | అశ్వవాహనం |
| 25 | పంచమీతీర్థం, | ధ్వజావరోహణం |

# నెయ్యిటెండర్లకు సహకరించిన 'రింగ్ మాస్టర్'లపై ఫోకస్

## టిటిడి అధికారులకు నోటీసులు జారీదిశగా సిబిఐ సిట్



**తిరుమల,నవంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి అవసరమైన నెయ్యిసరఫరా టెండర్లు పిలిచినప్పటి నుండి టెండర్లలో పాల్గొని చివరకు కల్తీనెయ్యి సరఫరా వరకు పూర్తిగా సహకరించిన రింగ్‌మాస్టర్‌లపై సిట్ అధికారులు ఇప్పుడు ఫోకస్‌పెట్టారు. కల్తీనెయ్యి సరఫరా కేసు విచారణలో ప్రస్తుతం కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కల్తీనెయ్యి పాపంలో సూత్రధారులు ఎవరున్నారనే అంశంపై ప్రత్యేకంగా సిట్ దృష్టిపెట్టింది. సిట్ అధికారులు ఇప్పటికే పాత్రధారులైన వారితోబాటు టెండర్లలో కీలకంగా వ్యవహరించిన టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆంతరంగికుడు, వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను రిమాండ్‌కు పంపింది. అతని నుండి రాబట్టిన కొంత సమాచారం మేరకు టిటిడిలో మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగం అధికారులను విచారణకు రమ్మని పిలిచేందుకు నోటీసులు ఇచ్చేదిశగా సిద్ధమయ్యారు. తిరుపతి అలిపిరిలోని పాత ఎస్వీబిసి కార్యాలయం ప్రాంగణం భవనంకు వచ్చి నెయ్యిసరఫరా విషయాలు వెల్లడించాలని ప్రశ్నలను తయారు చేసుకున్నారనేది కీలకం. 2020నుండి 2022 వరకు దెయిరీలకు నెయ్యిసరఫరాకు టెండర్లు ఇప్పించింది ఎవరు, ఎక్కడ నుండి నెయ్యి సరఫరా చేసేలా ట్యాంకర్లు పంపారు, అసలు సామర్థ్యం లేకపోయినా రెండు డెయిరీలను ఎందుకు ప్రోత్సహించారనేది సిట్ విచారణ చేపట్టనుంది. ఇప్పటికేఈ కేసులో కీలక మలుపుతిరుగుతున్నాయి.గతంలో టిటిడిలో కీలకంగా వ్యవహరించిన ఓ అధికారితోబాటు టిటిడి బోర్డు కొందరు మాజీలకు నోటీసులిచ్చి పిలిచి ఆ తరువాత అరెస్టుచేసే అనూహ్య పరిణామాలు ఉంటాయనేది తెలుస్తోంది. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యిసరఫరాచేశారని గతంలోనే తీవ్రసంచలనం రేకెత్తించింది. ఈ కేసులో మలివిడత సిబిఐ సిట్ అధికారుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తు న్నాయి. టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళు విభాగంలో ,పోటు,విజిలెన్స్‌కు సంబంధించి 12మంది అధికారులు ప్రమేయం ఉందనేది ఇప్పటికే సిట్ గుర్తించింది. వారం రోజుల్లో కల్తీనెయ్యి కేసు క్లైమాక్స్‌కు రావచ్చని తెలుస్తోంది.

# అవినీతిపై పోరాటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి: అతుల్ సింగ్




విజిలెన్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఏసిబి డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్, సైకిల్ ర్యాలీ

**విజయవాడ,నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** మన సమాజ అభివృద్ధికి అవినీతి అవరోధంగా ఉందని దాన్ని పారదోలాల్సిన అవసరం ఉందని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ అన్నారు.. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2025 లో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఉదయం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజున అవినీతికి వ్యతిరేకంగా విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను చేపట్టడం జరుగుతుందన్నారు. నవంబర్ రెండో తారీకు వరకు దీనిపై ప్రజల్లో దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తారన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలలో కూడా సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి అడ్డుగోడగా ఉన్న అవినీతిని పారదోలాల్సి ఉందన్నారు. అవినీతి అనేది రెండువైపులా అంటే ఇచ్చే వారు పుచ్చుకునే వారిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఏదైనా అవినీతిపై మీరు ఫిర్యాదు చేయాలనుకుంటే 1064 కు కాల్ చేయవచ్చాన్నారు. దీనిపై వెంటనే అవినీతి నిరోధక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.. అవినీతిపై పోరాటంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి మనకి చాలా సపోర్టు ఉందని తెలిపారు. ఉదయమే సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అందరికీధన్యవాదాలు తెలియజేస్తున్నా మన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ బెంజ్ సర్కిల్ బందరు రోడ్డు మీదుగా పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం కు చేరుకుంది. సైకిల్ ర్యాలీలో ఏసిబి డైరెక్టర్ ఆర్. జయలక్ష్మి, హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీలు మహేం దర్, దిలీప్ కిరణ్ పాల్గొన్నారు.

# మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అక్రమం : వైసీపీ నేతలు

**విజయవాడ,నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం తయారీ కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. రమేష్ అరెస్ట్‌ను వైసిపి నేతలు తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ పూర్తిగా అక్రమం.. ఇది కేవలం కక్ష సాధింపు చర్యగా వైసీపీ నేతలు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ, మేరుగు నాగార్జున, పేర్ని వెంకట్రామయ్య (నాని), అంబటి రాంబాబు, కురసాల కన్నబాబు, గడి కోట శ్రీకాంత్‌రెడ్డి, మార్గాని భరత్, టీజేఆర్ సుధాకర్‌బాబు, జోగి రాజీవ్ తీవ్రంగా ఖండించారు.

# మహిళా క్రికెటర్ల భాగస్వామ్యం క్రీడా చరిత్రలో గర్వకారణం


## భారత్ మహిళా జట్టుగెలవాలని కొబ్బరికాయల మొక్కులు



**తిరుమల,నవంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** భారతమహిళ క్రికెట్ జట్టు ఫైనల్ పోటీల్లో అద్భుతంగా ఆడి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ పూజలుచేసింది. దక్షిణాఫ్రికాతో తలపడుతున్న భారత మహిళ జట్టుకు అన్ని విధాలా ఆశీస్సులు అందాలని దేవదేవుడ్ని వేడుకున్నారు. ఈసందర్భంగా ఆదివారం ఉదయం ఆలయానికి ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద తుడ ఛైర్మన్ .క్రికెట్ అభిమాని సి.దివాకర్‌రెడ్డి, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తకార్యదర్శి విజయ్‌కుమార్, ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి సతీష్‌యాదవ్ ,అభిమానులు పాల్గొన్నారు. భారత మహిళ క్రికెట్ జట్టు పట్టుదల, కృషి, క్రమశిక్షణ క్రీడాస్ఫూర్తికి నిదర్శనమన్నారు. మహిళలు ప్రతి రంగంలో అద్భుతంగా ప్రతిభ చాటుతున్నారని అన్నారు. భారతజట్టు విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# తుఫాన్ బాధిత కౌలు రైతులను ఆదుకోవాలి

## సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు



**విజయవాడ.నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మొంథా తుఫాన్ బాగా దెబ్బతీసిందని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి పంట నష్టపరిహారం చెల్లించడంతో వారి నుంచి ధాన్యం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూమిలేని కౌలుదారులు 91శాతం మందికి తుఫాన్ పరిహారం అందడం లేదన్నారు. 25 లక్షల మంది కౌలుదారులు ఉంటే కేవలం 4లక్షల కార్డులే ఇచ్చారని, భూ యాజమాని సంతకం లేకుండా బ్యాంకులు రుణం ఇవ్వడం లేదని తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తుఫాన్ వల్ల 80శాతం నష్టపోయింది కౌలు దారులేని పేర్కొన్నారు. వీరికి రుణాలు ఇవ్వకుండా వ్యవసాయాన్ని ప్రభుత్వం ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలతో నిమిత్తం లేకుండా కౌలు దారుల దరఖాస్తులను సచివాలయాల్లో బహిరంగంగా విచారణ జరిపించి తుఫాను నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు దారులకు కాకుండా భూ యాజమానికి పరిహారం చెల్లించడం దారుణమని, ఘోరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం వ్యవసాయాన్ని చేజేతులా నాశనం చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు. వరిపంట పండిస్తోంది ఎక్కువమంది కౌలుదారులేనని చెప్పారు. ఈ పంట దెబ్బతింటే ఆహార భద్రతకు ముప్పు వస్తుందని మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడంతో పాటు దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కౌలుదారులను ఆదుకునేందుకు కార్డులతో నిమిత్తం లేకుండా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మద్యం మత్తులో కన్నతండ్రిని కడతేర్చిన కసాయి

**బాడంగి, (విజయనగరం జిల్లా) నవంబరు 2 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా బాడంగి మండలం గొల్లాది గ్రామంలో కన్న తండ్రి నే కడ తేర్చిన కసాయి కొడుకు. పోలీసులు అందజేసిన వివరాలు ప్రకారం గొల్లాది గ్రామంలో మామిడి సత్యం 62 కన్న కొడుకు చేతిలో అతి కిరాతకంగా హతుడయ్యాడు. సత్యం కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో మంచం పట్టాడు.ఈయనకు భార్య ఆదమ్మ ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఇద్దరు కొడుకులు విశాఖలో కూలి పనులకు వెళ్లిపోయారు భార్య కూడా మనవరాలు ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వెళ్ళింది రాము మద్యానికి బానిసై తరచుగా తల్లిదండ్రులతో గొడవలు దిగేవాడు అలా తాగి వస్తావేంటి అని తండ్రి తల ఊపడంతో కోపోద్రిక్తుడై అర్ధరాత్రి మంచం మీద ఉన్న తండ్రిని కత్తితో అతి కిరాతకంగా నరికి తలను ముండము వేరు చేశాడు. దీంతో తల దగ్గరలో ఉన్న సచివాలయం వెనక్కి గేమేలలో పెట్టి వచ్చాడు ఇది గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా డి.ఎస్.పి భవ్య రెడ్డి సిఐ నారాయణరావు ఎస్సైలు ఘటనా స్థలం చేరుకొని నిందితుడిని అదుపులో తీసుకొని విచారించుచున్నారు. స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి శవ పంచాంగం చేసి బంధువులకి అప్పజెప్పారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితునికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# శ్రీవారి ఆశీస్సులతో సకలశుభాలు

**తిరుమల,నవంబరు2ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీక మాసంలో కైశికద్వాదశిన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. తెలంగాణమంత్రి శ్రీహరి, తమిళనాడు మంత్రి రామచంద్రన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ ఏవి రవీంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివా రిని దర్శించుకున్నారు. ఆశీస్సు లందుకున్నారు. ఆలయఅధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# తరచు రీషెడ్యూల్ అవుతున్న సికింద్రాబాద్- విశాఖ రైలు

## విజయవాడ జంక్షన్‌లో హాల్టింగ్ ఎప్పుడో తెలియని పరిస్థితి

**విజయవాడ,నవంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** సికింద్రాబాద్ -విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ మధ్య కాలంలో దక్షిణమధ్య రైల్వే రెగ్యులర్‌గా రీషెడ్యూల్ చేస్తోంది.ఈ రైలు షెడ్యూల్‌కు బయలు దేరు తున్న దాఖలాలు లేవు.రైలు ఆలస్యంగా నడుస్తుండటం గమనార్హం, విజయవాడ జంక్షన్‌కు ఈ రైలు వచ్చే అంశంలో తరచు టైమింగ్ మారుతుంది. ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మ్యాచింగ్ రైలు సమయాల్లో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా దీని సమయాలను తరచుగా మారుస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇలా రీషెడ్యూల్ చేసిన సికింద్రాబాద్‌విశాఖ వందే భారత్ రైలును ఇవాళ కూడా రీషెడ్యూల్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ప్రకటన చేసింది.ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి విశాఖకు వెళ్లాల్సిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును రీషెడ్యూల్ చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన చేసింది.

ఈ రైలు మధ్యాహ్నం 3 గంటలకు బదులుగా రాత్రి 10 గంటలకు విశాఖక బయలుదేరుతుందని అధికారులు ప్రకటించారు. ఇవాళ ఒక్కరోజే ఈ మార్పు అమల్లో ఉంటుంది. ఈ రైలుకు మ్యాచింగ్ రైలు ఆలస్యంగా నడుస్తుండటం వల్ల ఈ మార్పు చేసినట్లు అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రయాణాలు చేస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సకాలంలో రాకపోకలు సాగించే విషయంలో మాత్రం వెనుకబడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఇప్పటికే పలు వందే భారత్ రైళ్ల నిర్ణీత సమయంలో గమ్యాలకు చేరడంలేదనే ఫిర్యాదులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా సికింద్రా బాద్-విశాఖ వందే భారత్ రైలును కూడా పదే పదే సమయాలు మారుస్తుండటం వల్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇలా మార్పులు చేయాల్సి వస్తోందని అధికారులు చెప్తున్నారు.

# ఇంటిదైవం ఆశీస్సులందుకున్నాం

**తిరుమలలో నారా రోహిత్ నూతనదంపతులు**



**తిరుమల,నవంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** వివాహమైన తరువాత తిరుమలకు చేరుకుని ఇంటిదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని ఆశీస్సు లందుకున్నట్లు సినీ నటుడు నారారోహిత్ తెలిపారు. హైదరాబాద్‌లో రోహిత్ వివాహం శిరీషతో జరిగిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నూతన దంపతులు తిరుమలకు చేరుకున్నారు. కుటుంబసభ్యులతో కలసి ఆయన ఆలయం వద్దకు రాగానే టిటిడి అధికారులు స్వాగతం పలికారు. ఆనందనియంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

మూర్ఖులు రేపటి కోసం చూస్తే, వివేకులు నేటి రాత్రినే వినియోగించుకుంటారు.

న-గోథే

# అ'భద్రత'లో ఆలయాలు!


దైవసన్నిధానంలో తొక్కిసలాటలు సర్వసామాన్యమేనని సరిపెట్టుకోలేని పరిస్థితులు తలెత్తాయి. ఇంతవరకు జరిగిన సంఘటనలు మానవ తప్పిదాలుగా నిర్ణయించినా శ్రీకాకుళం జిల్లా పలాసతో కలిసిఉన్న కాశీబుగ్గ తొక్కిసలాట సంఘటన తీరే వేరు. తొక్కిసలాటల పర్యవసానం ఒకటే అయినా ఇలా జరగకుండా ఉండాల్సింది.అలా జరగకపోతే బాగుండేది అని చెప్పుకోదగిన సందర్భం. అది ఒక ప్రయివేటు నిర్వహణలో ఉన్న దేవాలయం. ప్రభుత్వ దేవాదాయశాఖకు ఏమాత్రం సంబంధం ఉండదన్నది నిజమే. అలాంటిచోట ఏం జరిగినా, శాంతిభద్రతల సమస్య ఏ విధంగా, ఏ రీతిన ఏర్పడినా ముందు జాగ్రత్తలు తీసుకోవడం వారిదే బాధ్యత. కానీ ఇక్కడ వారు తమకేమీ బాధ్యత లేనట్లుగా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి. ఎక్కడేమి జరిగినా తామే బాధ్యులమంటే ఎలా? అని ఆ శాఖ పెద్దలు వాదించినా వారి బాధ్యతనుంచి వారు పక్కకు జరుగలేరు. తెలుగునాట భక్తిరసం ఎలాసాగుతుందో తెలియనిది కాదు. అందులో ఇటీవల కాలంలో యువతలో సైతం ఆధ్యాత్మిక పెల్లుబికుతోంది. కాశీబుగ్గ దేవాలయానికి భక్తులు తండోపతండాలుగా వచ్చినపుడు ఒక్క పోలీసు కూడా క్యూలో వరుసల నియంత్రణకు లేదన్న అక్కడ ఒకే ఒక్క ఆరోపణ రాష్ట్ర దేవాదాయశాఖ, పోలీసు యంత్రాంగం వీటన్నింటినీ అజమాయిషీ చేసే ప్రభుత్వంపై పెద్ద బండ పడింది. ఎవరూ బాధ్యత వహించే పరిస్థితి లేదు. జరగరానిది జరిగిపోయింది. ఎవరూఊహించినది కాదు. కోరుకున్నది కాదు. కార్తీక మాసంలో ఎనిమిది మంది భక్తురాళ్లు, ఒక పసివాడు ఈ తొక్కిసలాటలో మృతి చెందారు. మరో 20 మంది గాయపడ్డారు. గోవింద నామస్మరణతో భక్తులు తన్మయత్వంతో ముందుకు కదులుతున్నవేళ ఇలా అమాంతం మృత్యువు మీద పడ్తుందని ఎవరూ ఊహించలేదు. కార్తీకమాసంలో మహాశివుడినేకాక, కార్తీక దామోదరుడిగా శ్రీ మహావిష్ణువును కూడా కొలుస్తారు. అందుకే వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్తరాంధ్ర ప్రజలు అధికంగా వచ్చారు. కార్తీక ఏకాదశి మహా పర్వదినంగా భావిస్తారు. ఈ ఆలయంలో కింది ఫ్లోర్ నుంచి మెట్లు ఎక్కిన తర్వాతనే గర్భగుడి, అందులో స్వామి విగ్రహం కనపడుతుంది. కాగా రాకపోకలకు అవే మెట్లు ఉపయోగిస్తారు. సాధారణ రోజుల్లో జనం తక్కువగా ఉంటారు. కనుక ప్రస్తుతమున్న ఏర్పాట్లు సరిపోవచ్చు. కానీ ఇంత పెద్ద రద్దీ ఉన్నప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాల్సిందే. భక్తులు స్వామి సన్నిధిలో దర్శనానికి పైకి వెళ్లేందుకు, కిందకు వచ్చేందుకు ఒకే దారి ఉండడం ఎటూ క్షేమం కాదు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కేవలం బాగా ఆదాయం వచ్చే ఆలయాలను మాత్రమే స్వాధీనం చేసుకోవడానికి దేవాదయశాఖ ఉవ్విళ్లూరుతుంది. తప్ప ఆలయాల అభివృద్ధి, ఆగమ శాఖ నియమ నిబద్ధతలను కాపాడడం, భక్తులకు సౌకర్యాలు ఎలా ఉన్నాయన్న విషయంలో శ్రద్ధ చూపని ఈ శాఖ కాశీబుగ్గ సంఘటన జరిగిన వెంటనే, దానినొక ప్రయివేటు దేవాలయంగా చిత్రీకరించి చేతులు దులుపుకోవడం మంచి పద్ధతి కాదు. ఉదయం 11.45 గంటల సమయంలో భక్తుల రద్దీ పెరిగి వారి తాకిడికి కుడివైపు రెయిలింగ్ ఒరిగి పోగా ఒక్కసారిగా భక్తుల్లో అలజడి వలన తొక్కిసలాట జరిగింది. ఒకరిమీద ఒకరు పడి ఊపిరాడక ఈ ఆలయంలో సాధారణ సమయాల్లో కేవలం రెండు వేలమంది భక్తులు మాత్రమే నిలబడే వీలుంది. కానీ ఏకాదశి పుణ్యదినం పేరుతో ఎంతో మంది భక్తులు ఈ గుడిలో పిల్లాపాపలతో సంపూర్ణ భక్తిభావంతో విచ్చేసారు. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించాక ఎపుడు దర్శనం అవుతుందా! అనే ఆతృత తప్ప మరో విషయం గోచరించదు. ఇది భక్తుని మనో సంకల్పం. కానీ గుడిలో జాగా లేదు.రద్దీ ఉందనుకున్నపుడు కొంతమంది గుడిబయటే ఉండిపోతే అనర్థం జరిగేది కాదు. నాలుగునెలల క్రితమే ప్రారంభమైన ఈ దేవాలయాన్ని హరి ముకుంద్ పాండే అనే 94 ఏళ్ల వృద్ధుడు నిర్వహిస్తున్నాడు. ఆయన ఒడిశా రాజకుటుంబానికి చెందిన వ్యక్తిగా చెప్తుంటారు. 'ఒకసారి దర్శిస్తే చాలు మీ పాపాలు పటాపంచలైపోతాయి' అనే ప్రవచనాలకు లొంగే భక్తులు పుణ్యం మూట కట్టుకోవాలని తొందరపడుంటారు. అదే వారి పాలిటి మృత్యుపాశాలవుతాయని వారు భావించి ఉండరు. ప్రాచీన ఆలయాలను వాటి దర్శనం మహిమాన్వితమని నమ్మే జనమున్న ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక చింతన ఏమేరకు పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. వైకుంఠ ఏకాదశినాడు తిరుమలలో ఆరుగురు, సింహాచలం చందనోత్సవం రోజున గోడకూలి ఏడుగురు, తాజా దుర్ఘటనలో 9మంది... ఇలా వరుస తొక్కిసలాటలు జరుగుతున్నా ఏలినవారు జాతీయ విపత్తు సంస్థ ఇలాంటి విషాద దుర్ఘటనల విషయంలో ఇచ్చిన సూచనలను ఎందుకు పాటించలేకపోతోందో అర్థంకాదు. ఆ దేవాలయం ప్రయివేటుది, అది ఉన్నట్లే తమకు తెలియదని దేవాదాయ పెద్దలు చెప్తున్నారంటే వారి నేతృత్వంలోని దేవాదాయశాఖ మొద్దునిద్ర పోతున్నట్లే అనుకోవాలి. అసలింతకన్నా ముందుగా భక్తులఆలోచన విధానం మారాలి. ఎలాగైనా దైవదర్శనం చేసేసుకోవాలనే ధోరణి మారాలి.ఇంత కాలం జరిగిన తొక్కిసలాటలో 79 శాతం విషాదాలు మతపరమైన కార్యక్రమాల్లోనే జరిగాయని అధ్యయనాలలో తేలిన అంశాలు. అలాంటివి జరిగినపుడు ప్రభుత్వ ఇతర విభాగాలు సమన్వయంతో తమ కనుసన్నల్లో నిర్వహిస్తే పూర్తి జవాబుదారీగా ఎలాంటి విషాదాంత ఘటనలు జరుగకుండా గట్టెక్కవచ్చు. అపుడే భక్తులకు పుణ్యానికి పుణ్యం, ప్రాణాలకు భద్రత ఉండగలదు.

మంచి పనులు చేయాలి గాని వాటి గురించి పగటి కలలు కంటూ కాలం వెళ్లబుచ్చకూడదు.



చార్లెస్ కింగ్స్లే

మంచివాడు కావాలంటే మంచి మనసు ఉండాలి. అది తనలో ఉండాలే తప్ప మరొకరు ఇచ్చేదికాదు.



సెయింట్ అగస్టీన్

# రాజకీయ ఉచ్చులో బిసి రిజర్వేషన్ బిల్లు!

**వెనుకబడిన తరగతుల (బీసీ) కులాలకు నలభై రెండు శాతం విద్యా, ఉద్యోగ, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే విధానానికి ప్రభుత్వం నాంది పలకడం ఆహ్వానించ తగ్గ పరిణామమే అయినా, న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఈ అంశంపై ఎలక్షన్ల ముందే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అన్ని రాజకీయ పార్టీలు దృఢ సంకల్పంతో నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్ పెంపు అమలుపై ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో పరస్పర సహకారంతో అన్ని వర్గాల భాగస్వామ్యంతో బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు చట్టసభల్లో ఆమోదం చేయించేందుకు ప్రక్రియనీ సాధ్యమైనంత త్వరగా చేపట్టాల్సి ఉంటుందనే వాదనలు బీసీ వర్గాల నుండి వినిపిస్తున్నాయి. కానీ ఈ అంశాన్ని రాజకీయ పార్టీలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవాలనే ప్రయత్నం చేస్తే బిల్లు ఆమోదం ప్రక్రియలో కొంత ఆలస్యం జరగవచ్చనే భిన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఏమైనా రానున్న రోజుల్లో వెనుకబడిన తరగతులకు నలభైరెండు శాతం రిజర్వేషన్ కల్పించాలనే అంశం అన్నిరాజకీయ పార్టీలను ఏవిధంగా ప్రభావితం చేయగలదో వేచిచూడాల్సిందే.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

తెలంగాణ రాష్ట్రంలో వెనుక బడిన తరగతుల కులాలకు నలభై రెండు శాతం, రిజర్వేషన్ పై చేసిన ఆర్డినెన్స్ ప్రకియ, జీవో నెంబర్ తొమ్మిదితో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం న్యాయ స్థానంలో చట్టపరమైన అవరోధాలతో ఎన్నికల నిర్వహణ ఆగిపోవడం, చివరకు బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఉభయ సభల ఆమోదం ద్వారానే సాధ్యం అనే చర్చ అన్ని వర్గాల్లో జోరుగా సాగుతుంది. బీసీలకు రిజర్వేషన్ పెంపు విషయమై క్షేత్రస్థాయిలో ఆచరణాత్మక అమలు విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని పార్టీలు ఏక అభిప్రాయంతో రాజకీయాలకు అతీతంగా అసెంబ్లీలో నలభై రెండు శాతం వెనుకబడిన తరగతుల వర్గాల (బీసీ) వారికి రిజర్వేషన్లు కల్పించాలనే తీర్మానానికి మద్దతు ఇవ్వడం జరిగింది. అయితే తెలంగాణలో జరిగిన కులగణన సర్వే ఆధారంగా రాష్ట్రంలో బీసీ కులాలకు చట్టసభలతో పాటు విద్యా,ఉద్యోగ ,ఉపాధి అవకాశాలలో నలభై రెండు శాతం రిజర్వేషన్ కల్పించాలనే న్యాయ సమ్మతమైన విధానాన్ని అధిక శాతం అన్ని పార్టీల్లోని వివిధ సామాజిక వర్గం వారితో పాటు అగ్ర కులాల వారు సైతం తప్పనిసరియై న్యాయ సమ్మతమైన బీసీ రిజర్వేషన్ బిల్లుకు వత్తాసు పలకడం జరిగింది. ఎస్సీ ఎస్టీ మైనార్టీలు కూడా బీసీల ఆకాంక్షను సమర్థించాల్సి వచ్చింది. ఈ క్రమంలో బీసీల నలభై రెండు శాతం రిజర్వేషన్ అమలు బిల్లు అసెంబ్లీలో తీర్మానం తర్వాత అనుకున్న స్థాయిలో పురోగతి లేకపోవడంతో, తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ మండల పరిషత్, ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ ఎలక్షన్ల నిర్వహణలో బీసీల రిజర్వేషన్ పై ప్రభుత్వం తొమ్మిదో తేదీ నెంబర్ జీవోజారీ చేసినప్పటికీ కొందరు జీవోను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు వరకు వెళ్లడం జరిగింది. సుప్రీంకోర్టులోనూ జీవోకు చెక్కెదురు కావడంతో బీసీ బిల్లు ఆమోద ప్రక్రియకు ఎంతకాలానికి మోక్షం లభిస్తుందో చూడాల్సిందే. అయితే ఈ అంశమై పార్టీలు పరస్పర విమర్శలు చేసుకోవడం వరకే పరిమితమైనట్టు అనిపిస్తుందని ,పార్లమెంట్ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును రాజకీయాలకతీతంగా ఆమోదింప చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలనే అభిప్రాయాలు విభిన్న వర్గాలలో లేకపోలేదు. ప్రభుత్వం సదుద్దేశంతో చేసిన బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్ అమలు అంశంలో కొన్ని సందర్భాలలో పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయా లేక విభిన్న రీతిలో వ్యవహరిస్తున్నాయా లేక కాలయాపన చేయడానికి ఈ వ్యవహారం నడుస్తుందా అనే సందేహాలు కలగక మానవు.అయితే దశాబ్దాల తరబడి తమ హక్కుల





కోసం పోరాడుతున్న బీసీల న్యాయ మైన రిజర్వేషన్ల డిమాండ్ను కనీసం ఆ డిమాండు మంచిదా, కాదా! వారు నిజంగానే అగ్రకులాల కంటే ఎక్కువ అసమానతలకు గురవుతున్నారా అనే చర్చకూడా కోర్టులు, అగ్రకులాలు, పార్లమెంటు చేయకపోవడం అంటే బీసీల పైన కేంద్రానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుంది. ఇంత జరుగుతున్నా బీసీ రిజర్వేషన్లు అడిగిన పార్టీలపైన, వ్యక్తుల పైన మాటలతో ఎదురు దాడి చేయడం, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం, ఆ వ్యతిరేక భావాలను మొత్తం రిజర్వేషన్ల వ్యతిరేకులను రెచ్చగొట్టడం, కోర్టుల ద్వారా అడ్డుకోవడం దాన్ని మతానికి అన్వయించి రాజకీయ లబ్ధిపొందడం, కొన్ని పార్టీలకు మొదటి నుంచి వెన్నతో పెట్టిన విద్యనే. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి కులవ్యవస్థ ప్రాధాన్యత అధికమై ఉన్నప్పటికీ బీసీ సామాజిక వర్గాల ప్రజల జీవన విధానాలలో చెప్పుకోదగ్గ స్థాయిలో మార్పులు గోచరించలేకపోవడం, విద్యా, ఉపాధి రంగాలలో వెనుకబాటు, చట్టసభల్లో రాజ్యాధికారం దక్కిన సందర్భాలు చాలా అరుదుగా ఉండటం, ఆర్థికస్థితిగతులు చాలావరకు మెరుగైన స్థితిలో లేకపోవడం లాంటివి ఒక ఎత్తు అయితే ,సమా జంలో అధిక శాతం ఉన్న బీసీ సామాజిక వర్గం వారు ఎక్కువగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన వర్గాలవారికి ఓటు బ్యాంకుగానే మిగిలి పోతున్నారా అనే సంశయం బీసీ వర్గాల్లో లేకపోలేదు. వెనుకబడిన కులాల ఆవశ్యకత అభివృద్ధి విధానాలను ఏర్పరచుకోవడానికి చట్టసభల్లో బీసీ వర్గాల ప్రాధాన్యత తగినంతగా లేకపోవడం చట్టసభల్లో అభివృద్ధి చెందిన వర్గాలకు చెందిన కొందరు వెనుకబడిన తరగతుల వర్గాల (బీసీ)వారికి కులాల వ్యవస్థలపై నిర్ణయాలు తీసుకో వలసి రావడం, వారి అభిప్రాయాల్ని అమలు చేసే విధా నాలే చట్టసభల్లో కనిపిస్తుండడం సర్వసాధారణమైపోతుం దనే భిన్న స్వరాలు బీసీ వర్గాల నుండి వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ వెనుకబడిన తరగతుల (బీసీ) కులాలకు నలభై రెండు శాతం విద్యా, ఉద్యోగ, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే విధానానికి ప్రభుత్వం నాంది పలకడం ఆహ్వానించ తగ్గ పరిణామమే అయినా, న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఈ అంశంపై ఎలక్షన్ల ముందే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అన్ని రాజకీయ పార్టీలు దృఢ సంకల్పంతో నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్ పెంపుఅమలుపై ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో పరస్పర సహకారంతో అన్ని వర్గాల భాగస్వామ్యంతో బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు చట్టసభల్లో ఆమోదం చేయించేందుకు ప్రక్రియనీ సాధ్యమైనంత త్వరగా చేపట్టాల్సి ఉంటుందనే వాదనలు బీసీ వర్గాల నుండి వినిపిస్తున్నాయి.కానీ ఈ అంశాన్ని రాజకీయ పార్టీలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవాలనే ప్రయత్నం చేస్తే బిల్లు ఆమోదం ప్రక్రియలో కొంత ఆలస్యం జరగవచ్చనే భిన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఏమైనా రానున్నరోజుల్లో వెనుకబడినతరగతులకు నలభైరెండుశాతం రిజర్వేషన్ కల్పించాలనే అంశం అన్నిరాజకీయ పార్టీలను ఏవిధంగా ప్రభావితం చేయగలదో వేచిచూడాల్సిందే. •

# నైతిక విలువల పతనంతో అభివృద్ధి వినాశనం



మేకిరి దామోదర్

మనిషి జీవితానికి ఉన్నత లక్ష్యం ఉండాలి. తినడం, బతకడం, పోటీ పడటం ఇవే జీవితం కాదు. మనిషి పెరుగుదల అంటే శారీరకంగా కాదు, మానసికంగా, నైతికంగా ఆరోగ్యంగా, శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా ఎదగడం. ఇదే భారతీయ సంస్కృతికి హృదయం.మన సంస్కృతి మనిషిని యంత్రంగా కాకుండా సమగ్ర వ్యక్తిత్వం గల మనిషిగా తీర్చిదిద్దే మార్గం చూపింది. మహాత్మాగాంధీ చూపిన మార్గం నైతికతతో కూడిన ప్రగతిశీల సమాజాన్ని నిలబెట్టే నిజమైన శక్తి. నేటి కాలంలో ఆ నైతిక విలువలే బలహీనపడ్డాయి. ఇలాంటి సమాజంలో శాంతి లేకపోతే ప్రజాస్వామ్యానికి బలం ఉండదు. శాంతి,ప్రజాస్వామ్యం రెండూ ఒకే నాణ్యానికి రెండు పార్శ్వాలు, ఒకటి లేకుండా ఇంకొకటి ఉండదు. మనిషికి కేవలం తిండి, వస్త్రం, నివాసం మాత్రమే కాదు సాంస్కృతిక,ఆధ్యాత్మిక మానవీయ విలువలూ అత్యవసరం. ఈ విలువలతోనే భారతదేశం ప్రపంచానికి దిశానిర్దేశం చేసింది. ఆంగ్లేయులు భారతదేశాన్ని విడిచి వెళ్ళడానికి కారణం మన సైనిక బలం కాదు, మన నైతిక బలం. నైతికతే అస్త్రం" అని మహాత్మా గాంధీ నిరూపించారు. ఆయన జీవితం సత్యం, అహింస, నిబద్ధత అనే మూడు మూలస్తంభాలపై నిర్మితమైంది. ఆనందం అనేది రెడీమేడ్ వస్తువు కాదు. అది మన ఆలోచన, మాట, ఆచరణ – ఈ మూడింటి సమన్వయం ఫలితంగా జరిగే అనుభూతి. అది మనలోని శాంతికి, సమాజంలోని సుస్థిరతకు పునాదిగా ఉంటుంది. కానీ నేటి ప్రజా జీవితంలో విలువలు బలహీనపడ్డాయి. కుల-మత తత్వాలు, హింస, అవినీతి, దురాశ సమాజాన్ని కుళ్లజేస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో మన దేశం సాంకేతికంగా ముందుకెళ్తున్నా, నైతికంగా వెనక్కి వెళ్తోంది. ఆధునిక సాంకేతికత ప్రగతికి తోడ్పడాలి,నేరాలకు కాదు. (ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం) దేశవ్యాప్తంగా ఫోరెన్సిక్ విభాగాల్లో సైంటిఫిక్ సిబ్బంది ఖాళీలు సగటున 50పైగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో 40.5,తెలంగాణలో 91,హర్యానాలో 73, ఉత్తరప్రదేశ్ లో 66, పశ్చిమబెంగాల్‌లో 69పోస్టులు ఖాళీగా ఉన్నాయి.





హింసలు, నేరాలు పెరుగుతున్న దేశంలో,ఈ స్థాయి నిర్లక్ష్యం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. నేరాల విచారణలో కీలకమైన ఫోరెన్సిక్ నిపుణుల కొరతవల్ల అనేక కేసులు నిలిచిపోతున్నాయి. ఇది ప్రజలలో న్యాయ నమ్మకాన్ని దెబ్బ తీస్తుంది. ప్రభుత్వాలు వెంటనే ఈ ఖాళీలను భర్తీ చేయాలి. న్యాయం వేగంగా జరిగే వ్యవస్థను బలోపేతం చేయాలి. సమాజంలో మానవీయ విలువలు పెంపొందించకపోతే హింస పెరుగుతుంది. మనిషి ఎదగాలంటే ముందు ఆలోచనలో స్వచ్ఛత ఉండాలి. మనిషి పెరిగితే చాలదు, ఎదగాలి అంటే శరీరం కాదు, మనసు పెరగాలి, ఆలోచన విస్తరించాలి. ఎదగడం గర్వకారణం.ఎదిగినవారు విభిన్నంగా ఆలోచిస్తారు, నూతన మార్గాలను వెతుకుతారు. కాని నేటి సమాజంలో నాకెందుకు?" అనే నిర్లిప్తత మానవతను నశింపజేస్తోంది. ఇలాంటి ఆలోచనల వల్ల మనిషి ఎదగక ముందే వృద్ధుడవుతాడు. ఎవరో వస్తారు, ఏదో చేస్తారు" అని ఎదురుచూస్తూ జీవితాన్ని వృథా చేసేస్తాడు. కార్యసాధకుడు భయపడడు. భయానికి విరుగుడు – ఆత్మవిశ్వాసం. మంచి ఆలోచనలు, నిబద్ధతతో ముందుకు సాగడమే విజయానికి మార్గం. కవి శ్రీశ్రీ చెప్పినట్లుగా గాయం తెలియని శిల్పం లేదు,నిప్పు ఎరుగని ఖడ్గం లేదు. అదే జీవన సత్యం. జీవితంలో ఏదీ మన దగ్గరికి తానుగారాదు. శోధించి, సాధించాల్సిందే. మన ఆలోచనలే మన దిశను నిర్ణయిస్తాయి. క్రమబద్ధమైన, లోతైన ఆలోచనలు మన జ్ఞానాన్ని, మానసిక ధైర్యాన్ని పెంచుతాయి.మంచి ఆలోచనలు మంచి ఫలితాలు తెస్తాయి. చెడు ఆలోచనలు చెడు ఫలితాలు. మనిషి ఎలా ఆలోచిస్తాడో అలాగే అవుతాడు. ఆలోచన శుద్ధి మనసుకు శాంతి, జీవితానికి స్పష్టత, విజయానికి బాట. స్వార్థం, అత్యాశలను తగ్గిస్తే మనిషి నిజమైన ఆనందాన్ని అనుభవిస్తాడు అని పాశ్చాత్య జ్ఞానులు చెప్పిన మాట శాశ్వత సత్యం. డబ్బు మనిషి చేతిలో ఉండాలి, మనిషి డబ్బు చేతిలో కాదు.మనిషి ఎదుగుదల అంటే ఉద్యోగం, పదవి,డబ్బు కాదు.అది నైతికతతో కూడిన ఆలోచన, ఆచరణ, సేవా భావం, సామాజిక బాధ్యత. ఎదిగినవాడు తనతోపాటు సమాజాన్ని కూడా ఎదిగించాలి. ఆలోచనలో సత్ప్రవర్తన,జీవితంలో నిబద్ధత ఇవే నిజమైన వ్యక్తిత్వ సూచికలు. మనిషి పెరిగితే ముసలివాడు అవుతాడు, ఎదిగితే సమగ్ర వ్యక్తిత్వం గల మనిషి అవుతాడు. ఎదిగిన మనసు, నిబద్ధతతో కూడిన ఆలోచనలతోపాటూ నాయకత్వ స్థానాల్లో ఉన్న పాలకులు చాలా పాత్రలు పోషించాల్సి ఉంటుంది.రోజువారి బాధ్యతలతోపాటు ముఖ్యంగా చేయాల్సినవి రెండుఉన్నాయి.ఒకటి దేశ సమగ్ర అభివృద్ధికి,సమ్మిళిత ప్రగతికి వ్యూహరచన. రెండవది ఆరోగ్యవంతమైన, చైతన్యవంతమైన సమాజాన్ని ప్రోత్సహిస్తూ రెండోతరం నాయకులను తయారు చేయడం.ఇవే మన దేశానికి దిశానిర్దేశం. •

# సముద్ర గర్భానికి సాంకేతిక పురోగతి

డి. మోహన రావు

భారతదేశ వైజ్ఞానిక ఆకాంక్షలు అంతరిక్షానికే పరిమితం కాకుండా ఇప్పుడు మహాసముద్రాల అట్టడుగున ఉన్న అగాధాలను కూడా ఛేదిస్తున్నాయి. ఇటీవల ఇండోఫ్రెంచ్ సహకారంలో భాగంగా ఇద్దరు భారతీయ శాస్త్రవేత్తలు అట్లాంటిక్ మహాసముద్రంలో 5,000 మీటర్ల లోతుకు విజయవంతంగా ప్రయాణించారు. ఈ చారిత్రక విజయం దేశ వ్యూహాత్మక, శాస్త్రీయ, ఆర్థిక భవిష్యత్తుకు కొత్త ద్వారాలు తెరిచింది. గతంలో ఇస్రో చంద్రయాన్, గగన్‌యాన్ వంటి మిషన్లతో అంతర్జాతీయ వేదికపై తన సత్తాను నిరూపించుకోగా ఇప్పుడు మన దేశం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ వంటి సంస్థల ద్వారా సముద్ర పరిశోధనలో తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. దశాబ్దాలుగా లోతైన సముద్ర అన్వేషణ అనేది అమెరికా,రష్యా, ఫ్రాన్స్, చైనా, జపాన్ వంటి కొన్ని అగ్రశ్రేణి దేశాల ఆధిపత్యంలో ఉంది. ఈ దేశాలు మాత్రమే సముద్రాల క్లిష్టమైన వాతావరణాన్ని తట్టుకోగల అధునాతన సాంకేతికతను కలిగి ఉన్నాయి. లోతైన సముద్రంలో ఉండే అధిక పీడనం, శీతల ఉష్ణోగ్రతలు, పూర్తి చీకటి వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అత్యాధునిక డిజైన్, బలమైన మెటీరియల్స్ అవసరం. ఈ నేపథ్యంలో, భారత శాస్త్రవేత్తలు సాధించిన విజయం ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ ఘనత మనదేశం ఈ అగ్రశ్రేణి దేశాల సరసన నిలవగలదని నిరూపించింది. ఇది కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాకుండా, దేశ దీర్ఘకాలిక వ్యూహాత్మక దార్శనికతకు ఒక సంకేతం. భూమి ఉపరితలంలో ఉన్న దాదాపు 70శాతం సముద్రమే అయినా అందులో 5 శాతం కంటే తక్కువ భాగాన్ని మాత్రమేమనం పూర్తిగా అన్వేషించాం. ఈలోతైన సముద్రాలు అపారమైన ఖనిజ వనరులకు నిలయాలు. వీటిలో ముఖ్యమైనవి చూస్తే మొదటివి ఈ బంగాళాదుంప ఆకారపు ఖనిజాలు నికెల్, కోబాల్ట్, రాగి మాంగనీస్‌లను కలిగి ఉంటాయి. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి, పునరుత్పాదక ఇంధన సాంకేతికతకు అత్యంత అవసరం. రెండోది హైడ్రో థర్మల్ సల్ఫైడ్‌లు. ఇవి బంగారం, వెండి, రాగి, ఇతర లోహాలతో కూడిన ఖనిజాలు. ఇవి సముద్ర అడుగున ఉన్న అగ్నిపర్వతాల వద్ద ఏర్పడతాయి. చివరవి రేర్ ఎర్త్ మెటల్స్. ఇవి స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, రక్షణ రంగ పరికరాల తయారీలో కీలకమైనవి. భవిష్యత్తులో ఈ ఖనిజాల కోసం దేశాల మధ్య పోటీ తీవ్రం కానుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ వనరుల ప్రాముఖ్యత పెరుగుతున్నదృష్ట్యా,వాటిపై స్వయం ప్రతిపత్తిని సాధించడం మనదేశ జాతీయ భద్రతకు, ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకం. ఈ లక్ష్యాలను సాధించడానికి ఈ అన్వేషణలు ఒక పునాది వేస్తాయి. భారతదేశం ఇప్పటికే ఇంటర్నేషనల్ సీబెడ్ అథారిటీ ద్వారా మధ్య హిందూ మహాసముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక మైనింగ్ సైట్‌ను కేటాయించుకుంది. ఈ సైట్‌ను



సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి, లోతైన సముద్ర అన్వేషణ, మైనింగ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం తప్పనిసరి. ఈ చారిత్రక ఘనత సాధించడంలో ఫ్రాన్స్‌తో ఉన్న భాగస్వామ్యం చాలా ముఖ్యమైనది. ఫ్రెంచ్ సబ్‌మెర్సిబుల్ సహకారంతో లోతుకు వెళ్లడం, భారతీయ శాస్త్రవేత్తలకు క్లిష్టమైన డీప్‌సీ ఆపరేషన్లలో విలువైన అనుభవాన్ని అందించింది. ఈ సహకారం మన శాస్త్రవేత్తలకు నైపుణ్యాన్ని అందించడమే కాకుండా మన స్వదేశీ ప్రాజెక్టు అయిన మత్స్య6000 సబ్‌మెర్సిబుల్ అభివృద్ధికి కూడా ఉపయోగపడింది. మత్స్య6000 అనేది ఆరు వేల మీటర్ల లోతుకు ప్రయాణించి ముగ్గురు వ్యక్తులను తీసుకెళ్లగల ఒక మానవసహిత సబ్‌మెర్సిబుల్. ఇది భారతదేశ 'సముద్రయాన్' ప్రాజెక్ట్‌లో ఒక కీలకమైన భాగం. దాని తయారీలో కీలకమైన భాగాలు, అంటే టైటానియం అలాయ్ హ్యూమన్ స్పియర్ (అత్యంత పీడనాన్ని తట్టుకునే గట్టి గోళం) అధునాతన నేవిగేషన్ వ్యవస్థలు ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయి. భారత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయడానికి, దానిని 2026 నాటికి పూర్తి చేయడానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే, అమెరికా, రష్యా, చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాల సరసన భారతదేశం నిలుస్తుంది. ఇది కేవలం ఒక సాంకేతిక విజయం మాత్రమే కాకుండా దేశ ఇంజనీరింగ్, పరిశోధనా సామర్థ్యాలకు ఒక గొప్ప నిదర్శనం. సముద్ర భద్రత, లోతైన సముద్ర పరిశోధన కేవలం ఆర్థిక ప్రయోజనాలకు మాత్రమే పరిమితం కాదు. ఇది మనదేశానికి వ్యూహాత్మక భద్రత పరంగా కూడా చాలా ముఖ్యం. భవిష్యత్తులో దేశాల మధ్య లోతైన సముద్రంలో గెరిల్లా యుద్ధాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సముద్ర గర్భంలో దేశాలు కమ్యూనికేషన్ కేబుళ్లను, పైప్‌లైన్‌లను ఇతర నిర్మాణాలను దెబ్బతీసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో,లోతైన సముద్ర పరిశోధనలో మనదేశ సామర్థ్యం పెంపొందించడం దేశ భద్రతకు అత్యంత అవసరం. ఈ చారిత్రక ఘనత కేవలం ఒక ఆరంభం మాత్రమే. ఇది భవిష్యత్తు కోసం ఒక వ్యూహాత్మక పెట్టుబడి. ఈ విజయాన్ని ఒక ఉత్ప్రేరకంగా ఉపయోగించుకుని, భారతదేశం కొన్ని చర్యలను తీసుకోవాలి. అవి మత్స్య6000 ప్రాజెక్ట్‌కు పూర్తి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దీనిని ఒక జాతీయ ప్రాధాన్యత కలిగిన మిషన్‌గా పరిగణించి, నిధులు,సాంకేతిక మానవ వనరులను కేటాయించాలి. ఈ ప్రాజెక్టును వేగవంతం చేయడం ద్వారా ప్రపంచ దేశాలకు మనం ఈ రంగంలో ఎంత సీరియస్‌గా ఉన్నామో నిరూపించుకోవచ్చు. కేవలం ప్రభుత్వ సంస్థలపైనే ఆధారపడకుండా, లోతైన సముద్ర పరిశోధనలో ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి. లోతైన సముద్ర మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించే ముందు పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా చూడాలి. పర్యావరణ పరిరక్షణలో ఒక ప్రపంచ ఆదర్శంగా నిలవాలి. ఈ చారిత్రక ఘనత భారతదేశం సంకల్పానికి, దూరదృష్టికి నిదర్శనం. చంద్రునిపై కాలు మోపిన తర్వాత, మనం ఇప్పుడు సముద్ర గర్భంలో ఉన్న నిధులను అన్వేషించడానికి సిద్ధం గా ఉన్నాం. ఈ విజయం భారతదేశాన్ని ఒక సాంకేతిక శక్తిగా మాత్రమే కాకుండా, భవిష్యత్తులో ప్రపంచ అర్థ పర్యావరణ విధానాలను రూపొందించే ఒక నాయకత్వ స్థానంలో నిలబెడుతుంది. •

# ప్రజావాక్కు



### మాజీ క్రికెటర్‌కు మంత్రి పదవా?

రాజకీయ నాయకుడిగా అవతారమెత్తిన భారత మాజీ క్రికెట్ కెప్టెన్అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెసు తరపున పోటీచేసి బి.ఆర్.ఎస్. అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడాయన ఎమ్.ఎల్.సి. కూడా కాదు. కాని ఆయనకు ఏకంగా రాష్ట్ర కాబినెట్‌లో మంత్రి పదవిని అర్జెంటుగా కట్టబెట్టారు. ఇందుకు కారణం జూబ్లీహిల్స్ కు రేపు జరగబోయే ఉపఎన్నికల్లో అధికంగా ఉన్న ముస్లిం, క్రికెట్ అభిమానుల ఓట్లను ఆకర్షించి అధికార పార్టీ ప్రతినిధిని ఏలాగైనా గెలిపించాలనే తాపత్రయంతో అజహరుద్దీన్‌కు మంత్రి పదవిని ఇచ్చారనే విషయం అర్థంకానిది కాదు. ఏ పార్టీ ఎత్తుగడలు వారివి. చూద్దాం ఓటర్లు ఏం నిర్ణయిస్తారో!

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### 12వ పీఆర్సీ కమిషన్ ప్రకటించాలి

కేంద్ర ప్రభుత్వం ఒకటి జనవరి 2026వ సంవత్సరం నుంచి అమలు కాబోయే కేంద్రప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల 8వ పే రివిజన్ కమిషన్‌కు చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జిఅయిన రంజనా ప్రకాష్ దేశాయ్ గారిని నియమించడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకటి జూలై 2023నుండి అమలుకావలసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల 12వ పేరివిజన్ కమిషన్‌కు చైర్మన్‌ను ఇప్పటివరకు నియమించలేదు. అయితే 12 జూలై2023న గతప్రభుత్వం డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను 12వ పేరివిజన్ కమిషన్కు చైర్మన్‌గా నియమించినారు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అనిమొదలైన ఈఅలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, నిద్ర సరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది. మొబైల్ గేమ్స్, వీడియోలతో సమయం వృథా అవ్వడంతో చదువుపై దృష్టి తగ్గిపోతోంది. స్నేహితులతో ఆడుకోవడం, మాట్లాడడం తగ్గి పిల్లలు ఒంటరిగా మారుతున్నారు. కొన్ని సార్లు అనుచితమైన కంటెంట్ చూసే ప్రమాదం కూడా ఉంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఎన్నికల ప్రక్రియ అంతా మోసమేనా?

బీహార్ ఓటరు జాబితా సమగ్ర సవరణలో భారీగా ఓట్లను తొలగించి వాటి స్థానంలో తమకు అనుకూలంగా ఓటు వేసే వారి పేర్లు చేర్చారని బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలనే ఉద్దేశ్యంతో పద్ధతి పాడు లేకుండా సర్ కార్యక్రమాన్ని చేపట్టారని ఈ ఓటరు జాబితా సవరణ పచ్చి మోసమని విపక్ష పార్టీలు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. ఇదిలా ఉంటే కర్ణాటకలోని మహాదేవ్‌పురం లోక్‌సభ స్థానంలో కూడా ఏదో గోల్‌మాల్ చేసి బిజెపి తన అభ్యర్థిని గెలిపించుకుందని నిరూపించడానికి తన వద్ద బలమైన సాక్ష్యం ఉందని రాహుల్‌గాంధీ ఎంతగా చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

- ఎం. శ్రీనివాస్, హైదరాబాద్

### పట్టణీకరణతో వేగంగా ఎదుగుతున్న రాష్ట్రం

సేవల రంగంలో తెలంగాణ కర్ణాటకను అధిగమించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంవేగంగా పట్టణీకరణ దిశగా పయనించడంతో సేవల రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. నిపుణులఅభిప్రాయం ప్రకారం,ఐటీ,ఫైనాన్స్, విద్య, ఆరోగ్యం, రియల్ ఎస్టేట్ వంటి విభాగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి దేశంలోనే ఆదర్శప్రాయమని చెప్పవచ్చు. ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాల విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహక విధానాలు, డిజిటల్ ఇన్నోవేషన్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఈ అభివృద్ధికి ప్రధాన బలాలుగా నిలిచాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### గ్రామీణ వ్యవస్థలోనే భారతదేశ ఆత్మ

ఎన్ని శాస్త్ర సాంకేతిక పద్ధతులు వచ్చినా భారత దేశం ఆత్మ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలలోనే ఉంది. తెలంగాణను సీడ్ హబ్‌గా తయారు చేయొచ్చు. అందుకే ఇప్పుడు గ్రామాలలో వివిధ పంటల విత్తనాలను పండించి కంపెనీలకు అమ్ముతున్నారు. ఇది ఒక రకంగా తెలంగాణ రైతులలో వచ్చిన అవగాహన ఫలితం. అయితే ఒక్క తెలంగాణకు మాత్రమే ఎందుకు పరిమితం కావాలి.భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఉండే సౌలభ్యం మూలంగా కూడా ఈ ప్రణాళిక అమలు అవసరం. ఎర్ర చెక్క భూములు కూరగాయల సాగుకి పండ్ల తోటల సాగుకు ఇథోధికంగా అవకాశం ఉంటుంది కాబట్టి దానిని ఉపయోగించుకొని ఆ దిశగా కేంద్రం ప్రణాళికలు వేయాలి.

-భారత అవినాష్,జనగామ

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


Main tab page 111_Main tab page 111.qxd 11/2/2025 10:36 PM Page 1





ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బండారుని మరువలేం



**కొండపి, ప్రభాతవార్త**


ప్రముఖ రంగస్థల నటులు కళాకారులు అయిన కీర్తిశేషులు బండారు రామారావుని ఎన్ని తరాలైనా మరువలేమని కొండపి రంగస్థలం కళాకారుల సంఘం సభ్యులు ఆనందరావు అన్నారు.బండా రామారావు 48వ సంస్కరణ సభ జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఈనెల 5వ తేదీన జరగనున్నదని ఆయన తెలిపారు ఈ సభలో బండారు రామారావు రంగస్థలం పోషించిన కళారూపాలు సత్య హరిచంద్ర నాటకంలో హరిచంద్రుడిగా పాత్ర పోషించి ఆ నాటక రచయిత గుర్రం జాషువాతో కంకణం తొడిగించుకున్న మహానటుడని అన్నారు.అటువంటి కళామతల్లి ముద్దుబిడ్డ రచించిన అద్దంకి ఆణిముత్యాలు అనే పుస్తకం ఆవిష్కరణ కూడా జరుగుతుందని అనంతరం ఉచిత నాటక ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. కావున కళాకారులు కళాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని ఆయ విజ్ఞప్తి చేశారు.

# తప్పులు చేశారు.. బేరం పెట్టాలి

### - ఆన్‌లైన్‌లో ఇష్టారాజ్యంగా మార్పులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

రెవెన్యూ దస్త్రాల్లోని తేడాలు భూసమస్యలకు కారణమవుతు న్నాయి. కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది చేతి వాటంపై జరిగిన తప్పిదాలతో యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక కారణాలతో ఇలా జరిగిందంటూ తమ తప్పులను కప్పి పుచ్చుతున్నారు. మరో వైపు పొరపాట్లను సరిదిద్దాలంటూ బాధితులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో కొందరు తహసీల్దార్లు రెవెన్యూ సిబ్బంది చేసిన అక్రమాలు పలువురికి ఇబ్బంది కరంగా మారాయి. రాజకీయ ఒత్తిళ్ల కాసులకు కక్కుర్తి పడి రెవెన్యూ దస్త్రాల్లో అంకెల్లను మార్చడం, విస్తీర్ణం తగ్గించడం, పెంచడం, పట్టాభూమిని ప్రభుత్వ భూమిగా చూపారు. కంప్యూ టరీకరణ చేసిన సమయంలో కొందరు రెవెన్యూ సిబ్బంది అక్రమా లకు పాల్పడుతూనే సమస్యలు ఏర్పడ్డాయి. జగనన్న భూ రీ సర్వే పేరుతో గత వైకాపా ప్రభుత్వం చేసిన హడావుడితో మరిన్ని సమస్యలు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో భూ వివాదాలకు కారణం అయ్యాయి. మరికొన్ని చోట్ల భూములు నిషేధిత జాబితాలో చేరాయి. అప్పట్లో జరిగిన సర్వేకు సంబంధించి ఇప్పటికి వేలాది ఎకరాలు పట్టాదారు పాస్ పుస్తకాలు రాలేదు. ఈ చిక్కులు తొలగించేందుకు కొన్ని చోట్ల రెవెన్యూ సిబ్బంది బేరమాడుతున్నారు.



కుదరకుంటే సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. గత వైకాపా ఐదేళ్ల పాలనలో భూ అక్రమార్కులు బరితెగించారు. ఆకాశమే హద్దుగా చెలరేగారు. వాగులు, వంకలు, ప్రభుత్వ స్థలాలతో పాటు, పట్టా భూముల్లో పాగా వేసి దందా సాగించారు. ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలో చోటు చేసుకున్న భూ కుంభకోణాల్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. వీటిపై ప్రత్యేక షిట్ దర్యాప్తు సైతం సాగింది. కనిగిరిలోనూ పెద్ద ఎత్తున అడ్డగోలు వ్యవహారాలు సాగాయి. అందుకు సంబంధించి కనిగిరి ఎమ్మార్వోపై వేటు పడింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కబ్జా దారుల ఆగడాలకు మాత్రం అడ్డుపటడం లేదు. లంచాలకు అల వాటు పడిన కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది వారికి వంత పాడుతూ దస్త్రాలు, వెబ్‌ల్యాండ్‌లో ఇష్టానుసారంగా మార్పులు చేస్తున్నారు. అధికార పార్టీల నాయకుల పేర్లు చెప్పి కొందరు హల్చల్ చేస్తున్నారు. మార్కాపురం డివిజన్‌లో అయితే అధికార పార్టీ నేతల అండదండలతోనే భూములను వారి పేర్ల మీద కొందరు దొంగరిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటు న్నాయి. 300ఎకరాలకు పైగా కనిగిరి మండలంలో ఒక ఎమ్మార్వో ఉన్నతాధికారులకు తెలియకుండానే అస్సైన్డ్‌మెంట్‌ను ఇతరుల పేరుమీద మార్చివేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఒంగోలు డివిజన్ పరిధిలోని సంతనూతలపాడు నియోజకవర్గంలో విచ్చలివిడి గా రెవెన్యూ అధికారులకు లంచాలు ఇస్తే ఎవరి పేరైనా ఎక్కించడా నికి సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మద్దిపాడు మండల రెవెన్యూ కార్యాలయంలో అయితే ఒకరిపేరు మీద ఒకరి వెబ్‌ల్యాండ్ మీద ఎక్కిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో సంతనూతల పాడులో పని చేసిన ఎమ్మార్వో ప్రస్తుతం మద్దిపాడు మండలంలో చేస్తున్నారని తెలిసింది. గతంలో సంతనూతలపాడులో ఆ ఎమ్మా ర్వోపై అవినీతి ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ఏదీ ఏమైనా అధికార పార్టీనాయకుల అండదండలతోనే మండల రెవెన్యూ అధికా రులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరో పణలు ఉన్నాయి. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

## సముద్ర స్నానాలకు అనుమతి లేదు

**బల్లికురవ, నవంబర్ 2, ప్రభాతవార్త**

ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, పవిత్ర కార్తీక మాసం సందర్భంగా సూర్యలంకలో సముద్ర స్నానాలు నిషేధించడం జరిగిందని ఎస్సై నాగరాజు వివరించారు. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు సముద్ర స్నానాలను నిషేధించినట్లు ఆయన వివరించారు. సముద్ర స్నానానికి వెళ్లే భక్తులు తమ ప్రయాణాలను నిలువరించాలన్నారు.

## శిధిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం

**పుల్లలచెరువు, నవంబర్ 2, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శిధిలావస్థకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం మొదటగా రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పడిన 1989లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కార్యాలయం శిధిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. బయట మొత్తం నెర్రెలు చీలింది. ఇరుకుగా ఉన్న ఈ కార్యాలయం చిన్నది కావడంతో, సిబ్బందికి, వీఆర్వోలకు ఇబ్బందిగా మారింది. ఈ పాత భవనాలు ఎప్పుడు కూలుతాయోనని అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి కార్యాలయం అంతా వర్షపు నీటితో కార్యాలయంలో రికార్డులు ఎక్కడ తడిసిపోతాయోమో అన్న భయంతో సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. కార్యాలయ ఆవరణంలోనూ వర్షం పడితే నడవటానికి వీలు లేకుండా గుంతలు ఏర్పడడంతో వర్షం కురిసిన సమయంలో నీళ్లు నిలబడి అటు ప్రజలకు ఇటు సిబ్బందికి అధికారులకు సమస్యగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కొత్త భవనాలను మంజూరు చేయించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.



## విశ్వబ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉంటా

### - ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

**ఒంగోలు, ప్రభాతవార్త**

విశ్వబ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం 31వ కార్తీక వనసమారాధన మహోత్సవంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌రోడ్డు లోని కాఫీ బార్ వెనకాల విశ్వబ్రాహ్మణ కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం 31వ కార్తీక వన సమారాధన మహోత్సవంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆ రోజుల్లో కళ్యాణ మండపానికి ఇచ్చిన స్థలం 50 లక్షలు అయిందని ఇప్పుడు అది కోట్ల రూపాయల పలుకుతుం దని అన్నారు. కళ్యాణం మండపానికి రావటానికి సిమెంట్‌రోడ్డు వేపిస్తామని అలాగే మండపానికి కిటికీలు మౌలిక సదుపాయాలు చేపిస్తామని అన్నారు. విశ్వబ్రాహ్మణల అందరూ కలిసిమెలిసి ఉండాలని అందరూ ఒక త్రాటిపైకి రావా లని కలిసి ఉంటేనే ఏ పనైనా త్వరగా చేసుకోవచ్చు అని అన్నారు. విశ్వబ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి లిస్ట్ తయారు చేసీ ఇవ్వండి అందరకు రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు అందరికీ వచ్చేలా చూస్తారని హామీ ఇచ్చారు. దానితోపాటు మీకు ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకురండి మేముదాన్ని పరిష్కరిస్తామని తెలిపారు విశ్వబ్రాహ్మణులు అంటే మాకు మొదటి నుంచి గౌరవం ఎప్పుడు పిలిచినా మేము అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే జనార్దన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ ఏసిపి క్రైమ్ బ్రాంచ్ కిరణ్ కుమార్ ఏఎంసీ చైర్మన్ రాచగండ్ల వెంకట్రావు స్వర్ణలత నగర అధ్యక్షులు బండారు మదన్ 33వ డివిజన్ అధ్యక్షులు నల్లూరు రవి 37వ డివిజన్ అధ్యక్షులు మేడికొండ మోహన్‌రావు, సంఘం జిల్లా అధ్యక్షులు రావూరి లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సానల విశ్వరూప చారి, ప్రధాన కార్యదర్శి నూతక్కి మల్లేశ్వరరావు, కోశాధికారి రంగనాయకులు, సెక్రటరీ యద్దనపూడి శివప్రసాద్, కందుకూరి పూర్ణచంద్రరావు,సభ్యులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయద్దు

### - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా పి.వి. రమేష్





**మార్కాపురం, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేట్ పరం చేయటాన్ని వెంటనే విరమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డా పి.వి. రమేష్ డిమాండ్ చేశారు. నవంబర్ 2 ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రకాశం జిల్లా, మార్కాపురంలో సిపిఐ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ జరిగిన సభకు ప్రముఖ వైద్యులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డా ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిం చారు. డా పి.వి. రమేష్ ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో వైద్యాన్ని వ్యాపారంగా మార్చారని, కార్పొరేట్ వైద్య వ్యయం ప్రజల్ని అప్పుల పాలు చేస్తుందని వివరించారు. విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని ప్రైవేట్ పరం చేస్తే ధనస్వామ్యంగా మారుతుంద న్నారు. రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా జీవించే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తే కూటమి ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాలను ప్రైవేట్ పరం చేసి జీవించే హక్కును హరిస్తుందన్నారు. 3 లక్షల 29 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ గా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలపై, ఆసుపత్రులపై 4 వేల కోట్లు వెచ్చించలేరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 33 శాతం బాల, బాలికలు పౌష్టిక ఆహార లోపంతో అనారోగ్య పాలవుతున్నారని పేర్కొన్నారు. 10 మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తే 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చేకూరుతాయని, రిజర్వేషన్లు అమలు ద్వారా సామాజిక న్యాయం వికసిస్తుందన్నారు. నేడు సగటున ఒక్కొక్క ప్రైవేట్ మెడికల్ కాలేజీ ప్రతి ఏడాది 100 నుండి 150 కోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నాయని, 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసి, కార్పొరేట్ శక్తులకు అందిస్తే ఏడాదికి 1500 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు. పిపిపి అంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడమే అన్నారు. జాతీయ రహదారి పక్కన 56 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణ దశలో ఉన్న మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ డా పి.వి. రమేష్ నేతృత్వంలో కమిటీ బృందం పరిశీలించింది. 80శాతం గర్ల్స్ హాస్టల్ నిర్మాణ మైందని, 60 శాతం బాయ్స్ హాస్టల్ నిర్మాణమైందని, 50 శాతం మెడికల్ కాలేజీ నిర్మాణం జరిగిందని, 20 శాతం అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణమైందని,ఈ ప్రతినిధి బృందం భావిం చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నేటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడం విచారకరం. ప్రభుత్వ మెడికల్ కళాశాలల కన్వీనర్ డా ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ప్రపంచంలో అనేక దేశాలలో అమల్లో ఉన్న విధంగా విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే పేదలకు, బడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం 107, 108, జీవోల ద్వారా ప్రభుత్వ మెడికల్ సీట్లను అమ్ముకునే విధానం ప్రవేశ పెడితే నేటి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను నిసిగ్గుగా అమ్ముకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత 16 నెలలుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రభుత్వ ఆస్తులను, విలువైన భూమలను కార్పొ రేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని, ఈ ప్రక్రియలో భాగంగానే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు చెందిన 600 ఎకరాలను నిర్మాణంలో ఉన్న భవనాలను కార్పొరేట్ వైద్య సంస్థలకు కారు చౌకగా కట్ట బెడుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమల ద్వారానే ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ 590 జీవో ద్వారా 66 సంవత్సరాల పాటు వైద్య వ్యాపారంలో లాభాల ను గడించడానికి అవకాశం కల్పిస్తుందని తక్షణమే 590 జీవోను రద్దు చేయాలని ఆయన కోరారు. ఒకవైపున రాష్ట్ర ఖజానాలో డబ్బుల్లేవని చెబుతూనే మరొకవైపు పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుకు 80 వేల కోట్లు ఖర్చు చేయడానికి ఆరాట పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత ఉద్యమ నేత కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ రాజ్యాంగ వ్యతిరేక శక్తులు నేడు పాలకులుగా మారి, ప్రభుత్వ వనరులను కబ్జా చేస్తున్నారని అందులో భాగంగానే పిపిపి అనే దొడ్డిదారితో విలువైన ప్రజాధనా న్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయం లో ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు విశేష వైద్య సేవలు అందించగా ప్రైవేట్ ఆసుపత్రులు మాత్రం ప్రజలను నిలువు దోపిడి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాజ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల కో కన్వీనర్ డా వసుంధర కుర్ర, హైకోర్టు న్యాయవాది శ్రీదేవి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా తవ్వ సురేష్, సిపిఐ జిల్లా నాయకులు అందే నాసరయ్య, సిపిఎం జిల్లా నాయకులు సోమయ్య, దళిత, బిసి సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## శ్రీరామ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ ఆదివారం దేవుడు చెరువు డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చావల వంశీకృష్ణ తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో 187 మంది పేషెంట్లు పాల్గొని వారికి ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ, హెచ్. బి, ఎముకల పటుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు సుమారు నాలుగువేల రూపాయల విలువగల ఈ పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందజేశారు. గత 15 సంవత్సరాలుగా శ్రీరామ్ హాస్పిటల్ నందు ప్రతి నెల మొదటి గురువారం ఉచితంగా ఓపి తో పాటు బిపి, షుగర్, థైరాయిడ్, హెచ్ బి, ఈసీజీ, యూరిక్ యాసిడ్, గర్భిణీ స్త్రీలకు ఉచిత స్కానింగ్, ఎముకల పటుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, పల్స్ ఆక్సీ మీటర్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, ప్రకాశం జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో దేవుడు చెరువు డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొప్పోలు సుగుణాకర్, కోటేశ్వరమ్మ, బాలాజీ, సుధాకర్ రెడ్డి, హైమ, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరం నందు ప్రముఖ ప్రసూతి, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ చావల శాంత కుమారి, ప్రముఖ జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు సానల ధీరజ్ బాబు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్రి పల్లవ్,, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు గోపి ,అనిల్, రజనీకాంత్, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యం సన్మానాలతో కొత్తపట్నం ఎస్సై

**కొత్తపట్నం, నవంబర్ 2, ప్రభాతవార్త**



కొత్తపట్నం ఎస్సై వేముల సుధాకర్ పనితీరుపై మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ సన్మానాలు జరుపుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రహదారులపై నిత్యం వాగులు పారుతూ ఉన్న, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎక్కడికక్కడ గస్తీలను నిర్వహించి చాకచక్యంగా వ్యవహరించారని. అల్లూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఆదివారం పోలీస్ స్టేషన్ నందు ఎస్సై వేముల సుధాకర్, నీ మరియు స్టేషన్ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం రమేష్, డి ప్రమోద్, ఎం దాసు 108, సిహెచ్ రాంబాబు, కె కమల్, డి ఉపదేశ్, ఎస్సి నాగూర్ వల్లి, ఎస్ అభిషేక్, ఎం రమేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను నష్టాన్ని అంచనా వేయటంలో ప్రభుత్వం విఫలం

### - ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవి

**కొత్తపట్నం, నవంబర్ 2, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలంలో ముంథ తుఫాను దెబ్బతిన్న నష్టాన్ని అంచనా వేయటంలో ప్రభుత్వం విఫలం అయిందని వైసిపి ఒంగోలు నియోజక వర్గ అధ్యక్షులు చుండూరు రవిబాబు అన్నారు. ఆదివారం కొత్తపట్నం మండలంలో ఈతముక్కల, గమండ్ల పాలెం, రంగా యపాలెం గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం మొత్తం గా వేలాది ఎకరాలు దెబ్బతిన్నాయని వాటిలో ప్రధానంగా వరి, చామదుంప, మిరప, గనసిగడ్డ, పూలు తోటలో తదితర పంటలు భారీగా నష్టపోయాయని తెలియజేశారు. గమండ్లపాలెంలో అప్పుడే వేసిన మిరప పంటలో పూర్తిగా దెబ్బతిన్నాయని లక్షలాది రూపాయలు రైతులు నష్టపోయారని తెలియజేశారు. పద్ధతిలో పాదర్తి లో పర్య బ్రహ్మయ్య వేసిన రెండున్నర ఎకరాల సామ దుంప చేతికి పంట అంది వచ్చే సమయంలో అకాల తుఫాను వల్ల సుమారుగా రెండు లక్షలు నష్టపోయినట్లు ఆయన తెలియజేశారు. గత ప్రభుత్వంలో పంటలకు ఇన్సూరెన్స్ ను నమోదు చేసే వారిని నేటి ప్రభుత్వంలో అది చేయక రైతులు నష్టపోయారని వారికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ ఆక్వా రంగం రాష్ట్రానికి పెద్దపీటగా ఉందని దాని ద్వారానే ఆర్థిక వనరులు ప్రభుత్వానికి వస్తున్నాయని ఆక్వా రైతులకు యూనిట్ ధర రూపాయిన్నర కు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ తుఫాన్ కారణంగా వందలాదిమంది మండలంలో ఆక్వా రైతులు దెబ్బతిన్నారని సుమారుగా ప్రతి రైతుకు ఐదు లక్షల నుండి 20 లక్షల వరకు నష్టం వచ్చినట్లు తెలియజేశారు. రైతు విభాగం నాయకులు ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తుఫాన్ కారణంగా చేతికి అంది వచ్చిన శామదుంపలు కొనుగోలు చేసేవారు లేరని వాసన వస్తున్నాయని తెలియజేశారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ధరల స్థిరీకరణ బోర్డు లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గోపాల్, రాయపాటి అంకయ్య, నారపరెడ్డి, రెడ్డి, పటాన్ అజీర్, కోటిరెడ్డి, బ్రహ్మయ్య ,పుల్లయ్య, బండారి వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, వెంకటనారాయణ, తాతా శ్రీను, నాంచార్లు ముసలారెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

**కొత్తపట్నం, నవంబర్ 2, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా బస్టాండ్ సెంటర్ నందు ఆదివారం సంతకాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులకు దోచిపెట్టే కార్యక్రమం తలపెట్టిందని అందులో భాగంగానే ఒక ఎకరం 100 రూపాయ లకు ప్లీజ్ కు ఇస్తుందని తెలియజేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం అయితే పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడం కష్టతరం అవుతుందని దీనిని ప్రజలు గుర్తించాలని తెలియజేశారు వైఎస్ఆర్ ప్రభుత్వం లో 7 మెడికల్ కాలేజీలు పూర్తి స్థాయిలో పూర్తయ్యాయని మిగిలిన పది కాలేజీలు సగం లోనే ఆగాయని వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదని ఆయన అన్నారు. రాష్ట్ర మొత్తం సంతకాలు సేకరించి గవర్నర్కు సంతకాలతో కూడిన అర్జీని ఇవ్వాలని తెలియజేశారు. ప్రభుత్వ వెంటనే ఆరోగ్యశ్రీని అన్ని ఆసుపత్రులకు వర్తింపజేసి పేదలకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, అల్లూరు సీనియర్ నాయకులు విఆర్‌సి రెడ్డి ఎంపీటీసీ శాంతారావు సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, హరి చిట్టిబాబు,జిల్లా, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## బాధితులకుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రీతం వర్షిత హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వంకాల పాటి సాంబశివరావు కవితల కుమారుడు ప్రీతం23 జన్మదిన పురస్కరించుకొని 100 మంది బాధితులకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హాండ్స్ ట్రస్టు నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో ఒంగోలు వాసవి అపార్ట్మెంట్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో నగరంలో నిరాశ్రయులైన వంద మందికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ప్రీతమ్ వర్షితల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దాదాపు 23ఏళ్లుగా ఒంగోలు నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కరోనా సమయంలోను తుఫాను సమయంలోను పేదలకు అండగా ఉండడం ఉన్నారు అన్నారు. ఎంతోమంది దివ్యాంగుల జంటలకు సొంత ఖర్చులతో వివాహాలు జరిపించి మానవత్వం చాటుకున్నారని పేర్కొన్నారు. అనంతరం ఒంగోలు శివాలయంలో అన్న అన్న సంతర్పణ చేశారు. ఈసేవ కార్యక్రమంలో సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్ భాష,షహనాజ్, నూకతోటి శరత్ బాబు, మారెళ్ళ రాజేశ్వరి వంకాయలపాటి సత్యవతి, అనంతలక్ష్మి,సునీత. ఉష తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు

## - బ్రహ్మగుండం వద్ద మహారుద్రాభిషేకం



**బల్లికురవ, నవంబర్ 2, ప్రభాతవార్త**

కార్తీక మాసంలో అత్యంత పవిత్రంగా భావించే క్షీరాబ్ది ద్వాదశి(చిలుకు ద్వాదశి) వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసము అత్యంత పవిత్రమైంది. మహిమాన్వితమైంది. శివకేశవులకు ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో ప్రతి రోజు పర్వదినమే. అయితే ఈ కార్తీక మాసంలో క్షీరాబ్ది ద్వాదశి(చిలుక ద్వాదశి) అత్యంత పవిత్రమైంది. కార్తీక శుద్ధ ద్వాదశి నాడు కృతయుగంలో దేవతలు, రాక్షసులు అమృతం కోసం క్షీరసాగర మదనాన్ని ప్రారంభం చేసిన రోజు కనుక ఈ రోజును క్షీరాబ్ది ద్వాదశి అని పిలుస్తారు. దేవదానవులు అమృతం కోసం క్షీరసాగరమధనం ప్రారంభించింది ఈ రోజే. అందుకే ఈ రోజుకి మధన ద్వాదశి అని, అమృతం కోసం సాగరాన్ని మందర పర్వతంతో చిలికారు కనుక చిలుక ద్వాదశి అని అంటారు. ఈ రోజుకి దామోదరద్వాదశి, యోగీశ్వరద్వాదశి అని కూడా అంటారు. ఉత్థానైకాదశి అంటే శ్రీ మహావిష్ణువు పాలకడలిలో ఆదిశేషుని పాన్పుపైన ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు తన యోగనిద్రను ప్రారంభించి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశినాడు కనులు విప్పి యోగ నిద్ర నుండి మేల్కొన్న రోజుకే ఉత్థాన ఏకాదశి అనే పేరు. ఉత్థాన ఏకాదశి(నిన్న) నాడు శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుండి మేల్కొని బ్రహ్మతో కలిసి తన ప్రియురాలైన తులసి ఉండే బృందావనంలోకి ద్వాదశి నాడు ప్రవేశిస్తాడు. అందుచేతనే తులసి మొక్క వద్ద క్షీరాబ్ది ద్వాదశి నాడు దీపములు వెలిగించి పూజలను జరపడం అనాదిగా వస్తున్న ఆచారం. కనుక స్త్రీలు ఈ రోజు వారి సౌభాగ్య సంపదల కోసం తులసి ధాత్రి(తులసి కోట) దగ్గర విశేష దీపారాధనలు చేసి షోడశోపచారాలతో తులసీధాత్రి లక్ష్మీనారాయణులను పూజిస్తారు. ఈ రోజున తులసి మొక్క వద్ద శ్రీ మహావిష్ణు స్వరూపంగా ఉసిరి మొక్కను ఉంచి పూజలు చేస్తారు. ముఖ్యంగా చాలా మంది చేసే పెద్దపొరపాటు ఉసిరి చెట్టులేని బజార్లో అమ్మే ఉసిరి కొమ్మలను తీసుకొని వెళ్లి తులసి వద్ద పెట్టి పూజ చేస్తుంటారు. అది శాస్త్ర విరుద్ధం. ఉసిరి చెట్టు వద్దనే పూజ చేసుకోవడం లేదా నర్సరీ(చెట్లు పెంచే) వద్ద చిన్న కుండీల్లో ఉసిరి చెట్టును తెచ్చుకునైనా పూజ చేసుకుంటే మంచిది. కార్తీక మాసంలో ఎట్టి పరిస్థితుల్లో ఉసిరి చెట్టు కొమ్మలను విరవడం, నరకడం వంటి పనులు చేయకూడదని శాస్త్రవచనం. క్షీరసాగర మధనంలో జన్మించిన తేజోభరితమైన అమృతకలశహస్తను సకల సిరులతో ఆవిర్భవించిన లక్ష్మీదేవిని శ్రీమహావిష్ణువు దేవ దానవ సమక్షంలో వివాహమాడుతాడు. అందుకే కొన్ని ప్రాంతాలలో ఆచారమును బట్టి శ్రీ మహాలక్ష్మికి, శ్రీమన్నారాయణునికి వివాహం చేసెదరు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొనిదేన బ్రహ్మగుండం వద్ద ఈ పర్వదినం సందర్భంగా మహాదేవునికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ కొనసాగాయి.

# కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## - గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిట్టెంశెట్టి

**కొనకనమిట్ల, నవంబర్ 2, ప్రభాతవార్త**

గాండ్ల, తెలీకులు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న పొదిలి గోశాలలో జరిగే గాండ్ల సంక్షేమ సంఘం, ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పొదిలి యూనిట్ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు కోరారు. ఆదివారం పొదిలి సాయి బాలాజీ కళ్యాణ మండపం ఆవరణలో జరిగిన గాండ్ల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ సమావేశంలో తొలుత ఇటీవల మరణించిన వరికుంట్ల వెంకటేశ్వర్లుకు సంతాపం తెలియజేశారు. గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం, జిల్లాలోని గాండ్ల తెలికుల సామాజిక వర్గ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి మాట్లాడుతూ గాండ్ల తెలికుల సామాజిక వర్గానికి కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు స్థానిక మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, శ్రీనివాసులు, శివయ్య, అకిల్ సాయి, దుద్దు హరిప్రసాద్, దుద్దు శంకర్, ఆళ్ల చెరువు విక్రమార్క్, బూదాటి నిమ్మయ్య, నలబోలు కోటేశ్వరరావు, ముత్యాలపాటి లక్ష్మీ, చాకిరాల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా గాండ్ల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం



**కొనకనమిట్ల, నవంబర్ 2, ప్రభాతవార్త**

ఆదివారం నాడు పొదిలి పట్టణంలోని సాయి బాలాజీ కళ్యాణ మండపం ఆవరణలో పొదిలి యూనిట్ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన వరికుంట్ల వెంకటేశ్వర్లుకు సంతాపం తెలియజేశారు. తదుపరి చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ నవంబర్ 16వ తేదీన పొదిలి పట్టణంలోని గోశాలలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం, ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జరుగు ఆత్మీయ కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమ ఏర్పాట్ల గురించి చర్చించి ప్రకాశం జిల్లాలోని గాండ్ల తెలికుల సామాజిక వర్గ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి మాట్లాడుతూ గాండ్ల తెలికుల సామాజిక వర్గానికి కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు స్థానిక మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, ప్రభుత్వం సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు, శివయ్య, అకిల్ సాయి, దుద్దు హరిప్రసాద్, దుద్దు శంకర్, ఆళ్ల చెరువు విక్రమార్క్, బూదాటి నిమ్మయ్య, నలబోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భారత జట్టు ప్రపంచ ఫైనల్ కప్పు విజయం సాధించాలి

## - టీడీపీ అధ్యక్షులు పోట్ల గోవిందు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు





**పుల్లలచెరువు, నవంబర్ 2, ప్రభాతవార్త**

పుల్లలచెరువు మండలం ఐటీవరం గ్రామంలో మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ గెలవాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షులు పోట్ల గోవింద్ ఆధ్వర్యంలో గ్రామంలోని దేవాలయం, మస్జీద్, చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైనల్ కప్ ప్రపంచ భారత్ గెలవాలని ఆకాంక్షించారు. సర్వమత ప్రార్ధనలో నిర్వహించి భారత క్రికెట్ జట్టు ప్రపంచకప్‌ను సదరవంగా ఎత్తుకోవాలని ఆయన కోరారు. భారతదేశ ఖ్యాతి నలుదిశల రెపరెపలాడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోట్ల గోవిందు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు అందరూ కలిసి భారత జట్టు విజయానికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా మహిళా క్రికెట్ జట్టు ఇప్పటి వరకు అద్భుతమైన ప్రదర్శన చేసిందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో కూడా అదే ఉత్సాహంతో, జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడి దేశానికి గర్వకారణం కావాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాం అని ఆయన ఆకాంక్షించారు. క్రీడలలో మహిళల ప్రతిభ దేశ ప్రతిష్ఠను పెంచుతోందని, యువతీ యువకులు క్రీడలలో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువ నాయకులు, అభిమానులు పాల్గొని భారత జట్టు విజయానికి నినాదాలు చేశారు. ప్రార్ధన అనంతరం దేశ జెండాను ఆవిష్కరించి భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా శ్రీ జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి 417 వ జయంతి ఉత్సవాలు





**యర్రగొండపాలెం, నవంబరు 2, ప్రభాతవార్త**

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి పేరు వినగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆయన రాసిన కాలజ్ఞానం అని విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్తులూరి మల్లిఖార్జున చారి అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని యక్కలివారి వీధిలో శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417 జయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జయంతి పూజా కార్యక్రమంలో మహిళలలతో పాటు అయప్ప స్వామీ భక్తులు విరివిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే విషయాలను ముందుగానే దర్శించి తాళపత్ర గ్రంథాలలో రచించి భద్రపరిచిన మహనీయుడని కొనియాడారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామీ కాలజ్ఞాన తత్వాలను బోధించిన యోగే కాదని ఆయన అంతకు మించిన సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. ఆనంతరం ఇమ్మడిశెట్టి రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యాక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా అందరు అన్నదాన కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జమ్మోజు వెంకటేశ్వర ఆచారి, యక్కలి భాగ్య రావు, ఆతుకూరి రామయ్య సొసైటీ అధ్యక్షుడు వ్యాపర్తి వీరయ్య, చీదెళ్ళ నాగేశ్వరరావు, యక్కలి ప్రసాదు, బిసి నాయకులు గజ్జ వెంకటేశ్వర్లు గౌడ్, పుట్టుపోతుల వెంకటేశ్వరరావు, రాచర్ల అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్య అనేది తరిగిపోని గొప్ప సంపద

## - ఆత్మీయ అభినందనీయ వీడ్కోలు - సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, నవంబరు 2, ప్రభాతవార్త**

విద్య అనేది ఎవరు దొంగలిచలేని తరిగిపోని గొప్ప సంపద అని దేశంలో అక్షరాస్యతను పెంచి మూఢనమ్మకాలు దూరం చేసే శక్తి ఒక్క ఉపాధ్యాయునికి మాత్రమే ఉందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణం ముత్తుముల భాస్కర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) గిద్దలూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందనీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఇతర మండలాల నుండి గిద్దలూరు మండలంకు విచ్చేసిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ముందుగా స్వాగతం పలికారు. కొత్తగా ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన వారికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఉపాద్యాయ వృత్తి అనేది ఎంతో గొప్పదని, ఒక ఉపాధ్యాయుడు ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దేదుకు, సమాజంలో మంచి గుర్తింపు ఎదుగుదలకు ఎంతో కృషి చేస్తారని అన్నారు. సమాజాభివృద్ధికి విద్య ఎంతగానో దోహదపడుతుందని మీ వంతుగా ఇంకా ఎంతోమందిని ఉన్నంతగా తీర్చిదిద్దాలి అని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఉపాద్యాయులు అందరూ ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని శాలువా, పులమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## - గిద్దలూరులో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మకు ఘన స్వాగతం



**గిద్దలూరు, నవంబర్ 2, ప్రభాతవార్త**

రాష్ట్రప్రభుత్వంవిశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలు, రుణసౌకర్యాలు, విద్యా ప్రోత్సాహకాలు అందజేయడం జరుగు తుందని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ పార్వతమ్మ తెలిపారు. శనివారం ఆమె ఒంగోలు వెళ్తూ గిద్దలూరు విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆహ్వానం మేరకు గిద్దలూరులో ఆగి, స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దత్తాచారిని కలిశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు చైర్మన్ కమ్మరి పార్వతమ్మను శాలువా, పూలమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, సంఘ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహక పథకాలు, మహిళల ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై కూలంకషంగా వివరించారు. గృహ నిర్మాణం, విద్యారుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు వంటి పథకాలను మరింత మంది లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె వివరించారు. అదేవిధంగా, విశ్వబ్రాహ్మణ యువత తమ సామాజిక బాధ్యతను గుర్తించి, సేవా కార్యక్రమాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. "సంఘబలం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మన సమాజం కలసికట్టుగా ఉంటే ప్రభుత్వ పథకాలు అందరికీ చేరుతాయి" అని ఆమె అన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో గిద్దలూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు షరాబు దత్తాచారి, గౌరవాధ్యక్షులు దొడ్డోజు రంగాచారి, సంఘ సభ్యులు కమ్మరి కృష్ణమాచారి, షరాబు నరసింహచారి, గూడలూరు శంకరాచారి, ప్రొద్దుటూరి సాయికుమార్ ఆచారి, బి.గురుస్వామి తదితరులు ఉన్నారు.

# మీ శరీరానికి సరిపడా ప్రోటీన్లు సరిగ్గా అందుతున్నాయా..?

## - లేదంటే తస్మాత్ జాగ్రత్త...



**కొమరోలు, నవంబరు 2, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు కూడా, ఆరోగ్యంగా ఉండడం చాలా అవసరం. ఆరోగ్యంగా ఉండాలంటే, మన శరీరానికి ప్రోటీన్ చాలా అవసరం. ప్రోటీన్ వలన, ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఎముకలుని దృఢంగా మారుస్తుంది ప్రోటీన్. శరీరంలో ప్రోటీన్ కనుక లేకపోతే, అనేక సమస్యలు వస్తాయి. ప్రోటీన్ లోపం ఉన్నట్లయితే, ఉబకాయం, ఎముకల బలహీనత మొదలు జుట్టు రాలిపోవడం, చర్మ సమస్యలు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఇలా పలు సమస్యలు కలుగుతాయి. కానీ శరీరానికి వివిధ వయసులో వివిధ రకాల ప్రోటీన్స్ కావాలి. వాటి గురించి ఇప్పుడే మనం చూద్దాం.

### శరీరలో ప్రోటీన్ ఉపయోగాలు :

ప్రోటీన్ ఆకలికి కారణమయ్యే హార్మోన్ లెవెల్స్‌ని తగ్గిస్తుంది. లెప్టిన్ స్థాయిలని పెంచుతుంది. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. బరువుని కంట్రోల్ చేస్తుంది. బలమైన కండరాలకి, ఎముకలకి ప్రోటీన్ కావాలి. శరీరంలో కొత్త ఎముకలు ఏర్పడడానికి ప్రోటీన్ అవసరం. బోలు ఎముకల వ్యాధి వంటి సమస్యల ప్రమాదం నుండి కూడా ప్రోటీన్ మనల్ని రక్షి స్తుంది. ప్రోటీన్ జీర్ణక్రియని మెరుగుపరుస్తుంది. అలానే, క్యాలరీలను కరిగించేందుకు కూడా ప్రోటీన్ సహాయపడుతుంది. ప్రోటీన్ తీసుకుంటే బరువు తగ్గడానికి కూడా వీలు కలుగుతుంది. ఆకలిని తగ్గించడమే కాకుండా, అతిగా తినడాన్ని కూడా ఇది నిరోధిస్తుంది. శరీరంలో గోళ్లు, జుట్టు, చర్మం, కండరాలు, ఎముకలు అంతర్గత అవయవాలు ఏర్పడడానికి ప్రోటీన్ చాలా అవసరం. కణాలు, కణజాలాలని ప్రోటీన్స్ సృష్టిస్తుంది. ప్రోటీన్ లేకపోతే ఎముకలు పగుళ్ళకి గురవుతాయి. వయస్సు పెరిగే కొద్దీ ఖండరాలు ద్రవ్యరాశి, ఎముకల సాంద్రత, బలం తగ్గిపోతాయి. వృద్ధులకి పెద్దలకంటే ఎక్కువ ప్రోటీన్ అవసరం. ప్రోటీన్ లోపం నుండి బయటపడడానికి గుడ్లు, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి. చికెన్, సోయా, పాలు, టోఫు, బీన్స్, ఓట్స్‌ని కూడా తీసుకుంటే మంచిది. శరీర బరువులో కిలో గ్రాముకు 0.8 నుండి 1 గ్రాము ప్రోటీన్ కావాలి. శరీర దారుఢ్యానికి ప్రతిఒక్కరు ప్రోటీన్‌ను తగిన పరిమాణంలో తీసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి.

# బాలయోగి నగరంలో కోటి సంతకాల సేకరణ



**సింగరాయకొండ, నవంబర్ 2,ప్రభాతవార్త**

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం మండల కేంద్రంలోని బాలయోగి నగర్‌లో ఉత్సాహంగా జరిగింది. వైసీపీ మండల కన్వీనర్ మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ కరీం, యనమల మాధవి, చొప్పరా వెంకన్న, అల్లా బక్షు, జావిద్ అలీ, శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్, నౌషాద్, సుల్తాన్, వినోద్, ఫిరోజ్, ఎంకా రెడ్డి, హర్ష, లింగగుంట నరేష్, కళ్యాణ్, సురేష్, అబ్దుల్లా, మొహమ్మద్, సాంబ పాల్గొన్నారు.

# గ్రానైట్ రాళ్లపై ఏఎమ్ఆర్ వసూలు నిలపుదల చేయాలి

## - గ్రానైట్ పరిశ్రమల క్వారీ యజమానులు ఆందోళన

## - ఆందోళనలో పాల్గొన్న సంతమాగులూరు గురిజేపల్లి వేమవరం పరిశ్రమల యజమానులు

**సంతమాగులూరు నవంబర్ 2, ప్రభాతవార్త**

గ్రానైట్ రాళ్ల రవాణాపై ఏఎన్ఆర్ సమస్త చేస్తున్న వసూళ్లను తక్షణమే నిలుపుదల చేయాలంటూ గానైట్ పరిశ్రమల క్వారీల యజమానులు ఆందోళన చేపట్టారు. ఏఎంఆర్ సమస్త అడ్డగోలుగా చేస్తున్న వస్తువులను తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ ఆదివారం సాయంత్రం బాపట్ల పలనాడు జిల్లాల సరిహద్దు ఈటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాములో ప్రారంభించిన ఏఎంఆర్ వసూళ్ల కోటవం ప్రభుత్వం భారీగా పెంచి వేసి గ్రానైట్ రాళ్ల వ్యాపారం యజమానులకు పెను భారం చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కట్టర్ సైజు రాళ్లకు రు. 25 వేలు, డబల్ కట్టర్ సైజుకు 50,000 ఉండేదని ఈ పన్నులను తాజాగా ఏఎన్నార్ సమస్త రు. 35,రు,40 వేలు చేయడంతో పాటు , ప్రభుత్వానికి చెల్లించాల్సిన 35 వేలకు తోడు అంతే మొత్తం అనధికారికంగా తమ సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు వారు ఆరోపించారు. ఈ విధానం వల్ల పరిశ్రమలు క్వారీలు నడపజాలమని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనక్కైవారి శ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు ప్రపంచ దేశాలు తిరుగుతున్న కూటమి నేతలు స్థానికంగా పరిశ్రమలు మూతపడే స్థితిని తీసుకురావడం దారుణమని వారు అన్నారు. దీనిపై భారీ కార్యాచరణ రూపొందించుకుంటామని వారు తెలిపారు. ఈ ఆందోళనలో సంతమాగులూరు, గురిజేపల్లి వేమవరం గ్రానైట్ పరిశ్రమల యజమానులు క్వారీల యజమానులు పాల్గొన్నారు.

# కనిగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షునిగా మరోసారి బాలసాని కోటయ్య నియామకం

## - ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాలసాని



**హనుమంతునిపాడు, నవంబర్ 2, ప్రభాతవార్త**

మండలంలోని నల్లగండ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు బాలసాని కోటయ్య తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలకు గాను పార్టీ గుర్తింపు మరోసారి దక్కింది. ఆయనను టీడీపీ కనిగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షునిగా మరో సారి అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నన్ను నమ్మి మరోసారి నాపై పెట్టిన బాధ్యతను సగర్వంగా నిర్వహిస్తానని తెలిపరు. అంతే కాకుండా పార్టీ తనను గుర్తించినందుకు గాను కృషి చేసిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బలసాని కోటయ్యకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి ఆదేశాల మేరకు హాస్టల్స్‌లో దోమల నివారణకు కిటికీలకు నెట్స్ ఏర్పాటు





**సంతనూతలపాడు, నవంబర్ 2, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండల స్పెసల్ ఆఫీసర్ పి.శ్రీహరి ఆదేశాల మేరకు మండలంలోని మద్దులూరు బీసీ హాస్టల్, సంతనూతలపాడులోని ఎస్సీ హాస్టల్ నందు విద్యార్థులు వ్యాధులు భారిన పడకుండా హాస్టల్ వార్డెన్స్ శ్రీనివాసరావు, రవిలు కిటికీలకు నెట్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మస్కిటో భారిన విద్యార్థులు పడకుండా నెట్స్‌ను కిటికీలకు బిగించారు. హాస్టల్ పరిసరాల్లో ముమ్మరంగా శానిటేషన్ పక్రియను చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి ఈ సందర్భంగా విద్యార్థులను అన్ని విధాల వ్యాధులు నుండి సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని హాస్టల్ వార్డెన్స్‌కు ఆదేశాలిచ్చారు. ఇందులో భాగంగా మద్దులూరు బీసీ హాస్టల్, సంతనూతలపాడులోని ఎస్సీ హాస్టల్ నందు ఆయా వార్డెన్స్ శ్రీనివాసరావు, రవిలు వెను వెంటనే కిటికీలకు నెట్స్ బిగింపచేశారు. అదే విధంగా కాచి చల్లార్చిన 30 లీటర్ల నీటిని విద్యార్థులకు సిద్ధం చేశారు. సంతనూతలపాడు బీసీ హాస్టల్‌లో కూడా కిటికీలకు నెట్స్ బిగించారు. దీనిపై ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంఈఓ డి.వెంకారెడ్డి ఆయా హాస్టల్స్‌ను పరిశీలించి స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి ఆదేశాలను పాటించిన వార్డెన్స్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై విద్యార్థులు కూడా ఆనందోత్సవాలను వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్స్‌లో దోమలు రాకుండా మస్కిటో నెట్స్, వాటర్ ట్యాంకులు కోఆర్డినేషన్, హాస్టల్ పరిసరాలలో శానిటేషన్ పక్రియను వార్డెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌కు ఈ సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టిన స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి, వార్డెన్స్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సంతనూతలపాడులో రాజస్థాన్ రాష్ట్రంకు చెందిన వలస మహిళ గర్భిణీ కావడంతో తుఫాన్‌లో భారీ వర్షాల్లో భాగంగా వైద్య, ఐసీడీఎస్ సిబ్బందిని స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఎంపీడీవో సురేష్‌బాబు తదితరులు చైతన్య పరిచారు. తదుపరి సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆయా మహిళకు మెడికల్ ఆఫీసర్ సుధామణి వైద్య సిబ్బంది నార్మల్ కాన్పు చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి పర్యవేక్షణలో వారి ఇంటికి చేర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ డీఎంహెచ్ఓ సదరు గర్భిణీ స్త్రీ సాధారణ కాన్పు కావడం పట్ల కలెక్టర్, డీఎంహెచ్‌ఓలు అధికారులకు కంగ్రాట్స్ తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు ముఖ్యంగా సంతనూతలపాడు మండలంలో ప్రజలు ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ శ్రీహరి ఆధ్వర్యంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు తదితర శాఖల అధికారులు సిబ్బంది, ముఖ్యంగా గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలీసు సిబ్బంది ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తుఫాన్‌కు సంతనూతలపాడు మండలంలో స్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి పర్యవేక్షనలో అధికారులు బృందం ప్రత్యేక చర్యలు గైకొన్నారు. దీనిపై అధికారులు బృందం, సిబ్బందికి మండలంలో పలువురు ప్రజలు, పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# జగదీష్‌కు కరణం పరామర్శ



**బల్లికురవ, నవంబర్ 2, ప్రభాతవార్త**

ఒంగోలు పట్టణంలోని రాయపాటి జగదీష్ తండ్రి రాయపాటి ఆనందరావు అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదివారం జగదీష్ గృహానికి చేరుకొని, ఆనందరావు పార్ధివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

7_7.qxd 11/2/2025 10:37 PM Page 1



# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి



**అద్దంకి , నవంబరు 2,ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని, కాకాని పాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం 417వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ ,కంకణాధారణ స్వామివారికి అభిషేకం, అఖండ జ్యోతి ప్రజ్వలన, మహా నివేదన, మంత్ర పుష్పము కార్యక్రమం, వేద మంత్రోచ్చారణల నడుమ కొనసాగింది. సకల జను సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు వేద పండితులు కుందుర్తి హనుమచారి ఆధ్వర్యంలో కొనసాగాయి. స్వామి వారికి జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు పొన్నపల్లి బ్రహ్మానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణ టిడిపి పార్టీ క్లస్టర్ ఇంచార్జి కాకాని అశోక్ ,పట్టణ యువజన సంఘం అధ్యక్షులు వడ్లవల్లి పూర్ణచంద్రరావు, కేంద్ర టెలికం బోర్డు నెంబర్ ఉండవల్లి కృష్ణారావు,కేంద్ర హిందీ ప్రచారమండలి సభ్యులు, కనపర్తి రమ్యకృష్ణ, సింగరకొండ ప్రసన్న, ఆంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కొండముది గోపి వెంకటనారాయణమ్మ. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## 24 గంటల్లో తప్పిపోయిన బాలురను చేధించిన అద్దంకి పోలీసులు



**అద్దంకి, నవంబరు 2 ప్రభాతవార్త**
స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఇద్దరు బాలురు కనిపించకపోవడం తో కేసు నమోదయింది. ప్రభుత్వ సామాజిక సంక్షేమ బాలుర వసతి గృహం-1, నుండి ఒకటవ తేదీ 10వ తరగతి విద్యార్థులు గారిగ్ల ధనుష్ (15), పొతురెడ్డి సుబ్బారెడ్డి (15) పాఠశాలకు వెళ్ళి తిరిగి రాలేదని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లెపోగు వీరస్వామి ఫిర్యాదు చేశారు. సత్వరం స్పందించిచిరాల డి.ఎస్.పి ఆధ్వర్యంలో, అద్దంకి సి.ఐ. సుబ్బరాజు తక్షణమే ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అద్దంకి, ఒంగోలు, చిలకలూరిపేట, మార్టూరు, మేదరమెట్ల పరిసర ప్రాంతాల్లో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు బృందాలు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించడంతో పాటు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద సమగ్ర విచారణ కొనసాగించారు.వేగవంతమైన చర్యలతో, చివరికి మేదరమెట్ల బస్ స్టాండ్ వద్ద బాలురను సురక్షి తంగా గుర్తించారు.బాలురు మద్యపానం చేసినట్లు గమనించగా, తల్లిదండ్రుల మందలింపుతో హాస్టల్ విడిచి వెళ్లినట్లు తేలింది.అద్దంకి పోలీసులు అత్యంత సమర్థవంతంగా చర్యలు చేపట్టి 24 గంటల్లోనే బాలురను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.బాపట్ల జిల్లా ఎస్పీ ఈ వేగవంతమైన, సమర్థవంతమైన గాలింపు చర్యలను ప్రశంసిస్తూ, అద్దంకి పోలీస్ బృందాన్ని అభినందించారు.

# నష్టపోయిన పంటలను పరిశీలించిన చింతలపూడి





**అద్దంకి, నవంబరు 2, ప్రభాతవార్త**
తుఫాన్ ప్రభావం కారణంగా అద్దంకి నియోజకవర్గంలో తీవ్రంగా నష్టపోయిన పంటలను వైయస్సార్ సిపి ఇంచార్జ్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని, శంఖ వరప్పాడు గ్రామంలో నీట మునిగి పాడైన మొక్కజొన్న పొలాలను పరిశీలించిన అనంతరం నష్ట పోయిన రైతులతో మాట్లాడారు.మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట రైతు విభాగ అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి, పార్టీ సీనియర్‌నాయకులు జ్యోతి హనుమంతరావు, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసి అంజిరెడ్డి, కాకాని రాధా కృష్ణమూర్తి,కామిరెడ్డి, రాజారెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, మోటుపల్లి శివరామకృష్ణ ప్రసాద్‌తోపాటు గ్రామ వైసిపి నాయకులు, స్థానిక పార్టీ నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# మంత్రి గొట్టిపాటిపై ఫైర్ ఐన డాక్టర్ అశోక్



**అద్దంకి, నవంబరు 2, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రజలకు మంచి చేసేది, మంచి జరగాలని కోరుకునేది జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని అద్దంకి వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం డాక్టర్ చింతలపూడి అద్దంకి నియోజకవర్గంలో పర్యటించారు. తుఫాన్ ప్రభావం వలన నష్టపోయిన రైతులను పరామర్శించి, నష్టాన్ని అంచనా వేసి నివేదికను పంపించిన నాయకుడికే ఈ ప్రభుత్వంలో లేదు .ఇదేనా రైతులపై ఉన్న ప్రేమ, కూటమి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, ఇదేనా మంచి ప్రభుత్వం, అని ప్రశ్నించారు.మొంథా తుఫాన్ నుండి ప్రజలను రక్షించిన ప్రతి వ్యవస్థ అందుబాటులోకి తెచ్చింది గత జగన్ మోహన్ రెడ్డి వైసిపి ప్రభుత్వమేనన్నారు.క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని ఏరియల్ సర్వే, పంట నష్టాన్ని అంచనా వేసే టెంట్ హౌస్ లో కూర్చుని అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొనటం కోసం మాత్రమే జగన్ మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో పాల్గొన్నారని డాక్టర్ అశోక్ కుమార్ మంత్రికి గుర్తుచేశారు. పార్టీ అధినేతపై చెడు కామెంట్లు చేసే వారిని మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.గత ప్రభుత్వంలో ఉచిత పంట భీమా పథకాన్ని తుంగలో తొక్కింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు . ఉచిత పంట భీమా పథకాన్నిరద్దు చేయడం వెనుక రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత విశ్వ ఉందో ప్రత్యేకంగా చెప్పాలా అన్నారు .ఉచిత పంట భీమా పథకం ఉన్న రైతన్నా గ్రామాల్లో దాదాపు 15లక్షల ఎకరాల్లో నష్ట పోయిన పంట రైతుకు నష్ట పరిహారం అందాలి, పవర్ మంత్రి జగన్ మోహన్ రెడ్డి పై కామెంట్లు చేసే ముందు నోటితో కంటే మనసుతో మాట్లాడితేబాగుంటుంది.అని హితవు పలికారు.

# సముద్ర స్నానాలకు వెళ్లరాదు

**కొరిశపాడు, నవంబరు 2,ప్రభాతవార్త**
పరమ పవిత్రమైనకార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా మండలంలోని ప్రజలు భక్తులు కార్తీక స్నానాల కొరకు సముద్ర తీరానికి వెళ్లరాదని పోలీస్ అధికారులు సూచించారు తీవ్ర తుఫాన్ మొంథా వలన సముద్ర తీర ప్రాంతం కోతకు గురై ప్రమాదకరంగా ఉన్నందున బీచ్ లలోకి ప్రవేశం లేదన్నారు. భక్తులు గమనించి సోమవారం నాడు సముద్ర స్నానాలకు వెళ్ళరాదని మేదర మెట్ల ఎస్‌ఐ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్సై సురేష్ లు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## క్రికెట్ మ్యాచ్‌వీక్షణకు పట్టణంలో బిగ్ డిజిటల్ ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పాటు చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, నవంబర్ 2, ప్రభాతవార్త**
ఆదివారం భారత మహిళా క్రికెట్ టీం ఫైనల్‌కు చేరుకున్న సందర్భంగా ఐసీసీ మహిళా క్రికెట్ వరల్డ్ కప్ ఇండియా వర్సెస్ సౌత్ ఆఫ్రికా ఫైనల్ మ్యాచ్ సందర్భంగా మహిళలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో దర్శి పట్టణం, గడియారస్తంభం సెంటర్ నందు లైవ్ టెలికాస్ట్ ను దర్శి నగర ప్రజలు వీక్షించేందుకు అనువుగా ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి దర్శి పట్టణం, గడియారస్తంభం సెంటర్ నందు బిగ్ డిజిటల్ ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పాటుచేయడం జరిగింది. ఈ లైవ్ మ్యాచ్‌ని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దర్శి పట్టణంలోని ప్రజానీకంతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎస్సై మురళి, టీడీపీ నాయకులు సాని సుబ్బయ్య, కర్ల శ్రీను, పట్టణంలోని వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు ఉన్నారు.

## దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించిన

# ఏపీ అగ్రికల్చర్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



**ముండ్లమూరు, నవంబర్ 2, ప్రభాతవార్త**
మండలంలోని పూరిమెట్ల గ్రామంలో మొంథా తుఫాన్ కి దెబ్బతిన్న మొక్కజొన్నను పంటని ఆదివారం పరిశీలించిన ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి. ఈ సందర్భంగా రైతుల్ని అడిగి పంటలు వివరాలను సేకరించారు. దెబ్బతిన్న పంటల రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులపాటి నాగేశ్వరరావు, బోడపాటి హనుమంతరావు, చింతలపల్లి వెంకటేశ్వరరావు, నిడిగంటి నారాయణ, రమణాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడిని కలిసిన రైతు విభాగం నేతలు



**అద్దంకి, నవంబరు 2, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా కొత్త పోలిరెడ్డి, రైతు విభాగం కార్యదర్శిగా ధూళిపాళ్ల నాగేశ్వరరావు నియమితులయ్యు ఈ సందర్భంగా అద్దంకి వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ను ఆదివారం స్థానిక కార్యాలయంలో కలిశారు. ఆయనకు శాలువా కప్పి తమ నియామకంపట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. వీరి వెంట బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి స్థానిక నేతలు ఉన్నారు.

# ఐదుగురు పేకాట రాయళ్లు అరెస్ట్



**సింగరాయకొండ, నవంబర్ 2, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని సుందర్‌నగర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులును ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై. బి.మహేంద్ర తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు తన సిబ్బందితో పేకాట శిభిరం పై దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.1,640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిదర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గొర్లగడ్డలో కరెంటు స్తంభాల సమస్యకు పరిష్కారం



**మార్కాపురం, నవంబర్ 2, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని గొర్లగడ్డ ప్రాంత ప్రజలను ఎన్నాళ్లుగానో భయభ్రాంతులకు గురి చేస్తున్న కరెంటు స్తంభాల సమస్యకు పరిష్కారం లభించింది. గొర్లగడ్డ పీర్ల చావిడి, జామియా మసీదు సమీపంలో ఉన్న రెండు కరెంటు స్తంభాలు క్రిందకు వంగి ప్రమాదకరంగా మారడంతో, వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యను స్థానిక టిడిపి పార్టీ మైనార్టీ నాయకుడు మొగల్ షాకీర్ హుస్సేన్ బేగ్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించి, ప్రమాదకరంగా ఉన్న రెండు స్తంభాలను తక్షణమే మార్చాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది తెల్లవారుజామున నుండే మొగల్ షాకీర్ ఆధ్వర్యంలో గొర్లగడ్డలో పాత స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో రెండు కొత్త కరెంటు స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు



**మార్కాపురం, నవంబర్ 2, ప్రభాతవార్త**
దివంగత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి డా మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా నెల్లూరులో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు అభివృద్ధి కోసం గౌతమ్‌రెడ్డి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పోరాట యోధుడిలా పనిచేశారని తెలిపారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశ్వాసపాత్రుడిగా గౌతమ్‌రెడ్డి నిలిచారని తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. గౌతమ్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్, తిరుపతి రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న మాచవరం

# ఆర్అండ్‌బి రహదారికి చురుకుగా నిర్మాణ పనులు



**సంతనూతలపాడు, నవంబర్ 2 ,ప్రభాతవార్త**
తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు సంతనూతలపాడు మండలం మాచవరం సమీపంలో భాగా దెబ్బతిన్న ఆర్అండ్‌బి రహదారికి చురుకుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒంగోలు డివిజన్ ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కే.గోపి నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ షేక్ జానీ, ఆర్అండ్‌బి జేఈ దాసరి మాధవరావు ఆధ్వర్యంలో భాగా దెబ్బతిన్న రహదారికి చురుకుగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు లైన్లు నాలుగు పైపులైన్ నిర్మాణాలు చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ శ్రీనివాసరావు దెబ్బతిన్న రహదారిలో ముమ్మరంగా పనులు చేపడుతున్నారు. ఈనెల 3వ తేదీ సోమవారం సాయంత్రానికి పనులు పూర్తయి మంగళవారం నాడు ఆర్టీసీ బస్సులు పునరుద్దరణకు చర్యలు చేపడుతున్నారు. మద్దులూరు గ్రామ అభివృద్ధి నాయకులు, టీడీపీ నేత నువ్వల మీరయ్య, పాతూరి సంపత్, తదితరులు రహదారి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. తుఫాన్ వలన కురిసిన భారీ వర్షాలకు, అంతకుమునుపు ఇనగలేరు వాగు పొంగటంతో గత ఐదు రోజుల నుండి కొండపి, కామేపల్లి, జాళ్లపాలెం, మద్దులూరు తదితర కేంద్రాలకు ఒంగోలు ఆర్టీసీ డిపో నుండి వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిపివేయడంతో ఆయా గ్రామస్తులు రాకపోకలు నిలిచి ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఈ రహదారి దెబ్బతినడంతో ఆటోలతో సహా పూర్తిగా నిలిచిపోయాయి.

## పునరావాస బాధితులకు బియ్యం,

# నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన టీడీపీ నేత మహేష్



**సంతనూతలపాడు, నవంబర్ 2, ప్రభాతవార్త**
ఒంగోలు నగర పాలక సంస్థ పేర్నమిట్ట పరిధిలోని 39వ డివిజన్‌లో గల పునరావాస బాధితులకు ప్రభుత్వం అందించిన బియ్యం, నిత్యవసర వస్తువులను డివిజన్ అధ్యక్షులు కొల్లా మహేష్, డివిజన్ టీడీపీ సీనియర్ నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమతానగర్‌బూత్‌ఇన్‌చార్జి పసుపులేటి మాధవరావుతదితరులుపాల్గొన్నారు. తుఫాన్‌లో నియోజకవర్గం లో విస్తృత సేవలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుండి బెస్ట్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పట్ల టీడీపీ 39వ డివిజన్ అధ్యక్షులు కొల్లా మహేష్, టీడీపీ నాయకులు కే.వెంకటేశ్వర్లు, పి.మాధవరావు తదితరులు సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# ఎంఈఓ రఘురామయ్య సేవలు మరువలేనివి

**- ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు**



**దర్శి, నవంబర్ 2, ప్రభాతవార్త**
దర్శి మండల విద్యాశాఖాధికారి కాకర్ల రఘురామయ్య పని చేస్తూ పదవి విరమణ పొందిన సందర్భంగా ఆదివారం కురిచేడు రోడ్డులోని పీటీఎస్ కళ్యాణ మండపం నందు రాగల రఘురామయ్య ఉద్యోగ విరమణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులు కాకర్ల రఘురామయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రఘురామయ్య మంచి మనసు నుంచి లౌకికతత్వం ఎవరు ఏ పని అడిగినా చేసే వ్యక్తి మంచి సౌమ్యుడు ఇన్ని రోజులు విద్యాశాఖకి దర్శి మండలంలో జవాబు దారితనంగా పని చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు యుటీఎఫ్ ఏపీటీఎఫ్ కాట్వ ఫ్యాప్టో, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు నిరసనగా

## వైసీపీ ఆధ్వర్యంలో కొనగానివారిపాలెంలో కోటి సంతకాలు సేకరణ



**సంతనూతలపాడు, నవంబర్ 2, ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగాఆదివారం సాయంత్రం సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంను ప్రారంభించారు.సంతనూతలపాడు మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కొనగానివారిపాలెం గ్రామ వైసీపీఅధ్యక్షులు ఏటి మురళి పర్యవేక్షించారు. జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున నాయకత్వంలో ఈనెల 11వ తేదీన నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులో నియోజకవర్గ స్థాయిలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం, ర్యాలీ జరగనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతకు మునుపు కొనగానివారిపాలెం ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో చికిత్స పొందిన బండ్ల రోశయ్యను జడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు దుంపా యల్లమందారెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వైసీపీ నాయకులు టి.శేషిరెడ్డి, ఈ.మురళి, అన్నంగి పిచ్చయ్య, యద్దనపూడి సుబ్బారావు, గాండ్ల పెద్దబాబు, చుండూరి సాగర్, నాగయ్య, ధనలక్ష్మీ, మహిళ నేతలు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరించిన టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫీ



**సంతనూతలపాడు, నవంబర్ 2, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో ఆదివారం నాడు సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ మైనార్టీ సెల్ నూతన అధ్యక్షులు ఎస్‌డీ రఫీ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ సెల్ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## జార్జి ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**మార్కాపురం, నవంబరు 2, ప్రభాతవార్త**
స్థానిక జార్జి ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో బి.టెక్, డిప్లొమా, ఐటీఐ ప్రథమ సంవత్సర విద్యార్థుల ఆగమన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల టెక్నికల్ అడ్వైజర్, మాజీ మంత్రి డా॥ ఆదిమూలపు సురేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య అనేది సవాలుతో కూడినదే అయినప్పటికీ, మన తలరాతలు మార్చగల శక్తివంతమైన ఆయుధం విద్యనే అన్నారు. చదువు అంటే కేవలం పుస్తకాల పరిమితి కాదు, గౌరవం,మర్యాదలు, సమాజం పట్ల బాధ్యత, కష్టపడే నైజం అలవరచుకోవడం కూడా విద్యలో భాగమే" అని అన్నారు. విద్యార్థులు కళాశాలలో లభిస్తున్న వసతులను వినియోగించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల (పులివెందుల) ఇంగ్లీష్ ప్రొఫెసర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా॥ మేడికొండ సాంబయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాస్టర్ ఆఫ్ ఆల్ థింగ్స్ కావాల్సిన అవసరం లేదు, కానీ కనీసం మాస్టర్ ఆఫ్ అట్ లీస్ట్ వన్ థింగ్ కావాలన్నారు. ఏదో ఒక రంగంలో నిపుణతను సాధిస్తే విజయాన్ని అందుకోవచ్చు," అని తెలిపారు. అలాగే విద్యార్థులు తమలోని శక్తిని గుర్తించి, కళాశాల కాలంలో దాన్ని అభివృద్ధి చేసుకోవాలని, విద్య ద్వారా ప్రత్యేకంగా బాలికలు స్వయం ప్రతిపత్తిని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సి రాజబాబు, డీన్ అకడమిక్ డా॥ ఎం. మస్తానయ్య, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా॥ సయ్యద్ ఖాసిం, డైరెక్టర్ (అడ్మిషన్స్) డా॥ డానియల్, మెసేజ్ డే కోఆర్డినేటర్ విజయబాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.ఎన్‌సిసి గార్డ్ ఆఫ్ హానర్ ప్రదర్శన ఆకట్టుకోగా, విద్యార్థులు అందించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమానికి మరింత ఆకర్షణగా నిలిచాయి.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల ఉద్యమం



**మార్కాపురం, నవంబరు 2, ప్రభాతవార్త**
ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు నిరసనగా, ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని 2వ బ్లాక్ ఏకలవ్య కాలనీలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు పాల్గొని సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ఆటలు ఆడే ఈ ప్రభుత్వానికి కనువిప్పు కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు షేక్ సలీం, వార్డు 2 ఇన్‌చార్జ్ పాపిశెట్టి వెంకటేశ్వర్లు (నాయుడు), వార్డు అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషీర్ అలీ బేగ్, మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గొల్లమారి శ్రీనివాసరెడ్డి, టౌన్ జనరల్ సెక్రటరీ గొల్లమారి సత్యనారాయణ రెడ్డి, టౌన్ వైస్ ప్రెసిడెంట్ బొగ్గరపు శేషగిరిరావు, షేక్ మహబూబ్ బాషా, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శాంత కుమార్, వైఎస్సార్‌టీయూసీ టౌన్ అధ్యక్షుడు చెన్నారావు, 2వ బ్లాక్ మాజీ కౌన్సిలర్ ముత్తుజావలి తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని మార్కాపురం వైఎస్సార్సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ రఫీ సమన్వయపరిచారు.


# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



**గిద్దలూరు రూరల్, నవంబరు 2, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన గిద్దలూరు – ఒంగోలు రహదారిలోని రంగారెడ్డి పల్లె సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు రంగారెడ్డి గ్రామ సమీపంలోని హైవే రహదారిపై కారు, ద్విచక్రవాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 కు సమాచారమందించగా 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రునికి ప్రథమచికిత్స నిర్వహించిన అనంతరం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలందించారు.

## పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే,

## వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



**ముండ్లమూరు, నవంబర్ 2, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామంలో పార్టీ నాయకులు అబ్బుని అంజిరెడ్డి కుమార్తె వివాహానికి ఆదివారం హాజరై ఆశీర్వదించిన దర్శి ఎమ్మెల్యే,ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. అనంతరం మండలంలోని తమ్మలూరు గ్రామంలో మార్తల నాగార్జునరెడ్డి వివాహానికి హాజరై నూతన వరుడుని ఆశీర్వదించిన దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. అనంతరం ముండ్లమూరు మండలంలోని కొమ్మవరం గ్రామంలో పమ్మి వెంకటేశ్వరరెడ్డి కుమార్తె ఫంక్షన్‌కి హాజరై ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత, బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ రత్నరాజు, వైసీపీ జిల్లా కార్యదర్శి సూదిదేవర అంజయ్య, వైసీపీ మండల అధ్యక్షులు చింత శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బంక నాగిరెడ్డి మండల యూత్ అధ్యక్షులు దుగ్గినేని రామకృష్ణ, వైసీపీ నాయకులు గుణపాటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఇరుగుల కొండారకెడ్డి, గొంది అప్పిరెడ్డి, మేకల వెంకటేశ్వర్లరెడ్డి, పాలడుగు చిరంజీవి, మేకల కృష్ణారెడ్డి, గాదె నాసర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనిగిరిలో డ్రోన్ పర్యవేక్షణ

## -'స్కై ఐ ప్రకాశం' ప్రాజెక్ట్‌లో భాగంగా ఆధునిక నిఘా



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా పోలీసు శాఖ చేపట్టిన 'స్కై ఐ ప్రకాశం' ప్రాజెక్టులో భాగంగా కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్ వద్ద డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షణ నిర్వహించారు. డ్రోన్ సర్వేలైన్స్ ద్వారా పట్టణంలో రహదారి రద్దీ, వాహనాల కదలికలు, ప్రజల భద్రతా పరిస్థితులను అధికారులు గమనించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరాల నిరోధం, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజాభద్రతను మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పోలీసులు తెలిపారు. ఈ డ్రోన్ పర్యవేక్షణ కార్యక్రమాన్ని కనిగిరి పోలీసు స్టేషన్ ఎస్సై శ్రీరామ్, సిబ్బంది సమక్షంలో నిర్వహించారు. పట్టణ భద్రత, ప్రజల ఆత్మవిశ్వాసం పెంచే దిశగా పోలీసు శాఖ ఇటువంటి ఆధునిక చర్యలను కొనసాగించనుంది.

# తుఫాన్ ప్రభావంతో అపరిశుభ్రమైన యేరువారిపల్లి

## - వెంటనే చర్యల్లోకి దిగిన సర్పంచ్ వెంకటయ్య



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
కనిగిరి మండలం యేరువారిపల్లి గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన భారీవర్షాల కారణంగా గ్రామంలోని పలు ప్రాంతాలు, ముఖ్యంగా నీటి కుళాయిలు వద్ద, అపరిశుభ్రంగా మారాయి. గ్రామస్తులు ఈ సమస్యను సర్పంచ్ వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి శుభ్రత పనులను ప్రారంభించారు. నీటి కుళాయిల మరమ్మత్తు పనులు రెండు రోజుల్లో పూర్తి చేయిస్తామని, అలాగే మూడు రోజుల్లోగా మొత్తం గ్రామాన్ని పూర్తిగా శుభ్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంలో సర్పంచ్ చురుకైన స్పందనకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# హైవే భద్రతకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కఠిన హెచ్చరిక

## - శిథిలాలు వేసిన వారి వివరాలు తెలిపిన వారికి రూ.10,000 బహుమతి



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
జాతీయ రహదారి భద్రతను కాపాడటం మన అందరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. హైవే రోడ్డుపై ఇళ్ల నిర్మాణాల నుంచి వచ్చిన శిథిలాలు, మట్టి, వ్యర్థాలను రహదారి పక్కన వేస్తున్న వారి వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. జాతీయ రహదారి పక్కన శిథిలాలు వేసిన వారి వివరాలు లేదా ఫొటోలు, వీడియో సాక్ష్యాలు అందించిన వారికి రూ.10వేలు బహుమతి అందజేస్తామని తెలిపారు. ప్రజలు ఈ సమాచారాన్ని వెంటనే పంపించాలని కోరుతూ, హైవే శుభ్రత, సురక్షిత ప్రయాణం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# చలంచర్ల కుటుంబ గృహాప్రవేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్

**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని చలంచర్ల యోగిరాములు- నాగేంద్ర కొత్త ఇంటిలో నిర్వహించిన గృహ ప్రవేశ వేడుకలో వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఆయన సత్యనారాయణ వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మీ కొత్త గృహం శాంతి, శ్రేయస్సు, ఆనందాలతో నిండిపోవాలని కోరుకుంటున్నాను అని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సయ్యద్ నాయబ్ రసూల్, పల్నాటి భాస్కర్‌రెడ్డి, ద్రోణాదుల చెంచులు, చింతలపూడి చెంచులు, ఆవుల తిరుపతిరెడ్డి, పొతకమూరి సాయికిరణ్, చిలకల నారాయణరెడ్డి, పాలూరి కోటిరెడ్డి, భీమవరపు చెన్నయ్య, ద్రోణాదుల మధు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేదలకు శాపం

## - దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమతో రాష్ట్రానికి తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం పేదలకు శాపంగా మారనుందని వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. కనిగిరి మండలం గురవాజీపేట పంచాయతీలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ - రచ్చబండ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను స్థాపించింది. వాటిలో ఐదింటిని ఇప్పటికే పూర్తి చేసింది. కానీ మూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజ్ కూడా తెచ్చలేకపోయారు. ఇప్పుడు ఆ ప్రజాప్రయోజనకరమైన కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అప్పగించడం పేద విద్యార్థుల కలలను చెదరగొడుతోందని విమర్శించారు. మెడికల్ విద్య అందరికి అందుబాటులో ఉండేందుకు ఈ కాలేజీలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది అని అన్నారు. అనంతరం ప్రజలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కలికిల వెంకటరత్నం, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, నరాల వెంకటరెడ్డి, కుమ్మరికుంట రవి, మన్నేపల్లి పేతురు, మార్తాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల కార్తీక వనభోజనాలకు ఎమ్మెల్యే ఉగ్రకు ఆహ్వానం



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
కార్తీక మాసం సందర్భంగా ఈనెల 9వతేదీ ఆదివారం జరగనున్న ఆర్యవైశ్యుల కార్తీక మాస వనభోజనాలకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ఆర్యవైశ్య ప్రముఖులు ఆహ్వానించారు. ఆదివారం అమరావతి మైదానంలో ఎమ్మెల్యేను కలిసి శ్రీశైలం పాలకవర్గ సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవకి శ్రీనివాసులు, బచ్చు రమేష్, నల్లపాటి మల్లికార్జున్, ఆర్యవైశ్య నాయకులు రావపూటి వెంకటేశ్వర్లు, వేమా సత్యం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. వనభోజనాల కార్యక్రమానికి తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు వారు తెలిపారు.

# కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న హుస్సేన్‌రెడ్డి

## - కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారు



**పామూరు, నవంబర్ 2, ప్రభాతవార్త**
మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచనలతో పామూరు మండలం వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి ఆధ్వర్యంలో పామూరు మండలం లక్ష్మీనరసాపురం పంచాయతీ నందు కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి గట్ల విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, పోలు మోహన్‌రెడ్డి, జక్కు సుబ్బారెడ్డి, మూలే కోటిరెడ్డి, పాలకొల్లు హరికృష్ణ రెడ్డి, గాజులపల్లి బాబు, కృష్ణారెడ్డి, వేముల మాలకొండయ్య, మన్నేపల్లి ప్రతాప్, జల్లూరి రవీంద్రరెడ్డి, వేముల మధు, వేముల నారాయణ, గంధం ఇమ్మానియేలు, పాలకీర్తి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత సాయి భక్త సమ్మేళనానికి ఆహ్వానం

## - కనిగిరి సాయిబాబా దేవస్థానంలో నిర్వాహకుల బృందం పత్రాల అందజేత



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
రాజమండ్రి సమీపంలోని తాళ్లపూడి గ్రామంలో డిసెంబర్ 26, 27వ తేదీలలో జరగనున్న అఖిల భారత షిర్డీ సాయిబాబా భక్త సమ్మేళనంకు భక్తులను ఆహ్వానిస్తూ కార్యక్రమం ఆదివారం కనిగిరి షిర్డీ సాయిబాబా దేవస్థానంలో జరిగింది. ఈ సందర్భంగా సమ్మేళన నిర్వాహకులు దేవస్థానం పాలక మండలి సభ్యులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా సాన్నిధ్యాన్ని పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సాయిబాబా దేవస్థానం కార్యదర్శి గోపాలుని హరిహరరావు, సమ్మేళనం నిర్వాహకులు కాళ్ళ రత్నాజీ రావు, కనిగిరి సాయిబాబా దేవస్థానం అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబుల్‌రెడ్డి, సద్గురు సాయి సేవాసమితి కోశాధికారి ముచ్చర్ల ధర్మారావు, ఉపాధ్యక్షులు వీసీ రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లో పూజ చేస్తున్న మహిళపై కత్తితో దాడి చేసిన యువకులు

## - యువకుడిని పోలీసుస్టేషన్లో అప్పగించిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఫిరోజ్



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని సాయిబాబా హాల్ ఎదురు బజార్‌లో శనివారం ఉదయం జరిగిన ఘటన స్థానికులను కుదిపేసింది. ఇంట్లో పూజ చేసుకుంటున్న రాచగుండ్ల సుబ్బులు అనే మహిళపై పండ్లు అమ్ముకునే శివ అనే యువకుడు ఆకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. దాడిలో మహిళకు గాయాలు కావడంతో ఆమెను తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనను గమనించిన ప్రజలు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ అప్రమత్తంగా స్పందించి, ఆ యువకుడిని వెంటనే పట్టుకుని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి అప్పగించారు. కనిగిరి ఎస్సై శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడి చేసిన శివను పోలీసులు విచారిస్తున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న కనిగిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ యువకుడ్ని పట్టుకుని పోలీసు స్టేషన్లో అప్పగించడంపై కనిగిరి పట్టణ ప్రజలు ఫిరోజ్‌ను అభినందిస్తున్నారు.

# కనిగిరి టీడీపీ అనుబంధ విభాగాల కమిటీ కొత్త బృందం ఎంపిక

**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాల కమిటీ ఎంపిక ఆదివారం పూర్తయింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నూతన కమిటీ పేర్లను ప్రకటించింది. బీసీ సెల్ అధ్యక్షునిగా గంజిగుంట శ్రీనివాసులు, క్రిస్టియన్ సెల్ అధ్యక్షునిగా కుంచం జక్కరయ్య, సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా షేక్ గయాజ్ భాష, లీడల్ సెల్ అధ్యక్షునిగా పాశం పిచ్చయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా కరాటపు స్వప్న, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా బలసాని కోటయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా జయంపు గోపాల్, డాక్టర్ సెల్ అధ్యక్షునిగా సయ్యద్ ఇస్మాయిల్, ఐటీడీపీ అధ్యక్షునిగా నలబోతుల నాగరాజు, తెలుగు రైతు అధ్యక్షునిగా అక్కి శ్రీనివాసులురెడ్డి, తెలుగు యువత అధ్యక్షునిగా దొడ్డ వెంకట సురేష్‌రెడ్డి, విద్యార్థి సంఘం అధ్యక్షునిగా షేక్ అఫ్రోజ్, టీఎన్‌టీయుసీ అధ్యక్షునిగా షేక్ జాబర్, ట్రేడర్ సెల్ అధ్యక్షునిగా పందిటి హరీష్, విభిన్న ప్రతిభావంతుల విభాగం అధ్యక్షునిగా జలపాటి తిరుపతి నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అభినందించారు. కనిగిరి నియోజకవర్గంలోని వివిధ విభాగాల నాయకులు, టీడీపీ కార్యకర్తలు కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్స్ ఫంక్షన్



**చీరాల, అక్టోబర్ 2, ప్రభాతవార్త**
గుంటూరు రింగ్ రోడ్డులోని సూర్యదేవర కళ్యాణ మండపం నందువాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ పెద్ది శివరామ ప్రసాద్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్స్ ఫంక్షన్ జరిగింది. ఈ సభలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి, మాజీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్స్ చెలికాని సీతారామయ్య, నేతాజీ సుబ్బారెడ్డి, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ శ్రీనివాసులురెడ్డి, కాబోయే గవర్నర్ బలరామయ్య నాయుడు పాల్గొన్నారు. 2025 సంవత్సరానికి చీరాల వాకర్స్ అసోసియేషన్ చేసిన సేవా కార్యక్రమాలకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు, ఎంఆర్‌కే మెమోరియల్ స్పెషల్ అవార్డు వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, రంగా హనుమంతరావు, పూర్ణా, చక్క నారాయణ, చెంగలరాయుడు, లాల్, రమేష్, శ్రీనివాసరావు, రవి, భాస్కర్, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు చిన్నగంజాం మండలంలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన



**మార్టూరు, నవంబర్ 2, ప్రభాతవార్త**
సోమవారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిన్నగంజాం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీసీతారామస్వామి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

# విశ్వజననీ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవ వేడుకలు



**మార్టూరు, నవంబర్ 2, ప్రభాతవార్త**
విశ్వజననీ ఫౌండేషన్ నరసరావుపేట వారు తమ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళాశాల నిలయంలో ఎంతో వైభవంగా వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ సినీ రంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఆరు సంవత్సరాలుగా వృద్ధులకు అన్నదానం మహిళలకు జీవనోపాధి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ఫీజులు నోట్ బుక్స్ పంపిణీ, వైద్యశిబిరాలు పేదలకు పలు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మార్టూరు అమ్మ ఆశ్రమం చేస్తున్న సేవలను గుర్తించి ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందుకు విశ్వ జనని సేవారత్నం అవార్డును బహుకరించి సత్కరించారు. అమ్మఆశ్రమం సేవలను గుర్తించి అవార్డు అందించిన ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం అవార్డు అందజేసిన సినీ నటులు పృధ్వి గౌతమ్ రాజు తదితరులకు ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.

# అందరి మన్ననలు పొందిన వ్యక్తి రఘురామయ్య

## - ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన మహోత్సవ

## కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ - లలిత్ సాగర్ దంపతులు





**దర్శి, నవంబర్ 2, ప్రభాతవార్త**
దర్శి పట్టణం కురిచేడు రోడ్డులోని పీటీఎస్ కన్వెన్షన్ నందు ఆదివారం దర్శి మండల విద్యాశాఖ అధికారి కాకర్ల రఘురామయ్య ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమానికి హాజరై కాకర్ల ఘురామయ్య - రమణమ్మ దంపతులను శాలువాతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేసిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ - లలిత్ సాగర్ దంపతలు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయునీ, ప్రధానోపాధ్యాయునిగా, దర్శి మండల విద్యాశాఖాధికారి విశేష సేవలు అందించి గత నెల 31వ తేదీ రిటైర్డ్ అయి ఈ రోజు ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన మహోత్సవం కార్యక్రమం నేను పాల్గొనడం చాలా సంతోషం మీరు మీ కుటుంబ సభ్యులతో నిండు నూరేళ్ల సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారు. డాక్టర్ లక్ష్మీతో పాటు ఐఏఎస్ సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, డీజీఈ శ్రీనివాసరెడ్డి, జేఏ సర్వీస్ వర్సెస్ సుబ్బారావు, ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, ప్రకాశం డీఈఓ ఏ.కిరణ్ కుమార్, దర్శి ఎంఈఓ-2 రమాదేవి, ఐదు మండలాల ఎంఈఓలు, ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు ఉన్నారు.

# గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు,నవంబర్ 2, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయ లక్ష్మి అమ్మవారి మూల విరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్. కామేశ్వర శర్మ, ప్రకాష్ రావు శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లా తో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జీ. వాసు బాబు, ఆర్ఏ కాటూరి ప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు.

# ఘనంగా శ్రీ అంకాళమ్మ తల్లి ఆలయంలో కార్తీక వనభోజన కార్యక్రమాలు





**కంభం, నవంబరు 2, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని చెరువు కట్టకు వెళ్ళు దారిలోగల శ్రీ అంకాళమ్మ తల్లి దేవస్థానంలో కార్తీక వనభోజన కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగాణంలో శ్రీ అంకాళమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్తీక వనభోజన కార్యక్రమాల సందర్భంగా పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, కాయకర్పూరములు సమర్పించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ప్రాంగాణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి దర్శనానికై ఆలయానికి చేరుకున్న భక్తులు అన్నప్రసాద వితరణలో పాల్గొని అమ్మవారికి చదివింపులు చదివించి తమ భక్తిని చాటుకున్నారు.

# అంగరంగ వైభవంగా కోటి దీపోత్సవ వేడుకలు

## - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల దంపతులు





**గిద్దలూరు రూరల్, నవంబరు 2 ,ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణం, ఒంగోలు రోడ్డులో పొలంరెడ్డి బాలకృష్ణారెడ్డి వారి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో రెండవ రోజు 10 అడుగుల మహా శివలింగానికి మహా రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కోటి దీపోత్సవ వేడుకల్లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకం నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ కేంద్రంలో కార్తీక మాసంలో ఇలాంటి గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం నియోజకవర్గంలోనే ప్రథమం అని, పట్టణ ప్రజలు, నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్న కార్యక్రమంలో తాము పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని, ఆ భగవంతుడిని ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ప్రార్థించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి తెప్పోత్సవం

## - శ్రీదేవి భూదేవి సమేతంగా పుష్కరిణిలో విహరించిన చెన్నకేశవస్వామి

## - మార్మోగిన చెన్నకేశవ నామస్మరణలు







**మార్కాపురం, నవంబర్ 2, ప్రభాతవార్త**
ఆరాధ్యదైవం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి వార్షిక తెప్పోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మార్కాపురం తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రంలో, స్వామివారు కోనేటి విహారానికి సజ్జమై, నిండుకుండలతో భక్తజనులను మంత్ర ముగ్ధులను చేశారు. వేలాది భక్తులు తిలకించడానికి తరలివచ్చి భక్తి, ఆనందాలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో అద్భుత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి ఉత్సవ తెప్పను, కోనేటిని అందంగా అలంకరించగా దృశ్యం భక్తులను పరవశులను చేసింది. భక్తుల భద్రత కోసం డీఎస్పీ యూ నాగరాజు, సీఐ సుబ్బారావు, ఎస్ఐలు ఎం. సైదుబాబు, అంకమరావుల ఆధ్వర్యంలో సుమారు 250 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు. అలాగే మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత, నీటి, విద్యుత్, రవాణా వంటి సౌకర్యాలను సమర్థంగా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తీసుకున్న చర్యలతో, తెప్పోత్సవం ఎటువంటి ఆటంకం లేకుండా విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా భక్తులు "గోవిందా గోవిందా" నినాదాలతో ఆలయ పరిసరాలను మార్మోగించారు.

# మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అక్రమం

## - ప్రభుత్వ కక్ష సాధింపు చర్యే

## - వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల



**కనిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**
మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు పూర్తిగా అక్రమం అని వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కల్తీ మద్యం కేసులో జోగి రమేష్ ని కేవలం రాజకీయ కక్షతోనే ఇరికించారు. కస్టడిలో ఉన్న నిందితుడి ద్వారా పేరును చెప్పించడం పూర్తిగా నాటకమే. ఆయన ఆలయ సాక్షిగా చేసిన ప్రమాణంపై ఇప్పటి వరకు టీడీపీ నేతలు స్పందించకపోవడం వారిదే తప్పు అని నిరూపిస్తుందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వ లక్ష్యమైందని దద్దాల ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని లిక్కర్ స్కామ్‌లు సృష్టించి టీడీపీ నాయకుల దోషాలను వైఎస్సార్‌సీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నారు. కాశీ బుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట, మొంథా తుఫాన్ సహాయ కార్యక్రమాల్లో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే జోగి రమేష్‌ను అరెస్టు చేశారని ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేని ప్రభుత్వం ప్రజా దృష్టి మరల్చేందుకు కక్ష సాధింపుతో కేసులు పెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మౌనంగా ఉండడం ఆశ్చర్యకరం అని దద్దాల విమర్శించారు.

3-11Pg5 9_3-11Pg5.qxd 02/Nov/25 9:16 PM Page 1



# కోలుకోలేని కాంగ్రెస్, పాక్



## ఆర్జేడి జంగిల్‌రాజ్, కాంగ్రెస్ సిక్కుల ఊచకోత

### బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

### పాట్నాలో ప్రధాని మెగా రోడ్‌షో

**నవడ, నవంబరు 2:** భారత్‌ను దొంగదెబ్బ తీయడానికి యత్నించిన పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్‌తో గట్టి గుణపాఠం చెప్పామని, ఆ రోజు భారత సైన్యం చూపిన షాక్ నుంచి అటు పాకిస్తాన్, ఇటు కాంగ్రెస్ ఇప్పటిదాకా కోలుకోలేకపోయాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ధ్వజమెత్తారు. పాకిస్థాన్‌లో ఆపరేషన్ సిందూర్ జరుగుతున్న వేళ, భారత్‌లో కాంగ్రెస్‌ను నడిపే కుటుంబీకులు నిద్రలేని రాత్రులను గడిపారని ఆయన ఆరోపించారు. పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాదులను అంతం చేస్తామని ఇచ్చిన మాట ప్రకారమే ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించామన్నారు. ఆ సైనిక చర్యను చూసి యావత్ భారతావని గర్వించిందని పేర్కొన్నారు.

ఆదివారం నవడ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, జంగిల్ రాజ్ అన గానే బీహార్‌లో సాగిన ఆర్‌జెడి పాలన గుర్తుకొ స్తుందన్నారు. అలాగే సిక్కుల నరమేధం అనగానే కాంగ్రెస్ పార్టీ గుర్తుకొస్తుందన్నారు. ఆర్‌జెడి, కాంగ్రెస్‌పార్టీలు కుటుంబపార్టీలని, వాళ్ల స్వలా భంకోసమే పనిచేస్తుంటాయని మోడీ దుయ్య బట్టారు. కాంగ్రెస్ తలకు నాటు తుపాకీని గురి పెట్టి మహాకూటమి సిఎం అభ్యర్థిత్వాన్ని ఆర్‌జెడి దక్కించుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష కూటమి సిఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను గుర్తించేందుకు కాంగ్రెస్‌కు అస్సలు ఇష్టంలేదని, ఈ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు పరస్పరం కీచులాడుకుంటాయన్నారు. ఇండియా కూటమి పార్టీలు బీహార్‌కు మేలు చేయలేవు. ఎన్‌డిఏ కూటమి మళ్లీ రికార్డు విజయాన్ని నమోదు చేసుకుని అధికారంలోకి వస్తున్నారు. వికసిత బీహార్ కోసం పనిచేస్తామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. బీహార్‌లో దాక్కున్న చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ రాష్ట్రంలో యాత్ర నిర్వహించారని విమర్శలు గుప్పించారు. చొరబాటుదారులను బీహార్ నుంచి తరిమికొట్టాల్సిందే. లేదంటే బీహారీల వనరులను వాళ్లు కబళిస్తారని అన్నారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సాయంత్రం పాట్నాలో మెగా రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్‌షోలో ప్రధాని మోడీతోపాటు బీహార్ బిజెపి అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్, పాట్నా సాహిబ్ ఎంపీ రవిశంకర్ ప్రసాద్, కేంద్ర మంత్రి, జెడియు నేత రాజీవ్ రంజన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## నిరంతర అనిశ్చితి సృష్టించాలనే భారత్ మాపై కుట్రలు

### పాక్ రక్షణమంత్రి క్వాజా ఆసిఫ్ ఆరోపణలు

**లాహోర్, నవంబరు 2:** నిరంతరం ఘర్షణలు సృష్టిస్తూ తమను తమ దేశాన్ని ఎప్పుడూ నిరంతరం ఆందోళనకు గురిచేసే కుట్ర వ్యూహాలను భారత్ అనుసరిస్తోందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆరోపించారు. అఫ్గానిస్థాన్‌తో పాకిస్థాన్ ఘర్షణలు, సరిహద్దుల్లో పరస్పర దాడుల నేపథ్యంలో భారత్‌పై ఆసిఫ్ ఈ నిందలు వేసారు. అదేవిధంగా అఫ్గాన్‌తో తాజా ఘర్షణలు ఆపేందుకు ఖతార్, టర్కీ చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉన్నాయని ఖవాజా అన్నారు. అయితే తూర్పు, పశ్చిమ సరిహద్దుల ఘర్షణల్లో తాము నిమగ్నమయ్యేలా భారత్ ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. అఫ్గాన్ ఘర్షణలు, ఆపరేషన్ సింధూర్‌ను ప్రస్తావిస్తూ ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్థాన్ మాజీ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ కాలం నుంచి భారత్ తమపై పరోక్ష యుద్ధం చేస్తోందని ఆరోపించారు. దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. అవసరమైతే వాటిని బయట పెడతామన్నారు. ఇంతకుముందు కూడా భారత్ తరఫున అఫ్గాన్ పరోక్ష యుద్ధం చేస్తోందంటూ ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలో అఫ్గాన్ వాసులు అక్రమంగా ఉండటాన్ని పాక్ అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తిందని ఆసిఫ్ పేర్కొన్నారు. అఫ్గాన్ నుంచి ఏదైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే దానికి ఆ దేశమే జవాబుదారీగా ఉంచే నిబంధనలు చర్చల్లో ఉన్నాయన్నారు. తమవైపు నుంచి ఎలాంటి శత్రు కార్యకలాపాలు జరగడం లేదన్నారు. అఫ్గానిస్థానే కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవల పాక్‌అఫ్గాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ క్రమంలో కాల్పుల విరమణ కొనసాగింపునకు రెండు దేశాలు ఇటీవల అంగీకరించాయి. సయోధ్య కుదిర్చేందుకు టర్కీ, ఖతార్‌లు ప్రయత్నిస్తున్నాయి.

## భారతీయుల కోసమే ట్రంప్ కఠిన వీసా నిబంధనలు

**వాషింగ్టన్, నవంబరు 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక వలస విధానాలపై తన కఠిన వైఖరిని మరింత పెంచుతున్నారు. అమెరికన్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ పేరుతో ఆయన తీసుకుంటున్న వరుస నిర్ణయాలు అమెరికాలోని భారతీయ విద్యార్థులు, వృత్తి నిపుణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత రెండు నెలల్లో ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన మూడు కీలక మార్పులు భారతీయ సమాజంలో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ) ఆటోమేటిక్ రెన్యువల్‌ను రద్దు చేయడం, హెచ్1బీ వీసా ఫీజును భారీగా పెంచడం, గ్రీన్ కార్డుదారులకు పౌరసత్వ పరీక్షను కఠినతరం చేయడం వంటివి ఇప్పటికే ప్రకటించారు. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) గతనెల 30 నుంచి ఈఏడీల ఆటోమేటిక్ రెన్యువల్ విధానాన్ని ఆకస్మికంగా నిలిపివేసింది. గతంలో ఈఏడీ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకుంటే, ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత పర్మిట్‌పైనే ఉద్యోగం చేసుకునే వెసులుబాటు ఉండేది. కానీ కొత్త నిబంధన ప్రకారం ప్రతి రెన్యువల్‌కు మళ్లీ కొత్తగా క్షుణ్ణంగా పరిశీలన జరిపాకే అనుమతి ఇస్తారు. సాధారణంగా ఈఏడీ రెన్యువల్ ప్రక్రియకు 7 నుంచి 10 నెలల



సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ఆటోమేటిక్ రెన్యువల్ లేకపోవడంతో హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ)పై ఉన్న ఎఫ్1 విద్యార్థులు వంటి వేలాది మంది భారతీయులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఇమ్మిగ్రేషన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెప్టెంబరు 19న ట్రంప్ సర్కార్ హెచ్1బి వీసాలపై కొత్త వార్షిక ఫీజును ప్రకటించింది. కొత్తగా హెచ్1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలు ప్రతి ఉద్యోగికి ఏటా లక్ష డాలర్లు (సుమారు రూ. 88 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజును ఉద్యోగికాకుండా, ఉద్యోగం ఇచ్చే సంస్థే చెల్లించాలి. అయితే ఈ ఏడాది సెప్టెంబరు21, 2025 నాటికి ఇప్పటికే అమెరికాలో ఉన్నవారికి, దేశంలోనే ఉండి వీసా స్టేటస్ మార్చుకునేవారికి (ఉదాహరణకు, ఎఫ్1నుంచి హెచ్1బీ) ఈ నిబంధన వర్తించదని యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీటీఎస్) స్పష్టం చేసింది. హెచ్1బీ వీసాల్లో 70 శాతం పొందుతున్న భారతీయులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ ఫీజుల పెంపుతో వాల్‌మార్ట్ వంటి దిగ్గజ సంస్థలు హెచ్1బీవీసా అవసరమైన అభ్యర్థుల నియామకాలను తాత్కాలికంగా నిలిపివేశాయి. గ్రీన్ కార్డు హోల్డర్లు అమెరికా పౌరసత్వం పొందాలంటే ఎదుర్కోవాల్సిన పౌరశాస్త్ర పరీక్షను కూడా ట్రంప్ ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. గతనెల 20 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త విధానంలో, దరఖాస్తుదారులు 128 ప్రశ్నల నుంచి ఎంపిక చేసిన 20 ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఇందులో కనీసం 12 ప్రశ్నలకు సరైన సమాధానం ఇస్తేనే ఉత్తీర్ణులవుతారు. గతంలో ఈ పరీక్షలో 10ప్రశ్నలకు 6 సరైన సమాధానాలు చెబితేసరిపోయేది. దీంతో పాటు, దరఖాస్తుదారుల 'నైతిక ప్రవర్తన'పై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలుస్తోంది. ఈ పరిణామాలు అమెరికాలోని భారతీయ సమాజంలో భవిష్యత్తుపై తీవ్ర అనిశ్చితిని, ఆందోళనను సృష్టిస్తున్నాయి. వలసలను నియంత్రించాలనే లక్ష్యంతో ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు భారతీయ వృత్తి నిపుణులకు కొత్త సవాళ్లను విసురుతున్నాయి.

## పాక్ సాయంతో నాపై అమెరికా కుట్ర

### బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా

**న్యూఢిల్లీ, నవంబరు 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా దేశం విడిచి వెళ్ళిన తర్వాత తొలిసారిగా తన మౌనం వీడారు. దేశంలో తనకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థుల నిరసనలు అమెరికా కుట్రపన్ని పాకిస్తాన్ నిర్వహించిన ఉగ్రవాద దాడి అని షేక్ హసీనా అన్నారు. గత సంవత్సరం జూలై,ఆగస్టులో జరిగిన సంఘటనలు తనను అధికారం నుండి తొలగించే లక్ష్యంతో జరిగిన విదేశీ కుట్రలో భాగమని హసీనా అన్నారు. దీనిని విప్లవం అని పిలవకండి, ఇది బంగ్లాదేశ్‌పై జరిగిన ఉగ్రవాద దాడి, అమెరికా ప్లాన్ చేసి పాకిస్తాన్ చేతులమీదుగా అమలు చేసింది. విద్యార్థుల తిరుగుబాటుగా చిత్రీకరించారు. ఇది అధికారం నుండి తొలగించడానికి జరిగింది. ప్రభుత్వంపై నిందలు వేసిన హత్యలను పోలీసులు చేయలేదు, ఉగ్రవాదులు చేశారు, ప్రజలను రెచ్చగొట్టారని షేక్ హసీనా సంచలన ఆరోపణలు చేశారు. బంగాళాఖాతంలోని వ్యూహాత్మక సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుకునే అమెరికన్ల ఆదేశం మేరకు నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనస్ తనను అధికారం నుండి తొలగించడానికి కుట్ర పన్నారని హసీనా నేరుగా ఆరోపించింది. దీని



వెనుక ఉన్న అసలు వ్యక్తి ఎవరో తెలుసా? అది యూనస్. అమెరికన్లు సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని అమెరికా కోరుకున్నారు. అందుకు అంగీకరించి ఉంటే, వారు అధికారం నుండి తొలగించేవారు కాదు. కానీ దేశాన్ని అమ్మడానికి నిరాకరించానని హసీనా అన్నారు. అమెరికన్ల ఆదేశం మేరకు యూనస్ గత ఏడాది జూలై ,ఆగస్టులో బంగ్లాదేశ్‌పై ఉగ్రవాద దాడులకు ప్రణాళిక రూపొందించాడు. నిధులు సమకూర్చాడు. అమలు చేశాడు. అతను తన సొంత ఆశయాల కోసం తన సొంత దేశాన్ని నాశనం చేసుకున్న దేశద్రోహి అని ఆరోపించారు. పాకిస్తాన్‌లోని అతివాద శక్తులు బంగ్లాదేశ్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌లకు చాలా కాలంగా మద్దతు ఇస్తున్నాయని 1971 నుండి కొనసాగుతున్న జోక్యం ఇదేనని హసీనా ఆరోపించారు. ఇదిలావుంటే, హసీనా దేశం విడిచి వెళ్ళిన తర్వాత, మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అవామీ లీగ్ కార్యకలాపాలను నిలిపివేసింది. మే నెలలో ఎన్నికల కమిషన్ పార్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. బంగ్లాదేశ్‌లోని పురాతన రాజకీయ పార్టీలలో ఒకటైన అవామీ లీగ్, కుటుంబ సంప్రదాయంలో ప్రజాదరణ పొందిన పార్టీ, ఇప్పుడు నిరసనకారుల మరణాలకు సంబంధించిన హత్య కేసులలో హసీనాపై అభియోగాలు మోపడంతో సహా అనేక చట్టపరమైన పోరాటాలను ఎదుర్కొంటోంది. మరోవైపు, బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ డిసెంబర్ ప్రారంభంలో సార్వత్రిక ఎన్నికల తేదీని ప్రకటించే అవకాశం ఉంది. సైన్యం, ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ఒత్తిడితో యూనస్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. గత ఏడాది ఆగస్టు 5న హసీనా బంగ్లాదేశ్‌ను విడిచి వెళ్ళవలసి వచ్చింది. అక్కడ జరిగిన నిరసనల్లో 1,400 మందికి పైగా మరణించారు. ఈ ఉద్యమం మొదట్లో ఉద్యోగ కోటా విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలుగా ప్రారంభమై రానురాను ఆమె రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఉద్యమంగా మారింది. బంగ్లాదేశ్‌ను 15 సంవత్సరాలకు పైగా పాలించిన హసీనా, నిరసనకారులు ఢాకాలోని తన నివాసం వైపుకు వస్తున్నప్పుడు ఆర్మీ చీఫ్ వకార్‌ఉజ్‌జమాన్ సలహా మేరకు దేశం విడిచి వెళ్లిపోయారు. అప్పటి నుండి, ఆమె ఢిల్లీలోని ప్రభుత్వ రక్షిత వసతి గృహంలో ఉంటున్నారు.

## మొకామా హత్య కేసు

### జెడియు అభ్యర్థి అరెస్టు అనంత్ సింగ్‌కు 14 రోజుల రిమాండ్

#### ఎన్నికల అధికారులపై ఇసి వేటు



**పాట్నా, నవంబరు 2:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ మొకామాలో జరిగిన జన్ సురాజ్ పార్టీ మద్దతుదారు దులార్‌చంద్ యాదవ్ హత్య కేసులో జెడియు అభ్యర్థి అనంత్ సింగ్‌ను పోలీ సులు అరెస్టు చేశారు. అనంత్ సింగ్‌తో మరో ఇద్దరిని పాట్నా పోలీసులు ఆయన నివాసంలో ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. హత్యకు గురైన దులార్‌చంద్ యాదవ్‌తో ఘర్షణ పడింది జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ మద్దతుదారులని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అనంత్ సింగ్‌తో పాటు అతని సహచరులు మాణికాంత్ ఠాకూర్, రంజిత్ రామ్ కూడా అరెస్టు చేసినట్లు పట్నా ఎస్‌ఎస్‌పీ కార్తికేయ కె.శర్మ తెలిపారు. ముగ్గురిని స్థానిక కోర్టులో హాజరుపరచగా, 14రోజుల రిమాండ్ విధించింది. మరోవైపు దులార్‌చంద్ యాదవ్ హత్యకు తనకు ఎలాంటి సంబంధం లేదని జెడియు అభ్యర్థి అనంత్ సింగ్ తెలిపారు. ఆర్‌జెడి అభ్యర్థి వీణా దేవి భర్త, మాజీ ఎంపీ సూరజ్ భాన్ సింగ్‌పై తనకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా జన సూరాజ్ పార్టీ మద్దతుదారుడు హత్యపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.

## సరిహద్దుల్లో త్రిశూల్ విన్యాసాలు

### పోటీగా పాక్ సైనిక కసరత్తులు

**న్యూఢిల్లీ, నవంబరు 2:** భారత సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత్ త్రివిధ దళాలతో కలిసి నిర్వహిస్తున్న త్రిశూల్ సైనిక విన్యాసాలకు పోటీగా పాకిస్థాన్ కూడా అదే ప్రాంతంలో ఫైరింగ్ ఎక్సర్‌సైజ్ కోసం నావికాదళ హెచ్చరిక జారీ చేసింది. సర్ క్రీక్ సమీపంలో భారత్ ఎంచుకున్న సముద్ర ప్రాంతంలోనే పాక్ ఈ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలను ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ విశ్లేషకుడు డామియన్ సైమన్ మొదట వెలుగులోకి తెచ్చారు. భారత్ అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని సర్ క్రీక్ ప్రాంతంలో త్రిశూల్ పేరుతో భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగిన అతిపెద్ద సైనిక ఆపరేషన్లలో ఇది ఒకటని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. త్రివిధ దళాల సమష్టి సామర్థ్యాలు, ఆత్మనిర్భరత, సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించడమే ఈ విన్యాసాల లక్ష్యమని తెలిపింది. ఇందుకోసం 28వేల అడుగుల ఎత్తు వరకు గగనతలాన్ని రిజర్వ్ చేసినట్లు ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయి. సౌరాష్ట్ర తీరంలో ఉభయచర ఆపరేషన్లు, క్రీక్, ఎడారి ప్రాంతాల్లో సైనిక విన్యాసాలు దీనిలో భాగంగా ఉన్నాయి. దీనికి కౌంటర్‌గా పాకిస్థాన్ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. గతనెల 28,29 తేదీల్లో తన గగనతలంలో కొన్ని మార్గాలను మూసివేస్తూ పాకిస్థాన్ నోటీస్ టు ఎయిర్‌మెన్ (నోటమ్) జారీ చేసింది. తాజాగా భారత విన్యాసాలు జరుగుతున్న ప్రాంతంలోనే ఫైరింగ్ కోసం నావికాదళ హెచ్చరికలు జారీ చేసింది. భారత్ సరిహద్దు విన్యాసాలను తాము నిశితంగా గమనిస్తున్నామనే సంకేతాలను పాక్ పంపుతున్నట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఇలాంటి పోటీ విన్యా సాలు, హెచ్చరికలు సాధారణమైపోయాయి. ఇవి ప్రత్యక్ష ఘర్షణకు దారితీయకపోయినా, పరస్పరం తమ సన్నద్ధతను ప్రదర్శించుకునే వ్యూహాత్మక సంకేతాలని రక్షణరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## టారిఫ్ టెర్రరిజం అమలు చేస్తున్న డొనాల్డ్‌ట్రంప్


### పతంజలి సహ వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్



**న్యూఢిల్లీ, నవంబరు 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరి స్తున్న ఆర్థిక విధానాలు ట్యారిఫ్ టెర్రరిజం కిందకు వస్తాయని పతం జలి సహ వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్ తీవ్రం గా విమర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ పరిస్థితుల్లో దానిని ఆర్థిక యుద్ధంగా పేర్కొన్నారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలన్న విధానం ఆర్థిక యుద్ధానికి సరైన సమాధానం అవుతుందా అన్న మీడియా ప్రశ్నపై రామ్‌దేవ్ స్పందించారు. ట్రంప్ అనుసరించే సామ్రాజ్యవాద, విస్తారవాద పోకడలతో పోలిస్తే స్వదేశీ ఉద్యమం మెరుగైందని చెప్పారు. సమష్టిగా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అది అవసరమైనదని తెలిపారు.

## పుష్కర్‌ప్రదర్శనలో రూ.21కోట్ల విలువైన గేదె అనారోగ్యంతో మృతి

**జైపూర్,నవంబరు2:** పశుప్రదర్శనలో ఆకట్టుకున్న రూ.21 కోట్ల విలువైన గేదె ఆరోగ్యం క్షీణించింది. దానిని కాపాడేందుకు పశువైద్యులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పుష్కర్‌లో ప్రతి ఏటా నిర్వహించే పశు మేళా గతనెల 30న గొప్పగా ప్రారంభమైంది. రూ.21 కోట్ల విలువైన భారీ గేదెతో పాటు ఇతర జంతువులు ఎంతో ఆకట్టుకున్నాయి. కాగా, అక్టోబరు 31న పుష్కర్ పశు ప్రదర్శనలో ఉంచిన రూ.21 కోట్ల విలువైన భారీ గేదె ఆరోగ్యం క్షీణించింది. దీంతో పశువైద్యులు



వెంటనే అక్కడకు చేరుకుని, చికిత్స అందించి కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే దాని భారీ శరీర బరువు, ఆరోగ్యం వేగంగా క్షీణించడంతో ఫలితం లేకపోయింది. ఆ భారీ గేదె మరణించింది.



## ప్రధాని చేసేది 'షో'మాత్రమే..

### ఎన్నికల తర్వాత ఇటు కన్నెత్తి చూడరు..

### బీహార్ ఎన్నికల సభలో రాహుల్‌గాంధీ

#### చెరువులో దిగి యువకులతో కలిసి చేపలు పట్టిన కాంగ్రెస్ నేత

**బెగుసరాయ్, నవంబరు 2:** ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంతా షో చేస్తారు, ఆ తర్వాత అటు వైపు కన్నెత్తి కూడా చూడరని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. ఆదివారం బెగుసరాయ్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ ఓట్ల కోసం ప్రధాని మోడీ ఏం చేయడానికైనా వెనకాడబోరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోడీ బీహార్‌కు వచ్చి అనేక ప్రసంగాలు, వాగ్దానాలు చేస్తారని, ఎన్నికల తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరని అన్నారు. భారరత్ - పాకిస్థాన్ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ ఆయనను నిలదీసి ప్రశ్నించే ధైర్యం మోడీకి లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న నోట్లరద్దు, జీఎస్టీ సంస్కరణలు వంటి నిర్ణయాలన్నీ దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూర్చేవేనన్నారు. కానీ తాము అధికారంలోకి వస్తే చిన్న వ్యాపారాలను బలోపేతం చేస్తామని, కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని అన్నివర్గాలకు ఉపయోగకరంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బీహార్‌లో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగం గురించి ప్రశ్నలు లేవనెత్తకుండా యువత దృష్టిని మళ్లించడానికి వారిని రీల్స్ చూడాలని మోడీ కోరుతున్నారని రాహుల్ ఆరోపించారు. బీహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఇండియా కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో రైతులు, కార్మికులు, దళితులు, బలహీనవర్గాలకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ప్రజలకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాహుల్ గాంధీ మత్స్యకారులతో సమావేశమై వారి సమస్యల గురించి ఆరా తీశారు. స్వయంగా నీటిలోకి దిగి, వారితో కలిసి చేపల వల లాగి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకారులతో పూర్తిగా మమేకమై వారి జీవన విధానం, ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. బీహార్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నదులు, కాలువలు, చెరువులు, వాటిపై ఆధారపడిన మత్స్యకారులు ఒక ముఖ్యమైన భాగమని ఆయన అభిప్రాయపడ్డారు. వారిహక్కులు, గౌరవం కోసం తాను ప్రతి అడుగులోనూ అండగా నిలుస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

## స్కూలు నాలుగో అంతస్తునుంచి దూకి చనిపోయిన విద్యార్థిని

**జైపూర్, నవంబరు 2:** రాజస్థాన్‌లోని జైపూర్‌లో విషాదం చోటుచేసుకున్నది. జైపూర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల నాలుగో అంతస్తు పైనుంచి దూకి చనిపోయింది. 9 ఏండ్ల బాలిక నాలుగో అంతస్తు గ్రిల్ ఎక్కి దూకినట్లు అక్కడ ఉన్న కెమెరాలో రికార్డు అయింది. అయితే కింద మాత్రం ఎలాంటి రక్తపు మరకలు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జైపూర్‌లోని నీరజా మోదీ స్కూల్‌లో 9 ఏండ్ల బాలిక 4 వ తరగతి చదువుతున్నది. శనివారం మధ్యాహ్నాం ఆ బాలిక స్కూలు బిల్డింగ్ 4వ అంతస్తు పైనుంచి దూకింది.

దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను పాఠశాల సిబ్బంది సమీపంలోని దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు.

## సంక్షిప్తంగా..

### మెక్సికోలోని సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు: 23 మంది మృతి

**మెక్సికో సిటీ, నవంబరు 2:** మెక్సికోలోని ఓ సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు. శనివారం హెర్మోసిల్లోలోని వాల్డో సూపర్ మార్కెట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర గవర్నర్ అల్ఫోన్సో దురాజో ఈ పేలుడు ఘటనను ధ్రువీకరించారు. పేలుడు సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పేలుడుకు గల స్పష్టమైన కారణం ఇంకా తెలియరాలేదు. ప్రమాద ఘటనపై అల్ఫోన్సో ఓ విడియోలో మాట్లాడారు. ఇది



చాలా బాధాకరమైన ఘటన అని ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తాము అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ ఎక్స్‌ద్వారా దీనిపై స్పందించారు. ఈ ప్రమాద ఘటన తనను కలిచివేసిందన్నారు.

### అమెరికాకు తొలిసారి సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా



**వాషింగ్టన్, నవంబరు 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్-సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా మధ్య భేటీ ముహూర్తం ఖరారైంది. ఈ నెల 10న డొనాల్డ్ ట్రంప్‌ను సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అల్ షరా వాషింగ్టన్‌లో కలవనున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. సిరియా అధ్యక్షుడు అధికారికంగా అమెరికా రాజధాని వాషింగ్టన్‌కు రావడం ఇదే తొలిసారి. అంతకుముందు ఎప్పుడూ సిరియా అధ్యక్షుడికి అమెరికా నుంచి అధికారిక ఆహ్వానం అందలేదు. దీనికి కారణం వారి మధ్య ఉన్న శత్రుత్వమే. ఇరుదేశాల మధ్య గతంలో అగ్గిపుల్ల వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. అయితే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత పలు దేశాల మధ్య శాంతి ఒప్పందాలు చేస్తూ వార్తల్లో నిలిస్తున్నారు. దీనిలో భాగంగానే తమ శత్రు దేశమైన సిరియాకు ఆహ్వానం పంపినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి కాలుష్యం: ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ, నవంబరు 2:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. కొన్ని రోజులుగా అనేక ప్రాంతాల్లో వాయు నాణ్యత పడిపోతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, ఢిల్లీ సిఎం రేఖాగుప్తాను ట్యాగ్ చేస్తూ పోస్టు పెట్టారు. బీహార్‌లో ఎన్నికల ప్రచారం తర్వాత ఢిల్లీకి తిరిగి వచ్చిన ప్రియాంక దేశ రాజధానిలో కాలుష్య పరిస్థితి చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నాయకులందరూ కలిసి దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ భయంకర పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకునే ఏ చర్యలకైనా మద్దతు ఇవ్వాలని రాజకీయ నేతలను కోరారు. ప్రతియేటా ఢిల్లీ పౌరులపై ఈ విషవాయువులు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని పేర్కొన్నారు.

### రూ.11కోట్ల లాటరీ వచ్చినా పత్తాలేని విజేత

**అమృత్‌సర్, నవంబరు 2:** పంజాబ్‌లో దీపావళి బంపర్ లాటరీ వరించినా తీసుకునేందుకు విజేత పత్తాలేకుండా పోవడం అంతుబట్టకుండా ఉంది. ఏకంగా రూ.11కోట్ల జాక్‌పాట్ తగలడంతో ఆ వ్యక్తి రాత్రికి రాత్రే కోటీశ్వరుడు అయ్యాడు. అయితే, ఆ విజేత ఎవరనేది మాత్రం ఇంకా రహస్యంగానే ఉంది. పంజాబ్ ప్రభుత్వం లాటరీ ఫలితాలు ప్రకటించినా, విజేత ఇంకా బయటకు రాకపోవడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. భఠిండాలోని రతన్ లాటరీ కేంద్రంలో ఈ టికెట్‌ను విక్రయించారు. ఈ సందర్భంగా లాటరీ కేంద్రం నిర్వాహకుడు ఉమేశ్ మాట్లాడుతూ తన వద్ద టికెట్లు కొనేవారిలో దాదాపు 40 శాతం మంది




తమ వివరాలు వెల్లడించరని, ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకుంటారని తెలిపారు. తాను గత 35నుంచి 40 ఏళ్లుగా లాటరీలు అమ్ముతున్నానని, తన దుకాణంలో టికెట్లు కొని 40 మందికి పైగా కోటీశ్వరులయ్యారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

3-11pg6exHMNWJQE 10_3-11pg6exHMNWJQE.qxd 02/Nov/25 10:56 PM Page 1





# శివయ్య సేవకు భక్తజనం

## 25వేల మంది దర్శనం... ఆన్‌లైన్‌లోనే అభిషేక సేవా టిక్కెట్లు

శ్రీకాళహస్తి, నవంబరు 2 ప్రభాతవార్త: దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఆదివారం ఆలయం భక్తులతో కిటకిట లాడింది. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దాంతో రోజురోజుకీ రద్దీ పెరుగుతోంది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు ఆదివారం 25వేల మంది దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. అయితే ఇక్కడి ఆలయంలో అభిషేకాల టిక్కెట్లు ఆన్‌లైన్‌లోనే అంటూ అధికారులు చేతులు దులుపుకున్నారు. దాంతో కార్తీక మాసం ఇక్కడ అభిషేక ప్రియునికి అభిషేకాలకు అవకాశం లేకుండా ఇబ్బంది పడుతున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్ లైన్‌లో అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. సుమారు పాతివేలకు పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆదివారం ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 5871 మంది కాగా రాహుకేతుదోష నివారణ పూజలు నాలుగు వేల ఐదు వందల మంది జరిపించుకున్నారు.

### సన్నిధి వీధి బిజీబిజీ

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు సన్నిధివీధి నుంచి వస్తున్నారు. ఆలయ పురాణం మేరకు శ్రీకాళహస్తి అప్రదక్షిణ దివ్య క్షేత్రం. ఈ ఆలయంలోనికి బిక్షాల గోపురం నుంచి ప్రవేశించాలి. అయితే గతంలో పరిపాలనా సౌలభ్యం కోసం పరిపాలనా భవనాలను, అతిథి గృహాలను దక్షిణ గోపురం పక్కన నిర్మించారు. దాంతో టూరిస్టు బస్సులు, కార్లులో వచ్చే భక్తులు సన్నిధివీధి నుంచి నాల్గవ గేటు ద్వారా ప్రవేశిస్తున్నారు. అక్కడే అతిథి గృహాలు, సెంట్రల్ రిసెప్షన్ ఉండటంతో ఈ ప్రాంతాలు ప్రసిద్ధి చెందాయి. అయితే ఇక్కడి ఆచార వ్యవహారాలకు తిలోదకాలివ్వబడ్డాయి. ఈ అంశాన్ని పాలకులు కానీ, అధికారుల, అర్చకులు పట్టించుకోవటం లేదంటే అతిశయోక్తి కాదేమో! సన్నిధివీధిలో నుంచి తిరుపతి వైపు నుంచి బస్సుల్లో వచ్చే యాత్రికులు రావటానికి బస్సులను పాత జయరామారావు పార్కు వద్ద పార్కింగ్ చేసి దిగువ సన్నిధివీధి నుంచి ఆలయానికి వెళ్ళాలని సూచిస్తారు. ఆటోల డ్రైవర్లు కూడా ఇక్కడే తిష్ట వేసి ఉంటారు. దాంతో గతంలో జనంతో రద్దీగా ఉంటే తేరువీధిలోని హోటళ్ళు, లాడ్జిలు వెలవెల బోతున్నాయి.

# సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వంగా అందించాలి

## సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలి

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు



కడప, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం సిపి బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. ముందుగా సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర గ్రంథాలయ భవనంలోని జనుమద్ది సాహితీ పీఠం, గ్రంథాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి గ్రంథ పరిమళాన్ని ఆస్వాదించారు. అనంతరం స్వర్గీయ డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రికి నివాళి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలోని అరుదైన పుస్తకాలను చూడడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. 50 వేలకు పైగా పుస్తకాలతో పాటు, 200 తాళపత్ర గ్రంథాలను సేకరించి, శుద్ధి చేసి, స్కాన్ చేసి భద్రపరచిన నిర్వహణా బృందం చొరవను అభినందించారు. అనంతరం జనుమద్ది హనుమచ్ఛాస్త్రి "బ్రౌన్ శాస్త్రి" శత జయంత్యుత్సవం (1925-2025) సందర్భంగా 14వ సాహిత్య మరియు గ్రంథాసల్య సేవా పురస్కారాల ప్రదానోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా విశిష్ట అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డా. జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అతుధులుగా వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... ప్రతి ఊరికి ఒక దేవాలయం, విద్యాలయం, సేవలయం, గ్రంథాలయం నెలకొల్పేలా.. సమాజంలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాతృ భాషలో పత్యంశాలు, పరిపాలన ఉత్తర్వులు, ప్రత్యుత్తరాలు సాగాలి, న్యాయమూర్తులు కూడా తమ వాదనలను తెలుగులోనే వాదించాలన్నారు. ఇతర భాషలను గౌరవించాలి కానీ.. ఇతర భాషా దురభిమానం పనికిరాదని సూచిస్తూ మాతృభాషను మరువ రాదు, సమాజంలో రోజువారీ దిన చర్యలో భాగంగా ప్రతి సూచికాలను మాతృ బాషనే అమలు చేయాలన్నారు. అనంతరం తెలుగు జాతికి విశిష్ట సేవలను అందిస్తున్న సిపి బ్రౌన్ భాష పరిశోధన కేంద్ర గ్రంథాలయ అభివృద్ధిని కోరుతూ స్వర్ణ భారతీ ట్రస్ట్ నుండి రూ.5 లక్షల విరాళంను అందించారు. అనంతరం బ్రౌన్ శాస్త్రిగా సుపరిచితులైన పెద్దలు శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు గుమ్మడి గోపాల కృష్ణకి, అవధాన ప్రముఖులు మేడసాని మోహన్‌కి, లక్షలాది గ్రంథాల సంరక్షకులు మరె అంకే గౌడకి, ప్రముఖ సాహితీవేత్త శ్రీ రేవూరు అనంతపద్మనాభ రావుకి పురస్కారాలు అందజేశారు. 2025 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన కడప బలవికాస్ పాఠశాల విద్యార్థులు.. గౌసియా, నీనా సహన, ప్రదీప్ కుమార్, గీతికా, రిహానా హుస్నా, గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో సాధించిన చిత్రకారుడు ఆనందరాజ్‌కి పురస్కారాలను పంపిణీ చేశారు. రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకొని ఆదివారం మధ్యాహ్నం కడప విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కడప ఆర్‌డిఓ జాన్ ఎర్విన్, బిజెపి నాయకులు వీడ్కోలు పలికారు.

# కోనలో వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



రాపూరు (నెల్లూరు), నవంబరు 2 ప్రభాత వార్త: ప్రముఖ పుణ్యక్షేత్ర మైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి ఆదివారం పవిత్ర కార్తీక మాసంలో వచ్చిన క్షీరాబ్ధి ద్వాదశి (కైశిక), చిలుక ద్వాదశి సందర్భంగా స్వామి వారికి అష్టోత్తర (108), కళశాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి నందనవనం (ఉద్యానవనం) లో స్వామి వారికి 108 కళశాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. తదుపరి సాలగ్రామ పూజలు, ధాత్రి(ఉసిరి) చెట్టుకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు కార్తీక వన భోజనాలు స్వామి వారి ఉద్యాన వనంలో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని బంగారు గరుడ వాహనంపై వుంచి ఆస్థాన సేవ నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, కార్తీక వన భోజనాలు చేశారు. భక్తులకు భోజన, వసతి ఏర్పాట్లు క్యూలైన్ల పర్యవేక్షణను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# అందరి కళ్లు నీలకంఠాపురం పైనే




- నేడు ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ ప్రారంభోత్సవం
- రెండు ఎకరాల స్థలం దానం చేసిన రఘువీరారెడ్డి
- నిర్వహణ బాధ్యత ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ దే

అనంతపురం, నవంబరు 2 ప్రభాత వార్త బ్యూరో: సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీమంత్రి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి స్వగ్రామమైన నీలకంఠా పురంలో సోమవారం ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ ప్రారంభోత్స వానికి సర్వం సిద్ధమైంది. హాస్పిటల్ నిర్మాణా నికి మాజీ మంత్రి రఘువీరా రెడ్డి రెండు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వడంతో పాటు హాస్పిటల్‌కు అవసరమైన అధునాతన పరికరాలను కూడా సమకూర్చడం విశేషం. నీలకంఠాపురం శాంతా జయరాం నేత్రాలయం పేరుతో నిర్మించిన హాస్పిటల్‌ను హైదరాబాదులో ఎంతో గుర్తింపు ఉన్న ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ యజమాన్యం పర్యవేక్షణలో నిర్వహిస్తుండడం మరో విశేషం. నవంబర్ 3వ తేదీన ప్రారంభమయ్యే ఈ హాస్పిటల్లో పెద్దపెద్ద నగరాల్లో ఏ విధంగా అధునాతన యంత్రాలు, సౌకర్యాలు సమకూర్చారో అదేవిధంగా నీలకంఠాపురం ఆసుపత్రిలో సమకూర్చినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ హాస్పిటల్‌లో డిసెంబరు నుంచి కంటికి సంబంధించి అన్ని ఆపరేషన్లు ప్రారంభమవుతాయని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో అందరి కళ్ళు నీలకంఠా పురం ఆస్పత్రి ప్రారంభ వేడుకలపైనే ఉన్నాయి. మడకశిర ప్రాంతములో పేద ప్రజలు ఎక్కువగా ఉండడంతో ఈ ఆస్పత్రి వారికి ఎంతో ఉపయోగ పడుతుంది. మడకశిర, పెనుగొండ హిందూపురం నియోజకవర్గం వారితో పాటు కర్ణాటక రాష్ట్రంలో మడకశిర చుట్టూ ఉన్న తుంకూర్ జిల్లా వాసులకు, మధుగిరి, చింతామణి తదితర ప్రాంతాల్లోని పేద మద్దతు వర్గాలకు ఈ ఐ హాస్పిటల్లో ఎంతో ఉపయోగపడే అవకాశం కనిపిస్తుంది.

కంటి చూపుతో సతమతమవుతున్న పేదవారికి ఉచితంగా, స్థోమత ఉన్నవారికి డబ్బు రూపంలో ఇద్దరికీ సమాంతరంగా వైద్య చికిత్సలు అందించి కంటి చూపు సమస్య తొలగించేందుకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి చేసిన భగీరథ ప్రయత్నమే ఇది. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఎల్వి ప్రసాద్ సంస్థ ఆధ్వర్యంలో 24 కేంద్రాలు ఏర్పడ్డాయి. మాజీ మంత్రి రఘువీరారెడ్డి వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో నీలకంఠాపురంలో 25వ కేంద్రముగా ఏర్పాటు కానుంది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# నార్వేలో భారత్ ఎంపీల బృందం

## లింగ సమానత్వంపై నాలెడ్జ్ ఎక్చేంజ్ ప్రోగ్రాం

## ఇఎఫ్‌టిఏ దేశాలతో వాణిజ్యం పెరుగుదలకు దోహదం



ఏలూరు/ ఢిల్లీ/ ఓస్లో, నవంబరు 2: భారత ఎంపీల బృందం వారం రోజుల అధికారిక పర్యటన కోసం నార్వే రాజధాని ఓస్లో చేరుకున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఓస్లో గార్డెర్మోన్ విమానాశ్రయంకు చేరుకున్న భారత ఎంపీల బృందానికి నార్వే ప్రభుత్వ ప్రతినిధులు, ఎంబసీ అధికారులు స్వాగతం పలికారు. లింగ సమానత్వం, మహిళా సాధికారతపై ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నార్వే ప్రభుత్వ సహకారంతో, ఆ దేశ రాజధాని ఓస్లో, ట్రోంసో నగరాల్లో నవంబర్ 2నుంచి 8వరకూ జరగబోయే సదస్సులు, నార్వే ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు ఎంపీలు హాజరవుతున్నారు. ఈ పర్యటన కోసం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఏడుగురు ఎంపీల బృందాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. "నాలెడ్జ్ ఎక్చేంజ్" ప్రోగ్రాంలో భాగంగా జరిగే ఈ పర్యటనలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా భారత ప్రతినిధి బృందం వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననుంది. ప్రపంచంలోనే లింగ సమానత్వం ఎక్కువగా ఉన్న దేశాల్లో నార్వే ఒకటి అనేది తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా నార్వే పార్లమెంట్‌తో పాటు, వివిధ ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం అయ్యే భారత ఎంపీల బృందం ఆ దేశంలో లింగ సమానత్వం, మహిళ సాధికారత అమలవుతున్న తీరును పరిశీలించనుంది. వీటితో పాటు ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు సంబంధించి కూడా చర్చలు జరగనున్నాయి.

# కల్తీ లిక్కర్‌తో జోగి రమేశ్ ప్రజాధనం దోచేశారు

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్



అమరావతి, నవంబరు 2 ప్రభాతవార్త: వైసీపీ పాలనలో అవినీతి పరాకాష్టకు చేరిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తాజాగా కల్తీ లిక్కర్ స్కాం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్ట్ కావడం, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నెలకొన్న అవినీతి వ్యవస్థకు స్పష్టమైన ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. నరహరి వరప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రజల జీవితాలను తాకట్టు పెట్టి వారి ఆరోగ్యంతో చెలాగాటమాదిందని ఆరోపించారు. "లిక్కర్ వ్యాపారాన్ని ప్రభుత్వ ఆదాయ వనరుగా చూపిస్తూ, దాన్ని పార్టీకే దోపిడీ సాధనంగా మార్చేశారని ఆరోపించారు. లిక్కర్ టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయి. వైసీపీ నేతలు కల్తీ మద్యం లాభాలను దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం అనే విధానంలో వ్యవహరించారు" అని మండిపడ్డారు. "మద్య విధానాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకో వడం సిగ్గుచేటు. జోగి రమేశ్ అరెస్టు కేవలం మొదటి అడుగు మాత్రమే. ఈ అవినీతి గొలుసులో ఇంకా అనేక మంది బయటకు రావాల్సి ఉంది. జగన్‌మోహన్ రెడ్డి ప్రైవేట్ బినామీ సంస్థల ద్వారా విషపూరిత స్పిరిట్లతో తయారు చేసిన కల్తీ లిక్కర్‌ను అధిక ధరలకు విక్రయించి వేల కోట్లు దండుకున్నాడు. ఈ లావాదేవీల వెనుక ఉన్న వారందరినీ చట్టం తప్పక శిక్షిస్తుందని" హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో అవినీతిని నిర్మూలిస్తూ, అభి వృద్ధి- సంక్షేమ మార్గంలో రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తుందని అభిప్రాయపడ్డారు. "పొలంలో కలుపు మొక్కలను తీసివేసినట్టు, రాష్ట్ర అభివృద్ధికి ఆటంకమవుతున్న అవినీతి దుష్టులను తరిమికొట్టాలి. అప్పుడు ఆంధ్రప్రదేశ్ నిజమైన ప్రగతి

# వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జోగి రమేష్ అరెస్టు

## వైఎస్సార్‌సీపీ నేతలపట్ల చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

## ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



ఉరవకొండ, నవంబరు 2 ప్రభాతవార్త: తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ శనివారం రోజు కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో భక్తుల మరణంను నుంచి ప్రజల దృష్టికి మరల్చుడానికి గాను డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం ఆదివారం తెల్లవారుజామున మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఉన్నఫలంగా అరెస్టు చేసిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. జోగి రమేష్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఆదివారం విలేఖరుల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పట్ల పూర్తిగా కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కల్తీ మద్యం తయారీలో ఈ ప్రభుత్వానికి చాలా చెడ్డపేరు వచ్చిందని తెలుగుదేశం పార్టీకు చెందిన వారు కల్తీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన మద్యం ఆదాయాన్ని దోచుకున్నారన్నారు. దీని నుంచి బయటపడటానికి దొంగే దొంగ దొంగ అన్నట్టు జోగి రమేష్ పేరును చెప్పించి అరెస్టు చేయడం ద్వారా కల్తీ మద్యం మరకను వైఎస్సార్‌సీపీకు కూడా అంటగట్టాలని కుట్ర చేసిందన్నారు. బాబు అధికారంలోకి వచ్చినప్పటి నుండి కక్ష, కుట్రలు అధికమయ్యాయని, అయితే జయ చంద్రారెడ్డిను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదన్నారు. పైగా జనార్ధన్‌రావుపై ఒత్తిడి చేయించి తప్పుడు స్టేట్‌మెంట్ తీసుకొని జోగి రమేష్‌ను ఇరికించారన్నారు. తనకు కల్తీ మద్యం తయారీకు ఎలాంటి సంబంధంలేదని తాను ఎలాంటి పరీక్షకైనా సిద్ధమని, దుర్గ గుడిలో ప్రమాణంకు సిద్ధమని జోగి రమేష్ ఇదివరకే చెప్పారన్నారు. అయితే ప్రభుత్వం నిసిగ్గుగా, దుర్మార్గంగా వ్యవహరించి అరెస్టు చేసిందని వాపోయారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాకోర్టులో శిక్ష అనుభవించక తప్పదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సి.పి.వీరన్న, ఈడిగ ప్రసాద్, మూలగిరి పల్లి ఓబన్న, కార్యదర్శి ఆమిద్యాల రాజేష్, మల్లికార్జున పాల్గొన్నారు.



# మైపాడు బీచ్‌లో ముగ్గురు మృతి

ఇందుకూరుపేట (నెల్లూరు), నవంబరు 2 ప్రభాతవార్త: ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌లో ఆదివారం ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. సెలవు దినం కావడంతో సరదాగా గడిపేందుకు బీచ్‌కు చేరుకుని మధ్యాహ్నం 1.30గంటలకు సముద్రంలో సేద తీరుతుండగా అలల దాటికి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. మెరైన్ పోలీసులు గాలించి ముగ్గురు యువకుల మృతదేహాలను వెలికి తీశారు. నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటకు చెందిన పఠాన్ మహమ్మద్ తాజీమ్(17), నెల్లూరు నగరం కోటమిట్టకు చెందిన ఇద్దరు యువకులు పఠాన్ హుమాయున్(17), సమీద్(17) ముగ్గురు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం నారాయణ కళాశాలలో చదువుతున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బిడ్డల మృతదేహాలను చూసుకొని తల్లడిల్లిపోయారు. సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో రాపిడో బైక్‌డ్రైవర్ అమానుషం

## ఓ మహిళపై అసభ్యప్రవర్తన... బైండోవర్ కేసు

తిరుపతి, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో భద్రత ఉంటుందనే నమ్మకంతో రాపిడో బుక్ చేసుకున్న ఓ మహిళ పట్ల ఆ ద్విచక్ర వాహన డ్రైవర్ అమానుషంగా ప్రవర్తించి భయం గొలిపించాడు. ఆ మహిళ ఊహించని విధంగా ఒక్కసారిగా కామంధుడుగా ఆ డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేకలు వేసింది. అర్ధరాత్రి సమయంలో కుటుంబసభ్యులు, స్థానికులు గుమికూడి రాపిడో వాహన డ్రైవర్ బారినుండి కాపాడారు. తిరుపతి అలిపిరి పోలీసులకు కామాంధుడ్ని అప్పగించారు. అలిపిరి సిఐ పివి రామకిశోర్ వివరాల మేరకు... తిరుపతి అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేణిగుంట రోడ్డు ఆర్‌ఆర్‌కాలనీలో నివాసముంటున్న ఓ మహిళ బ్యూటీపార్లర్ నుండి ఇంటికెళ్ళేందుకు శనివారం అర్ధరాత్రి రాపిడోలో బైక్‌సర్వీస్ ద్విచక్రవాహనాన్ని బుక్‌చేసింది. కాల్ అందుకున్న ఓ ద్విచక్ర వాహనదారుడు పెద్దయ్య అక్కడకు చేరుకున్నాడు. మహిళను తన ద్విచక్రవాహనంపై కూర్చోబెట్టుకుని ఆమెను ఇంటివద్దకు చేర్చాడు. ఆమె దిగుతున్న సమయంలో ఆమెపట్ల అసభ్యకరంగా ప్రవర్తించి బలవంతంగా ఆమె జట్టుపట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతనిని పట్టుకున్నారు. ఆ సమయంలో రాత్రి గస్తీలో ఉన్న అలిపిరి సిఐ రామకిశోర్ పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మహిళ మర్యాదకు భంగం కలిగించిన అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి, తహాశీల్దార్ ఎదుట హాజరుపరిచారు. అతనిపై ఏడాదిపాటు బైండోవర్ కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. మహిళలు ఏదేని అత్యవసర సమయంలో సమీప పోలీసులకు గానీ, 112కు ఫోన్‌చేసి సాయం అందుకోవాలని సిఐ తెలిపారు. భద్రత కల్పించాల్సిన ఇలాంటి సంస్థలు వారి సిబ్బంది ప్రవర్తనపై నిఘా ఉంచాలని, వాహనాలకు జిపిఎస్ అమర్చాలని చెబుతున్నారు.



# సాహితీ వైద్యుడు రమణ యశస్వి

## - అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

విజయవాడ, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి: వైద్యమూ ఇటు సాహిత్యమూ రెండింటినీ కుంటుపడకుండా నడిపిస్తున్న సాహితీ వైద్యుడు రమణ యశస్వి అని వక్తలు ప్రశంసించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అరండల్ పేట ఎస్.హెచ్.వో హాలులో జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డా. రమణ యశస్వి ఆత్మీయ సత్కారం మరియు జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు 2025 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైద్యం కార్పొరేట్ చేతిలోకెళ్ళి పేదవాడికి అందక ఇబ్బందులు పడుతున్న సమయంలో జి.జి.హెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి రావడం మంచి పరిణామమన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ సభాధ్యక్షత వహించిన ఈ సభలో రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు, అబాబీలు రూపశిల్పి, సుప్రసిద్ధ సాహితీవేత్త షేక్ కరీముల్లా, కాలమిస్ట్ యేమినేని వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు పోస్టర్‌ను పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. సత్కార గ్రహీత డా. రమణయశస్వి స్పందన తెలియజేస్తూ సంవత్సర కాలంగా వృత్తిలో ఎంతో ఒత్తిడికి గురవుతున్న తనకు ఈ ఆత్మీయ సత్కారం ఒక గొప్ప ఊరటనిచ్చిందన్నారు.

# జాతీయ పట్టణ సదస్సుకు జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్



జగ్గయ్యపేట, నవంబరు 2 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపునిస్తూ ఈనెల 8, 9 తేదీల్లో న్యూఢిల్లీలో జరుగనున్న జాతీయ పట్టణ సదస్సుకు వక్తగా ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణ ప్రణాళిక వ్యవహారాల మంత్రిత్వశాఖ గ్రాంట్ల వినియోగంపై నేషనల్ అర్బన్ కాన్క్లేవ్-2025 సదస్సు న్యూఢిల్లీలోని యశ్భూమి, ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ ద్వారకాలో సూటబుల్ అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెన్స్ అనే ప్రధాన అంశంపై సదస్సు జరుగనుంది. దేశ వ్యాప్తంగాగల మేయర్లు, ఛైర్మన్లు, ఉన్నతాధికారుల మధ్య చర్చలు, సమీక్షలు నిర్వహించనున్న ఈ కాన్క్లేవ్‌లో విశాఖపట్నం, గుంటూరు మేయర్లతోపాటు ఆంధ్ర రాష్ట్రం నుండి ఏకైక మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర ఒక స్పీకర్‌గా పాల్గొననుండటం విశేషం. గతంలో తిరుపతిలో జరిగిన 16వ ఫైనాన్స్ కాన్ఫరెన్స్, హర్యానాలో జరిగిన నేషనల్ అర్బన్‌బాడీస్ కాన్ఫరెన్స్‌లలో కూడా రాఘవేంద్ర పాల్గొని తన అభిప్రాయాలను పంచుకుని ఉన్నతాధికారుల అభిమానాన్ని చూరగొన్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని మున్సిపాల్టీల నుండి ఏకైక ఛైర్‌పర్సన్‌గా రాఘవేంద్రకు మాత్రమే ఈ న్యూఢిల్లీ సదస్సులో వక్తగా పాల్గొనేందుకు నేషనల్ అర్బన్ కాన్క్లేవ్-2025 సదస్సు నిర్వాహకులు అవకాశం కల్పించారు. ఈసందర్భంగా ఛైర్మన్ రాఘవేంద్ర మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ అవకాశం రావటం సంతోషం కలిగించిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్ల వినియోగంపై తాను సదస్సులో పలు సూచనలను ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది, పట్టణ ప్రజల సహకారం, విశ్వాసం కారణంగానే తనకు ప్రత్యేక అవకాశాలు, గుర్తింపు లభించినట్లు కృతజ్ఞతలు తెలిపారు.

3-11P□g7exHMNWJQE 11_3-11P□g7exHMNWJQE.qxd 02/Nov/25 11:51 PM Page 1



# కడప- రేణిగుంట ఎన్‌హెచ్ నిర్మాణంలో తీవ్ర జాప్యం

- ప్రజలపై వందల కోట్ల అదనపు భారం
- ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చినా... వన్యప్రాణుల విభాగం అనుమతి పెండింగ్
- రూ.2,200 కోట్ల ప్రాజెక్టుకు మోక్షం ఎప్పుడు?



ప్రస్తుత కడప రేణిగుంట జాతీయ రహదారి దారుణ పరిస్థితి

రాజంపేట, నవంబరు 2 ప్రభాతవార్త: జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ చరిత్రలోనే ఆలస్యమైన ప్రాజెక్టుగా ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల పరిధిలో మంజూరైన కడప- రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిలిచిపోనుంది. ఎందుకంటే ప్రాజెక్టు టెండర్లు పూర్తయి మూడేళ్లు కావస్తున్న ఇంతవరకు అతీగతి లేదు. పర్యావరణ అనుమతులు లభించి ఏడాది దాటింది. అయితే కీలకమైన సెన్సిటివ్ జోన్‌గా వన్యప్రాణుల విభాగం నుంచి క్లియరెన్స్ ఇంకా లభించకపోవడంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. ఫలితంగా ఈ రహదారి నిర్మాణంపై అదనంగా వందల కోట్ల భారం పడనుంది.
కడప- రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే 2023 24 ఆర్థిక సంవత్సరంలో మంజూరు అయింది. రూ.2200 కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు చేపట్టారు. ప్రాజెక్టులు రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఇదే ఏడాది ఈ ప్రాజెక్టుకు జులై 8న 1ప్యాకేజీని కడప బైపాస్ రోడ్డు నుంచి చిన్నపురంపాడు వరకు 64.2కి.మీ దూరం నిర్మించేందుకు రూ.1200 కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచారు. 2 ప్యాకేజీని ఆగస్టు 1న చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు వెయ్యి కోట్ల అంచనా వ్యయంతో 57.7 కిలోమీటర్లు దూరం నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టులు పూర్తి చేసి 2024లో జాతికి అంకితం చేయాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా చెయ్యేరు నదిపై భారీ వంతెనను నిర్మించనున్నారు. సెట్టిగుంట నుంచి 2.5 కిలోమీటర్లు, మామండూరు నుంచి 2.3 కిలోమీటర్లు, రేణిగుంట చెక్‌పోస్ట్ వరకు 3.2కి.మీ బైపాస్ రోడ్లు, 2 రైలు ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబి)లు కూడా నిర్మిస్తారు. 42 చోట్ల అండర్‌పాసులను ఏర్పాటు చేస్తారు. టెండర్లలో విజయవాడకు చెందిన లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ ఈ పనులను కైవసం చేసుకుంది. ఈ మేరకు 2023లోనే పనులు కూడా ప్రారంభమయ్యాయి. మొదటి విడత పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. అయితే సెన్సిటివ్ జోన్ కింద పనులు చేపట్టేందుకు అనుమతులు లభించలేదు. ఈ ఏడాది ప్రారంభంలో వన్యప్రాణులకు విభాగానికి చెందిన ఉన్నతాధికారులు ఈ రహదారిని పరిశీలించారు. ప్రపంచంలోనే అరుదైన వన్యప్రాణులు ఉన్న ఈ అటవీ ప్రాంతంలో అనుమతులు ఇవ్వాలంటే రహదారిలో అండర్ పాసులు ఎక్కువగా నిర్మించాలని ఉన్నతాధి కారులు తేల్చి చెప్పారు. వన్యప్రాణులు రహదారి నుంచి అటువైపు ఇటువైపు తిరిగేలా రహదారి నిర్మాణం ఉండాలని సూచించారు.
రహదారి నిర్మాణానికి 10 షరతులు కూడా పెట్టినట్లు సమాచారం. ఆ తర్వాత ఏమైందో కానీ ఇప్పటికీ ఈ రహదారికి సంబంధించి వన్యప్రానుల విభాగం నుంచి ఇంకా అనుమతులు లభించనట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారణ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షి ంచారు. అందులో తీవ్ర జాప్యమైన కడప రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కూడా ప్రస్తావించారు. ఈ రహదారికి సంబంధించిన క్లియరెన్స్ పనులు త్వరగా చూడాలని సంబంధిత మంత్రులకు సూచించారు. కేంద్ర మంత్రివర్గంలో ఉన్న రాష్ట్ర మంత్రులకు కూడా ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు లభించలేదని స్పష్టమైన సమాచారం. ప్రాజెక్టు మూడేళ్లు ఆలస్యమైన నేపథ్యంలో ఈ రహదారి నిర్మాణంపై వందల కోట్ల అదనపు భారం పడనుంది.
ఈ ప్రాజెక్టు టెండర్లు పూర్తయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి సంబంధించి పనులు చేపట్టేందుకు నిర్దేశించే ఎస్ఎస్ఆర్ రేట్లు కూడా రెండుసార్లు మారాయి. దీనివల్ల ఎంత తక్కువ అన్నా రూ.400-500 కోట్ల అదనపు భారం ఈ ప్రాజెక్టు నిర్మాణం పై పడనుంది. కొత్త రహదారి పనులు ప్రారంభించక ముందే జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఈ రహదారిని మర్చిపోయింది. ఫలితంగా గత కొంతకాలంగా ప్రయాణికులు దారుణ రోడ్డుతో రోడ్డుతో నరకం చూస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. జాతీయ రహదారి ఏర్పడిన మోకాటి లోతు గుంతలతో వాహనదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనా గుత్తేదారు పనులు చేపట్టేందుకు జాప్యం చేశారు. ఇకనైనా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంతోపాటు రాష్ట్రంలోని బిజెపి నాయకులు కడప- రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంపై చొరవ చూపి త్వరగా పనులు ప్రారంభించేలా చూస్తారని ఆశిద్దాం.



# ఈజిప్టులో ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం

## 50 వేల కళాఖండాలతో తీర్చిదిద్దిన వైనం

## రూ.83వేల కోట్లతో దశాబ్దకాలంగా నిర్మాణం

### 4వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో సందర్శకులకు అనుమతి

కైరో(ఈజిప్టు), నవంబరు 2: ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం ఈజిప్టులోని కైరో నగరంలోప్రారంభం అయింది. మొత్తం 50వేల కళా కుడ్యాలతో కూడిన ఈ మ్యూజియం సందర్శకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఈ మ్యూజియం నిర్మాణానికే దశాబ్దకాలం పట్టింది. సుమారు 24 వేల చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మించిన ఈ మ్యూజియంలో పురాతన కళాఖండాలన్నింటినీ నిక్షిప్తంచేసారు. బిలియన్ డాలర్లు అంటే సుమారు 83 వేలకోట్ల రూపాయలకుపైగా వ్యయంచేసి ఈ పురావస్తుశాలను నిర్మించారు. ప్రపంచ నేతలు, ప్రభుత్వాధినేతలు, రాజులు, బౌద్ధమత సన్యాసులు మొత్తం సెలబ్రిటీలందరూ గ్రాండ్ ఓపెనింగ్‌కు హాజరవుతున్నారు. మానవ సంస్కృతి, నాగరికతలకు చిహ్నంగా ఈ మ్యూజియం నిలిచిందని ఈజిప్టు నేత అహ్మద్ ఎల్‌సిసి ప్రకటించారు. గడచిన రెండేళ్లనుంచి పరిమిత సందర్శకులకే అనుమతి నిస్తున్నా ఈ మంగళవారం నుంచి ప్రవేశాలకు అనుమతిస్తున్నారు. గడచిన రెండువారాలుగా ఈ పురావస్తుశాలను మూసివేసి ఉంచారు. ఆరు అంతస్తుల్లో ఏర్పాటుచేసిన ఈ పురావస్తుశాలలో ప్రాచీన విగ్రహాలే ఎక్కువ కనిపిస్తాయి. మ్యూజియం నుంచి సమీపంలో ఉన్న పిరమిడ్లు కూడా కనిపించే దృశ్యాలు పర్యాటకులు, సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ పురావస్తుశాలలో 12 ప్రధాన గ్యాలరీలున్నాయి. ప్రాచీన చరిత్ర నుంచి రోమన్ కాలం నాటివరకూ ఉన్న ప్రధాన కళాకుడ్యాలన్నింటినీ ఏర్పాటు చేసారు. ఈజిప్టు రాజు తుతాన్‌ఖమున్ కాలంనాటి ఐదువేల కళాఖండాలను ప్రత్యేకించి ఏర్పాటుచేసారు. వీటిని 1922 కాలంలో లక్సర్ దక్షిణ ప్రనాంతంలో బ్రిటన్ పురావస్తు పరిశోధకుడు హౌవర్డ్ కార్టర్ గుర్తించారు. ప్రముఖ ఆర్కియాలిజిస్టు జహీ హవాస్ టుటన్‌ఖమెన్ కాలంనాటి కళాఖండాల సేకరణ అనితరసాధ్యమైనదని వీటిని ఏర్పాటు చేయడం ప్రభుత్వ కృషికినిదర్శనం అన్నారు. గత ఏడాదిలో ఈ మ్యూజియంను 15.7 మిలియన్లమంది పర్యాటకులు సందర్శిస్తే 2032 నాటికి ఈ సంఖ్య రెట్టింపు కాగలదని మ్యూజియం నిర్వాహకులు పేర్కొంటున్నారు.


# మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి లొంగిపోవాలి

### వీడియో విడుదల చేసిన మల్లోజుల వేణుగోపాల్

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: మహారాష్ట్ర సిఎం దేవేంద్ర పడ్నవీస్ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ సంచలన వీడియో విడుదల చేశారు. అజ్ఞాతంలో వున్న మావోయిస్టు నాయకులు, కిందిస్థాయి కేడర్ తమ ఆయుధాలతో పోలీ సులకు లొంగి పోవాలని ఆ వీడియోలో ఆయన పిలుపునిచ్చారు. మహారాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి ఈ శనివారం రాత్రి ఈ వీడియో విడు దల చేశారు. విప్లవానికి సేవ చేయాలని వున్న మావోయిస్టులంతా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన కోరారు. సెప్టెంబరు 16వ తేదీన తాను సాయుధ పోరాటాన్ని నిలిపి వేస్తున్నట్లు ప్రకటించినట్లుగా మల్లోజుల తెలిపారు. తాను తీసుకున్న నిర్ణయాన్ని తనతో పాటు వచ్చిన 60 మంది సహచరులు సమర్థించారని, తామంతా ఆయుధాలను విడిచి పెట్టామని, జనజీవన స్రవంతిలో కలిశామని మల్లోజుల తెలిపారు. తాము తీసుకున్న నిర్ణయాన్ని ఆదివాసి శ్రేయోభిలాషులు అర్థం చేసుకుని తమకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. మావోయిస్టు పార్టీలో ఆయుధాల తో వున్న వారు జనజీవన స్రవంతిలో కలవాలనుకుంటే వెంటనే తనను సంప్రదించాలని ఆయన కోరారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను తమ పార్టీ కేంద్ర కమిటీ గుర్తిస్తున్నా, పోరాట పంథాను మార్చుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదని మల్లోజుల ఆవేదన చెందారు. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా అనేకచోట్ల పనిచేస్తున్న మావోలు ఆయుధాలను వదిలేసి. సాయుధ పోరాటాన్ని విడనాడాలని ఆయన కోరారు. దీంతో పాటు ప్రజల మధ్యకు రావాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. సాయుధ పోరాటంతో తమ లక్ష్యాలను ఎన్నటికీ సాధించలేమని, ఈ విషయాన్ని కామ్రేడ్లు అర్థం చేసుకోవాలని, మావోలు మారిన పరిస్థితుల్లో ప్రజల మధ్య వుంటూ వారి సమస్యల కోసం పో రాటం చేయాల్సిన అవసరం, సమయం వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇది సోషల్ మీడియా యుగమని, దీనిని మావోయిస్టులంతా అర్థం చేసుకోవాలని మల్లోజుల కోరారు.

# మంత్రాల అనుమానంతో గొడ్డలితో దారుణహత్య

### తెలంగాణలో అమానుష ఘటన



తిర్యాని, నవంబరు 2, ప్రభాతవార్త : మండలంలోని పీట్టగూడ గ్రామంలో శనివారం రాత్రి దారుణ హత్య సంఘటన చోటుచేసుకుంది. మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో ఓ వ్యక్తిని గొడ్డలితో దాడి చేసి హతమార్చిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. రెబ్బెన సీఐ సంజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగి గ్రామ పం చాయతీ పరిధిలోని పిట్టగూడకు చెందిన హన్మంత్ రావు (50) శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన సీడాం వినోద్ ఇంటి దగ్గరగా వెళ్తుండగా, అతనిపై మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో వినోద్ మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో వినోద్ గొడ్డలితో హన్మంత్ రావుపై దాడిచేసి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటనను గమనించిన హన్మంత్‌రావు భార్య బొజ్జ బాయి అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆమెపై కూడా దాడి చేయడానికి యత్నించాడు. ఆమె ప్రాణ భయంతో ఇంట్లోకి పరుగెత్తి తలుపు వేసుకుంది.

# కాపులపై వివక్షను ఆపండి

విజయవాడ, నవంబరు 2, ప్రభాతవార్త: ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో కాపులపై విపరీత వివక్ష ప్రదర్శిస్తున్నారని కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు, కన్వీనర్ రావి శ్రీనివాస్‌లు ఆరోపించారు. వెంటనే ఈ వివక్షను ఆపాలంటూ కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కోరారు. ఆదివారం విజయవాడలోని ఓ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలోనూ, వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనూ మాదిరి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా కాపులపై వివక్ష పెద్ద ఎత్తున సాగుతోందని ఆరోపించారు. సినీనటుడు చిరంజీవిని దూషించడం తదితర అంశాలను ప్రస్తావిస్తూ తమపై ఈ వివక్షను వెంటనే ఆపాలని ముఖ్యమంత్రిని కోరారు.

# డ్రగ్స్, గంజాయిని తరిమికొట్టాలి

- గంజాయి స్మగ్లర్లను టెర్రరిస్టులుగా భావిస్తున్నాం
- 1435 మంది గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసాం
- గంజాయి స్మగ్లర్స్ ఆస్తులను జప్తు చేస్తున్నాం
- విశాఖలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా పిలుపు
- రైళ్లు, బస్సుల్లో విస్తృతంగా తనిఖీలు
- విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



విశాఖ క్రైమ్, నవంబరు 2 ప్రభాతవార్త: యువత డ్రగ్స్, గంజాయిని తరిమికొట్టాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తా అన్నారు. ఆదివారం విశాఖలోని పరదేశీపాలెం డంపింగ్ యార్డులో భారీ ఎత్తున గంజాయిని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ విశాఖలోని పలు కేసుల్లో పట్టుబడ్డ రూ.5.21 కోట్ల విలువ చేసే 10,147. 590 కేజీలు, 19.31 లీటర్ల హాష్ ఆయిల్, 1 కేజీ ఓపియంలను తగల బెట్టామని అన్నారు. మొత్తం 533 గంజాయి కేసుల్లో 1435 నిందితులను అరెస్ట్ చేశాం అన్నారు. అందులో 712 విశాఖలో అరెస్ట్ చేయగా, మిగతా 332 ఏపీలో మిగతా జిల్లాలకు చెందినవారనీ, మిగిలిన 391 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారని ఆయన తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి కేసులో అరెస్టైన వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. స్మగ్లర్లు సింతటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనీ వాటిని యువత కొనుగోలు చేస్తే ఆ డబ్బులు టెర్రరిస్టులకు చేరుతుందనీ, ఆ విధంగా టెర్రరిస్టులను ప్రోత్సహించినట్లు అవుతుందని చెప్పారు. కాబట్టి యువత డ్రగ్స్, గంజాయిని తరిమికొట్టాలి అని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో గంజాయి పూర్తిగా నిర్మూలన జరుగుతుంది. చెక్ పోస్టులను బలోపేతం చేస్తున్నాం అన్నారు. గంజాయి స్మగ్లర్లను టెర్రరిస్టులుగా భావిస్తున్నామన్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్ ద్వారా గంజాయి స్మగ్లర్స్ ఆస్తులను జప్తు చేస్తున్నాం అన్నారు. యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని డిజిపి విజ్ఞప్తి చేసారు. ఈగల్ టీమ్స్ ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ హాండ్స్ పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని హరీష్ గుప్తా పేర్కొన్నారు.
అనంతరం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ గంజాయిని అరికట్టేందుకు దాకమర్రి, సత్తరువు, రామాటాకీస్, రైల్వే స్టేషన్, దేశపాత్రునిపాలెం, దువ్వాడ సెక్టర్ 1, సారిపల్లి, పినగాడిల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15 నెలల్లో 14 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి కేసుల్లో 533 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. 647 మంది డ్రగ్ నేరస్తులపై షీట్స్ తెరిచినట్టు చెప్పారు. గంజాయిని నియంత్రించడానికి రైల్వే పోలీస్, ఆర్పీఎఫ్, పాకెర్స్ అండ్ మూవర్స్, కొరియర్ సర్వీసెస్, ఎకనామిక్ సర్వీసెస్, ఏపీఎస్ఆర్టీసీ విభాగాలతో కలిసి ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వచ్చే బస్సులు, రైళ్లను విస్తృతంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. 15 డ్రోన్ కెమెరాలతో విశాఖలో ఏరియల్ సర్వే చేసి గంజాయిని గుర్తించి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. మాదక ద్రవ్యాలను కనిపెట్టడానికి 9 పోలీస్ శునకాలతో నిత్యం తనిఖీలు చేస్తునట్టు చెప్పారు. గంజాయి కేసుల దర్యాప్తు కోసం సిబ్బందికి రెగ్యులర్‌గా శిక్షణా తరగతులను నివహిస్తునట్టు చెప్పారు. అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తునట్టు చెప్పారు. ప్రతి కళాశాలలో ఈగల్ టీమ్స్ ఉత్సాహంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పీ.ఎం. పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పరదేశీ పాలెం డంపింగ్ యార్డులో నార్త్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన గంజాయి డిస్ట్రక్షన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిందేర ప్రసాద్, ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, డీసీపీలు మేరీ ప్రశాంతి, లతా మాధురి, ఎడిసిపిలు, ఏసిపిలు, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆసుపత్రుల నుంచి క్షతగాత్రుల డిశ్చార్జి

### పలాస సిహెచ్ సిలో 11మందికి కొనసాగుతున్న చికిత్స

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

అమరావతి, నవంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి చికిత్స అనంతరం కోలుకున్న వారిని ఇళ్లకు పంపుతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యంపై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ సమీక్షి ంచారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. "పలాస కిడ్నీ రీసెర్చి సెంటర్ అండ్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో చికిత్స కోసం శనివారం చేరిన వారికి వైద్యులు ఉత్తమ సేవలు అందించారు. ఎక్స్‌రేలు, ఇతర పరీక్షలు చేసిన అనంతరం వారికి అందించిన చికిత్సతో పూర్తిగా కోలుకున్న 15 మందిని వైద్యులు ఇళ్లకు పంపించారు. పలాస సామాజిక ఆసుపత్రిలో ప్రస్తుతం 11 మంది చికిత్స పొందుతున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్సతో బాగా కోలుకుంటున్న వీరిలో ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వారు మూడు రోజుల్లోగా డిశ్చార్జి అయ్యే అవకాశం ఉంది. వీరికి చికిత్స అందించే విషయంలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు" అని మంత్రి తెలిపారు. పలాస సీహెచ్సీలో చికిత్స పొందుతున్న వారిలో ఒకరిని ఆదివారం శస్త్రచికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని జెమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

# 'సర్' పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం

### ఇసి చర్యను ఘాటుగా విమర్శించిన విజయ్

### డిఎంకె నిర్వహించిన అఖిలపక్షానికి గైర్హాజరు



చెన్నై, నవంబరు 2: తమిళనాడులో అధికార డీఎంకే పార్టీకి, నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై చర్చించేందుకు డీఎంకే ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాన్ని విజయ్ బహిష్కరించారు. ఈసీ చేపట్టిన ఈ సవరణ ప్రక్రియ పూర్తిగా 'రాజ్యాంగ విరుద్ధం, రాజకీయ ప్రేరేపితం, ప్రజాస్వామ్యానికి పెనుముప్పు' అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. ఈ మేరకు విజయ్ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వల్ల గతంలో బీహార్‌లో జరిగినట్లే తమిళనాడులో కూడా లక్షలాది మంది మైనారిటీ ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 30 రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని 6.36 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఎలా ధ్రువీకరిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఈసీ చర్యల్లో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి లోపించాయని, ఇంతటి హడావుడి ప్రక్రియ ప్రజల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. డీఎంకే ప్రభుత్వంపై కూడా విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. వారిపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎంకే ఈ అఖిలపక్ష సమావేశ నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం విజయ్ ఏడు కీలక సూచనలను కూడా ప్రతిపాదించారు. జాబితాలోని తప్పులను సరిదిద్దడం, నకిలీ ఓట్లను తొలగిం చడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ చేర్చడం, వయస్సు చిరునామా ధ్రువీకరణకు ఆధార్ కార్డును అంగీకరించడం, తుది జాబితాను రాజకీయ పార్టీలకు, ప్రజలకు డిజిటల్‌గా అందుబాటులో ఉంచడం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ ప్రక్రియలో అవకతవకలు జరగ కుండా స్థానిక ప్రతినిధులు, స్వతంత్ర పరిశీలకులను భాగస్వాములను చేయాలని ఇసిని కోరా రు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాపాడేం దుకు తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేసిన విజయ్, నిజమైన ఓటర్లను తొలగించ కుండా చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని పర్యవేక్షిస్తామని ప్రకటించారు.

# నిజామాబాద్‌లో మహిళ హత్య

హైదరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: నిజా మాబాద్ జిల్లా నవీపేట మండలం మిట్టాపూర్ శివార్లలో శనివారం వెలుగుచూసిన గుర్తుతెలి యని మహిళ హత్యపై మిస్టరీ వీడలేదు. తల, కుడి చేయి, మరో చేయి వేళ్లు లేకుండా, నగ్నంగా పడివున్న మహిళ మృతదేహాన్ని మొదట ఒక రైతు గమ నించి పోలీసులకు సమాచారం ఇవ్వడం తెలిసిందే. ఆ మహిళపై అత్యాచారం జరిగి వుం టుందని పోలీసులు అనుమానించి ఆ కోణంలో విచారణ చేబట్టారు. హతురాలి వయస్సు 35 ఏళ్ల వరకు వుంటుందని పోలీసులు చెబుతున్నారు. హతురాలి తల ఘటనాస్థలంతో పాటు సమీప ప్రాంతంలోనూ కనపించక పోవడంతో పోలీసులు డ్రోన్ల సహాయంతో గాలింపు చేబట్టినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఆమె కుడి చేతి కోసం గాలించినా ఆచూకీ దొరకలేదు. హతురాలి ఆచూకీ కోసం, నిందితుల వివరాల కోసం పది బృం దాలను రంగంలో దించారు. నిజామాబాద్‌తో పాటు సమీప ప్రాంతాలలో మహిళల మిస్సింగ్ కేసులపై దృష్టి సారించిన పోలీసులు హతురాలు వారిలో ఒకరు వుండి వుంటారేమోనని అను మాని స్తున్నారు. కాగా గత నెల 24న నిజామాబాద్ జిల్లాలో బాసర రహదారిపై ఓ మహిళను గుర్తు తెలియని దుండగులు అత్యాచారం చేసి, ఆ తరు వాత ఆమెపై పెట్రోల్ పోసి కాల్చి వేసిన ఘటన మరువక ముందే మరో మహిళను హత్య చేసి ఆమె తలను, కుడిచేతిని వేరుచేసి మరోచోట పడ వేసిన ఉదంతం సంచలనం రేపింది. బాసర రహ దారిపై హత్యకు గురైన మహిళ శవాన్ని మద్దేపల్లి గ్రామానికి చెందిన 30 యేళ్ల శ్యామలగా గుర్తిం చారు. ఆ మెను హత్య చేసిన వారు ఇంకా పట్టు బడలేదు.



# విజయవాడ దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల పోస్టర్ ఆవిష్కరణ

ఇంద్రకీలాద్రి, నవంబరు 2 ప్రభాతవార్త: దుర్గమ్మ వారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల పోస్టర్, కర పత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆలయంలో జరిగిన సమావేశంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ పాలకమండలి సభ్యులు, ఏఇఓలు, వైదిక కమిటీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ భవానీ దీక్షల కార్యక్రమంతో పాటు, డిసెంబర్ 4న మార్గశిర పూర్ణిమ నాడు కలశజ్యోతి ఉత్సవాలు కార్యక్రమ నిర్వహణ, డిసెంబర్ 11న భవానీ దీక్షల విరమణలు, అగ్నిప్రతిష్టాపన, శతచండీయాగం, గిరిప్రదక్షణలు కార్యక్రమ ప్రణాళిక తదితర అంశాలపయిన విస్తృతంగా చర్చించారు. అలాగే కార్తీక పౌర్ణమి పర్వదినాన నవంబర్ 5న కార్తీక దీపోత్సవం ఏకాంతంగా నిర్వహిస్తామని భక్తులకు పాల్గొనే అవకాశం లేదని ఇఓ తెలిపారు. కార్యక్రమంలో ఏసిపిలు రామచంద్రరావు, దుర్గారావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్, ట్రాఫిక్ సిఐ ఉమామహేశ్వరరావు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు షణ్ముఖశాస్త్రి, వివిఎస్ మహర్షి, ఇఇలు కోటేశ్వరరావు, రాంబాబు, ఎఇఓలు చంద్రశేఖర్, సుధారాణి, రమేష్‌బాబు, వెంకటరెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

### కార్తీకపౌర్ణమిన కోటి దీపోత్సవం

ఈనెల 5న కార్తీకపౌర్ణమి పర్వదినాన 500 మంది సేవాదళ్ సభ్యులతో కోటి దీపోత్సవం నిర్వహిస్తామని ఇఓ, చైర్మన్‌లు తెలిపారు. ఉదయం గిరి ప్రదక్షణ, సాయంత్రం శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయం వద్ద జ్వాలాతోరణం జరుగుతాయన్నారు.
దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవ లందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చక స్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామి వారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యా కాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. ఆదివారం శ్రీ అమ్మవారి ఆలయంలో లోకరక్షణార్థం సూర్యోపాసన సేవ నిర్వహిం చారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్న దాన పథకాకిని హైదరాబాద్‌కు చెందిన నరేష్, కావ్య దంపతులు రు.5లక్షల విరాళాన్ని అందించారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# హైలో ఓపెన్ సెమీ ఫైనల్లో ఓడిన ఉన్నతి




**న్యూఢిల్లీ:** హైలో ఓపెన్-2025, సెమీఫైనల్లో ఉన్నతి హుడా అద్భుత ప్రచారం ఓటమితో ముగిసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో భారతదేశానికి చెందిన 17 ఏళ్ల ఉన్నతి హుడా హైలో ఓపెన్‌లో ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమా వార్దానీ చేతిలో 7-21, 13-21 తేడాతో ఓడిపోయింది. వరుస గేమ్‌లలో ఓటమి పాలైనప్పటికీ, ఈ యువ భారత క్రీడాకారిణి ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ప్రత్యర్థులపై అద్భుతమైన పరిణతి మరియు నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అంతకు ముందు 47 నిమిషాల క్వార్టర్ ఫైనల్ పోరులో చైనీస్ తైపీకి చెందిన నాల్గవ సీడ్ హ్సు యాంగ్ టి లిన్‌ను 22-20, 21-13 తేడాతో ఓడించడం ద్వారా ఉన్నతి తన యువ కెరీర్‌లో అత్యుత్తమ విజయాలలో ఒకటిగా నిలిచింది. ప్రపంచ 34వ ర్యాంక్‌లో ఉన్నతి, పదునైన నెట్ ప్లే, స్మార్ట్ ప్లేస్‌మెంట్ మరియు ఒత్తిడిలో బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో తన కంటే పది స్థానాలు పైన ఉన్న టి లిన్‌ను అధిగమించింది. ఈ విజయం ఈ సంవత్సరం ప్రారంభంలో మలేషియా మాస్టర్స్‌లో టి లిన్ చేతిలో జరిగిన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ఆమె మొదటిసారి సూపర్ 500 సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇక పురుషుల సింగిల్స్ డ్రా లో తీవ్రంగా పోరాడిన క్వార్టర్ ఫైనల్ ఓటములతో లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి మరియు కిరణ్ జార్జ్ అందరూ నిష్క్రమించారు.




### సూపర్ వెల్టర్‌వెయిట్ బౌట్‌లో..

# నిశాంత్ అద్భుత ఆరంభం

**న్యూఢిల్లీ:** జువాన్ కార్లోస్ కాంపోస్ మెడినాపై ఆధిపత్య విజయంతో భారత్ బాక్సింగ్ స్టార్ నిశాంత్ దేవ్ తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఫ్లోరిడాలోని ఓర్లాండోలో జరిగిన 10 రౌండ్ల సూపర్ వెల్టర్‌వెయిట్ బౌట్‌లో 23 ఏళ్ల భారత బాక్సర్ ఏకగ్రీవ నిర్ణయం ద్వారా మెక్సికోకు చెందిన జువాన్ కార్లోస్ కాంపోస్ మెడినాను ఓడించాడు. తద్వారా ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన అద్భుతమైన ఆరంభాన్ని అందించాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న అతను, వారి సూపర్ వెల్టర్‌వెయిట్ పోటీలో 10 రౌండ్లలోనూ ఆధిపత్యం చెలాయించిన తర్వాత తన ప్రొఫెషనల్ రికార్డును 4-0 (2 కెఒలు)కి మెరుగుపరుచుకున్నాడు. ఈ పోరాటం అనంతరం వీరిద్దరూ 60-54తో స్కోర్ చేశారు. దేవ్ పదునైన ఫుట్‌వర్క్, స్ఫుటమైన జాబ్‌లు మరియు వ్యూహాత్మక ఖచ్చితత్వాన్ని ప్రదర్శించాడు, మెక్సికన్ ప్రత్యర్థిని రక్షణాత్మకంగా ఉంచాడు. మెడినా సామర్థ్యంతో ఉన్నప్పటికీ, నిశాంత్ అతనిని విస్తృత తేడాతో ఓడించాడు, 200 కంటే ఎక్కువ పంచ్‌లతో సత్తా చూపించాడు. ఎటువంటి నాక్‌డౌన్‌లు లేకుండా ప్రారంభం నుండి ముగింపు వరకు ఇదే టెంపోను కొనసాగించాడు. న్యూయార్క్ మరియు ఫిలడెల్ఫియాలో విజయవంతమైన విజయాల తర్వాత, 2025 ప్రారంభంలో ప్రొఫెషనల్‌గా మారిన తర్వాత ఈ పోరాటం అతని నాలుగో విజయాన్ని కొనసాగించింది.

### ఇండోనేసియా వ్యక్తిగత ఈవెంట్లలో

# నవీన్, నిత్య, మనీషా, నితేష్‌లకు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్-2025లో వివిధ వ్యక్తిగత విభాగాల్లో భారత్‌కు చెందిన నలుగురు ప్లేయర్లు టైటిళ్లను కైవసం చేసుకున్నారు. వీరిలో నవీన్ శివకుమార్, నిత్య శ్రీ శివన్, మనీషా రామదాస్, నితేష్‌లు వ్యక్తిగత స్వర్ణాలు సాధించారు. ఇక 2 సార్లు పారాలింపిక్ ఛాంపియన్‌ను ఓడించి భారత్ షట్లర్ నవీన్ శివకుమార్



స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఆదివారం జరిగిన ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్‌లో పారా షట్లర్ నవీన్ శివకుమార్ రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్ లూకాస్ మజుర్‌ను ఓడించి టైటిల్‌ను గెలుచుకున్నాడు. అతను తన ఐదవ మ్యాచ్‌లో ఫ్రెంచ్‌పై తొలిసారి విజయం సాధించి 17-21, 23-21, 21-12 తేడాతో మూడు గేమ్‌ల పోరాట విజయంతో ఎమ్‌ఎస్ ఎస్ఎల్4 టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక నిత్య శ్రీ శివన్ (ఎస్‌హెచ్6), మనీషా రామదాస్ (ఎస్‌యు5), నితేష్ కుమార్ (ఎస్ఎల్3) కూడా వ్యక్తిగత టైటిళ్లను గెలుచుకోవడంతో భారత్ ఇతర విభాగాలలో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఫైనల్లో నిత్య 21-14, 21-13 తేడాతో పెరువాన్ గియులియానా పోవెడ్ పై విజయం సాధించింది.

అలాగే పారాలింపిక్ ఛాంపియన్ నితేష్ కుమార్ ఫైనల్లో డేనియల్ బెథెల్ పై వాకోవర్ అందుకున్నాడు. మరోవైపు మనీషా రామదాస్ ఫైనల్‌లో తన తోటిదేశస్థురాలైన తులసిమతి మురుగేషన్‌ను ఓడించి (12-21, 22-20, 21-14) ఈ సంవత్సరంలో తన నాలుగో టైటిల్‌ను గెలుచుకుంది.








# రాబోయే ఐపిఎల్‌లో కొత్త కెప్టెన్స్

### భారీ మార్పుల్లో ఫ్రాంచైజీలు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 సీజన్ సమీపిస్తున్న కొద్దీ, అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల కెప్టెన్సీ మార్పులపై సంబంధిత ఫ్రాంచైజీల యాజమాన్యాలకు సందేహాలు ఉన్న క్రమంలో ఆసక్తి సంతరించుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌లో అజింక్య రహానే కెప్టెన్సీ భవిష్యత్తు అనిశ్చితంగా కనిపిస్తోంది. ప్రస్తుతం జట్టు యాజమాన్యం వెంకటేష్ అయ్యర్ వంటి యువ కెప్టెన్సీ ఎంపికలను అన్వేషిస్తున్నట్లు సమాచారం.

మెగా వేలం వస్తున్నందున, కెప్టెన్సీలో మార్పు వచ్చే అవకాశం ఉంది. ఢిల్లీ క్యాపిటల్ ఇటీవల ఐపీఎల్‌లో చాలా బలంగా కనిపించినా అక్షర్ పటేల్‌పై నాయకత్వంలో జట్టు అ ప్రకారం ఆడలేదు. అదేవిధంగా, రిషబ్ పంత్ జట్టును విడిచిపెట్టిన తర్వాత అక్షర్ ను కెప్టెన్‌గా నియమించారు. అయితే అతని నాయకత్వ లక్షణాలపై నమ్మకాలు సన్నగిల్లడంతో వచ్చే ఐపీఎల్‌కు కెప్టెన్సీలో మార్పు ఉంటుందని అంచనా. రిషబ్ పంత్ ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడు. కానీ అతని ప్రదర్శన లక్నో సూపర్ జెయింట్స్ అవసరాలకు తగ్గట్టుగా లేదు. దీని కారణంగా యాజమాన్యం మరొక నాయకత్వ ఎంపిక కోసం వెతకవచ్చు. ఇక ఐపీఎల్ 2026కి ముందు రాజస్థాన్ రాయల్స్‌లో సంజు సామ్సన్ భవిష్యత్తుపై చర్చనీయాంశంగా మారింది. జట్టు మేనేజ్‌మెంట్‌తో విభేదాల తర్వాత అతన్ని విడుదల చేయాలని లేదా ట్రేడ్ చేయాలని కోరింది. దీని కారణంగా రాబోయే ఐపీఎల్ సిరీస్‌లో రాజస్థాన్ జట్టు కెప్టెన్సీలో మార్పు ఉంటుందని భావిస్తున్నారు.

చెన్నై సూపర్ కింగ్స్‌కు రుతురాజ్ గైక్వాడ్ తరువాతి తరం నాయకుడిగా స్థిరపడ్డాడు. విధానం, వ్యూహాత్మక పరిణతి, స్థిరమైన ప్రదర్శన అతనికి ఎమ్ఎస్ ధోని పూర్తి మద్దతును సంపాదించిపెట్టాయి. ఏదైనా గాయం లేదా వాణిజ్య ఆశ్చర్యాలను మినహాయించి, రుతురాజ్ వచ్చే ఐపీఎల్ వరకు కెప్టెన్‌గా కొనసాగడం ఖాయం.

# గెలిచిన టీమిండియా

### మూడో టి20లో 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఓటమి

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో భారత జట్టు 9 బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్లు తేడాతో అద్భుతమైన విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 187 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా హోబర్ట్‌లో ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు




187 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ (3 వికెట్లు), వరుణ్ చక్రవర్తి (2 వికెట్లు) అద్భుతంగా రాణించారు. అర్ష్‌దీప్ మొదటి ఓవర్‌లోనే ట్రావిస్ హెడ్ (6) వికెట్‌ను తీసి, ఆ తర్వాత జోష్ ఇంగ్లిస్ (1) ను అవుట్ చేశాడు. వరుణ్ చక్రవర్తి కెప్టెన్ మిచెల్ మార్ష్ (11), మిచ్ ఓవన్‌లను అవుట్ చేశాడు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లలో టిమ్ డేవిడ్ కేవలం 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చెలరేగి 74 పరుగుల (13వ ఓవర్ చివరి బంతికి ఔట్) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత మార్కస్ స్టోయినిస్ కూడా మెరుపు హాఫ్ సెంచరీతో 64 పరుగులు చేసి ఆస్ట్రేలియాకు 186 పరుగుల స్కోరు అందించాడు. 187 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత టాప్ ఆర్డర్ తడబడినప్పటికీ, మిడిల్ ఆర్డర్ పోరాటం వలన విజయం సాధ్యమైంది. భారత్ 33 పరుగుల వద్ద అభిషేక్ శర్మ (25) వికెట్‌ను, ఆ తర్వాత శుభ్‌మన్ గిల్ (15) వికెట్‌ను కోల్పోయింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24), తిలక్ వర్మ (29) కూడా క్రీజులో ఎక్కువసేపు నిలబడలేకపోయారు. కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 23 బంతులు ఎదుర్కొని, 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 49 పరుగులు (నాటౌట్) చేసి మ్యాచ్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ ఫలితంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా నిలబడింది.

గాడ్జెట్

# ఎఐ ప్రతిభ ఉన్నవారికే మైక్రోసాఫ్ట్‌లో ప్రాధాన్యం!



**న్యూయార్క్, నవంబరు 2:** వేలాది ఉద్యోగాల్లో గత ఏడాది కోతలు వేసిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఇప్పుడు మళ్లీ నియామకాలను చేపడుతోంది. అయితే ఈసారి నియామక ప్రక్రియలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) నైపుణ్యాలు ఉన్నవారికే పెద్దపీట వేయనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఇన్వెస్టర్ బ్రాడ్ గెర్స్నర్‌తో జరిగిన పాడ్‌కాస్ట్‌లో మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల ఈ విషయాలు వెల్లడించారు. భవిష్యత్తులో తమ ఉద్యోగుల సంఖ్యను పెంచుతామని అన్నారు. అయితే, ఈ నియామకాలు స్మార్టర్, మోర్ లివరేజ్డ్ పద్ధతిలో ఉంటాయని, ఎఐ సాంకేతికతే దీనికి చోదకశక్తిగా నిలుస్తుందని తెలిపారు. 2025 జూన్ చివరి నాటికి మైక్రోసాఫ్ట్‌లో సుమారు 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. గతంలో దాదాపు 15 వేల మందికి పైగా ఉద్యోగులను తొలగించినప్పటికీ, ఉద్యోగుల సంఖ్య దాదాపు స్థిరంగా ఉంది. దీనికి భిన్నంగా, ఎఐ బూమ్ రాకముందు 2022లో కంపెనీ తన ఉద్యోగుల సంఖ్యను 22 శాతం పెంచుకుంది. మైక్రోసాఫ్ట్ తన దృష్టిని ఎఐ మౌలిక సదుపాయాలు, భాగస్వామ్యాలు, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్ వంటి టూల్స్‌పై పెట్టుబడులు పెట్టడం వల్లే నియామకాల వేగం తగ్గింది. ఇకపై భారీగా నియామకాలు చేపట్టే దశ ముగిసిందని, టార్గెటెడ్ స్కేలింగ్ దశ ప్రారంభమైందని నాదెళ్ల వివరించారు. ఎఐ సహాయంతో చిన్న బృందాలు కూడా అద్భుతమైన ఫలితాలు సాధించగలవని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు చేసే ప్రతీ పనిలో ఎఐ వినియోగం తప్పనిసరి అని, ఇది ఒక అన్‌లెర్నింగ్, లెర్నింగ్ ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. డిమాండ్‌కు తగినట్లు నియామకాలు చేపట్టలేని పరిస్థితుల్లో, తమ కంపెనీ ఫైబర్ నెట్‌వర్క్ కార్యకలాపాలను నిర్వహించడానికి ఎగ్జిక్యూటివ్ ఎఐ ఏజెంట్లను ఎలా ఉపయోగించారో ఆయన ఉదాహరణగా చెప్పారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది కూడా మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులలో 4 శాతం, అంటే సుమారు 9వేల మందిని తొలగించిందని పలు నివేదికలు వచ్చాయి. ఈ కోతలు ముఖ్యంగా మైక్రోసాఫ్ట్ గేమింగ్ (ఎక్స్‌బాక్స్) విభాగంపై తీవ్ర ప్రభావం చూపాయి. వ్యూహాత్మక వృద్ధి రంగాలపై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్‌బాక్స్ హెడ్ ఫిల్ స్పెన్సర్ తెలిపారు.

# రూ.5.73 లక్షల కోట్లకు చేరిన ఆర్థికలోటు!

**న్యూఢిల్లీ, నవంబరు 2:** కేంద్ర ఆర్థికలోటు మొదటి ఆరునెలల కాలంలో 5.73 లక్షల కోట్లకు పెరిగింది. బడ్జెట్ అంచనాల్లో 36.5శాతంగా ఉన్నట్లు కాగ్ నివేదిక విడుదలచేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్థికలోటు బడ్జెట్ అంచనాల్లో 29శాతంగా ఉంది. ప్రభుత్వం మొత్తం వ్యయం, మొత్తం రాబడులు మినహాయించగా వచ్చే మొత్తాన్ని లోటుగా పరిగణిస్తారు. కాగ్ గణాంకాలప్రకారం కేంద్రం మొత్తం రాబడులు సెప్టెంబరు నాటికి 17,30,216 కోట్లుగా ఉన్నాయి. 2026 ఆర్థికసంవత్సరం బడ్జెట్ అంచనాల్లో 49.5శాతంగా ఉన్నాయి. ఈమొత్తంలోనే పన్నురాబడులు రూ.12,29,370 కోట్లుకూడా ఉన్నాయి. పన్నేతర రాబడులు రూ.4,66,076కోట్లుగా ఉన్నాయి. ఇక నాన్ డెట్ మూలధన రాబడులు 34,770 కోట్లరూపాయలు వసూలు అయ్యాయి.



ఇక వ్యయాలపరంగాచూస్తే వడ్డీరూపంలోను, సబ్సిడీలపరంగా ఎక్కువ మొత్తం వ్యయం అయింది. మొత్తం ఏప్రిల్ సెప్టెంబరు మధ్యకాలంలో వ్యయం 23,03,339 కోట్లుగా ఉంది. అంటే బడ్జెట్ అంచనాల్లో 45.5శాతం అని తెలుస్తోంది. ఈమొత్తంలోనే రెవెన్యూ ఖాతాకింద 17,22,593 కోట్లు వ్యయంచేయగా 5,80,746 కోట్లు మూలధన ఖాతా కింద వ్యయం పద్దులోనమోదయింది. రెవెన్యూ ఖాతాకింద వడ్డీచెల్లింపులే రూ.5,78,182 కోట్లవరకూ ఉన్నాయి. ఇక మేజర్ సబ్సిడీల రూపంలో రూ.2,02,367 కోట్లు ఉన్నట్లు కాగ్ వివరించింది. ఇక రాష్ట్రాలకు రాబడుల బదిలీల పరంగాచస్తే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల్లో వాటా కింద రూ.6,31,751కోట్లు బదలీచేసింది. గత ఏడాది ఇదే కాలంలో 86,948 కోట్లు బదిలీచేసినట్లు కాగ్ నివేదికల్లో వెల్లడి అయింది.

### ఒక్క యేడాదిలో రూ.1480 కోట్ల

# తేనె ఎగుమతులు!

**న్యూఢిల్లీ,నవంబరు 2:** తేనె ఎగుమతుల్లో భారత్ సరికొత్త రికార్డు సాధించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద తేనె ఎగుమతి దేశంగా అవతరించి తన సత్తా చాటింది. 2020లో 9వ స్థానంలో ఉన్న భారత్ అనూహ్యమైన వృద్ధిని సాధించి ఈ ఘనతను అందుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశం నుంచి 1.07 లక్షల మెట్రిక్ టన్నుల సహజసిద్ధమైన తేనె ఎగుమతి కాగా, దీని విలువ 177.55 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,480కోట్లు) అని కేంద్రం ఆదివారం వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'తీపి విప్లవం' ఈ విజయంలో కీలక పాత్రపోషించింది. దేశంలో తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయంగా ప్రోత్సహించడం, నాణ్యమైన తేనె ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్‌ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 2020-21 నుంచి 2022-23 వరకు రూ. 500 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనికి లభించిన ఆదరణతో, మిగిలిన రూ. 370 కోట్ల బడ్జెట్‌తోమరోమూడేళ్లపాటు (2025-26 వరకు) పొడిగించారు. తేనెటీగల పెంపకం కేవలం తేనె ఉత్పత్తికే పరిమితం కాదు. ఇది వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట పొలాల్లో పరాగ సంపర్కానికి తేనెటీగలు ఎంతగానో దోహదపడతాయి. తద్వారా పంటల దిగుబడి పెరిగి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. తేనె మాత్రమే కాకుండా, మైనం, బీ పోలెన్, రాయల్‌జెల్లీ వంటి ఇతర విలువైన ఉత్పత్తులు కూడా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, భూమిలేని నిరుపేదలకు అదనపు ఆదాయ వనరుగా మారాయి. ఈ మిషన్‌ను మూడు ఉపమిషన్లుగా విభజించి అమలు చేస్తున్నారు. మొదటిది, శాస్త్రీయ పెంపకంద్వారా పంటల ఉత్పాదకతను పెంచడం. రెండోది, తేనె సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. మూడోది, వివిధ ప్రాంతాలకు అనువైన పరిశోధనలు, సాంకేతికతను అభివృద్ధిచేయడం. తేనె నాణ్యతను, అది ఎక్కడ తయారైందో తెలుసుకునేందుకు 'మధుక్రాంతి' అనే ఆన్‌లైన్‌పోర్టల్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితులు తేనెటీగల పెంపకానికి విస్తృత అవకాశాలు కల్పిస్తుండటంతో, భవిష్యత్తులో భారత్ ఈ రంగంలో మరింత ఉన్నతస్థాయికి చేరగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పండగ సీజన్‌లో బుల్లెట్ బంపర్ సేల్స్




**ముంబయి, నవంబరు 2:** ప్రముఖ ద్విచక్రవాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అక్టోబర్ నెలలోఅమ్మకాల్లోసత్తా చాటింది. పండగ సీజన్ డిమాండ్‌తో విక్రయాల్లో 13 శాతం వృద్ధిని సాధించింది. ఈ యేడాది అక్టోబర్‌లో 1,24,951 యూనిట్లను విక్రయించగా, గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 1,10,574 యూనిట్లుగా ఉంది. కంపెనీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, దేశీయ అమ్మకాలు 15 శాతం పెరిగి 1,01,886 యూనిట్ల నుంచి 1,16,844 యూనిట్లకు చేరాయి. అయితే, ఎగుమతులు మాత్రం నిరాశపరిచాయి. గతేడాది 8,688 యూనిట్లుగా ఉన్న ఎగుమతులు, ఈసారి 7 శాతం తగ్గి 8,107 యూనిట్లకు పరిమితమయ్యాయి. పండగ సీజన్ ఉత్సాహం దేశవ్యాప్తంగా అమ్మకాలకు ఊతమిచ్చిందని ఐషర్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సిఇఒ బి. గోవిందరాజన్ తెలిపారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో 2.49 లక్షల మోటార్ సైకిళ్లను విక్రయించి రికార్డు సృష్టించాం. మా కంపెనీ చరిత్రలో పండగ సీజన్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. మా బ్రాండ్‌పై రైడర్లకు ఉన్న అచంచలమైన అభిమానానికి ఇది నిదర్శనంఅని ఆయన వివరించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల వృద్ధి, దేశంలోని టూవీలర్ పరిశ్రమ మొత్తం పుంజుకుంటున్న తరుణంలో జరగడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు, పండగ డిమాండ్‌తో టివిఎస్ మోటార్, సుజుకి మోటార్‌సైకిల్ వంటి ఇతర ప్రముఖ కంపెనీలు కూడా అక్టోబర్‌లో 8 నుంచి 11 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సెంటిమెంట్, కొత్త మోడళ్ల విడుదల వంటి అంశాలు దీపావళికి ముందు టూవీలర్ అమ్మకాలకు మరింత ఊపునిచ్చాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లాసిక్ 350, బుల్లెట్, హంటర్ 350, హిమాలయన్ వంటి మోడళ్లతో మిడ్‌సైజ్ మోటార్‌సైకిల్ సెగ్మెంట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

# అమెజాన్ లేఆఫ్స్ షురూ!

### కార్పొరేట్ సెక్టార్‌లో 14వేల మందికి ఉద్వాసన

**వాషింగ్టన్, నవంబరు 2:** దిగ్గజ టెక్ కంపెనీల్లో ఒకటైన అమెజాన్ పెద్ద మొత్తంలో లేఆఫ్స్ ప్రకటించింది. కార్పొరేట్‌సెక్టార్‌లో 14వేల మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఉద్యోగులకు టెక్స్ట్ మెసేజెస్‌పంపించి తొలగింపులు చేపట్టింది. ఇప్పుడు అమెజాన్ హోమ్ స్టేట్ అయిన వాషింగ్టన్‌లో 2,303 కార్పొరేట్ ఉద్యోగాలు తొలగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు వాషింగ్టన్ ఎంప్లాయ్‌మెంట్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ చేసిన ఫైలింగ్‌లో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన తొలగింపుల్లో భాగంగానే వాషింగ్టన్‌లో కూడా లేఆఫ్స్ చేపట్టినట్లు వెల్లడించింది. వాషింగ్టన్ రాష్ట్రంలో చేపట్టిన తొలగింపుల ప్రభావం ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపై పడింది. తొలగిస్తున్న 2,303 కార్పొరేట్ ఉద్యోగాల్లో 600పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నారు. అమెజాన్ వాషింగ్టన్‌లో తొలగిస్తున్న మొత్తంలో పావువంతు కంటేఎక్కువ. ఇదికేవలం వాషింగ్టన్ రాష్ట్రంలో మాత్రమే అమెరికాలో, ప్రపంచవ్యాప్తంగా ఇంకెన్ని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు అమెజాన్ కోత పెడుతుందో వేచి చూడాలి. ఈ ఏడాది ప్రారంభంలో మైక్రోసాఫ్ట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాల్లో కోతలు పెట్టింది. ఇప్పుడు అమెజాన్ కూడా అదే ఫాలో అవుతున్నట్లు అనిపిస్తోంది. ఇక ఈ ఏడాది జూలైలో అమెజాన్ తన స్వంత ఎఐ టూల్ కిరోను ప్రారంభించింది. దీన్ని తన సిబ్బంది ఎఐ కోడ్ అసిస్టెంట్‌గా ఉపయోగించడానికి సిద్ధమవుతోంది. ఇంతకుముందు కోర్ సాఫ్ట్‌వేర్ కోడ్ కోసం ఇంజినీర్లు అవసరం అయ్యేవారు. కానీ ఇప్పుడు ఆ పని కూడా ఎఐయే చేస్తుండటం గమనార్హం.




వాషింగ్టన్‌లోని సియాటిల్, బెల్లేవ్ నగరాల్లోని కార్యాలయాల్లో ఎక్కువగా కోతలు ఉండనున్నట్లు ఫైలింగ్‌లో అమెజాన్ పేర్కొంది. కేవలం సాఫ్ట్‌ఇంజినీర్లే కాకుండా రిక్రూటింగ్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, అడ్వర్‌టైజింగ్, లీగల్ వంటి విభాగాల్లోనూ తొలగింపులు చేస్తోంది. 500 కంటే ఎక్కువ మేనేజర్లను కూడా తొలగిస్తోంది. మరోవైపు, 14 వేల మందిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తుండటంపై అమెజాన్ చీఫ్ హెచ్‌ఆర్ బెత్ గాలెట్టి ఇటీవల స్పందించారు. సంస్థకు, కస్టమర్లకు.. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎఐ వినియోగాన్ని పెంచడంలో భాగంగానేఇలా ఉద్యోగ కోతలు చేపట్టినట్లు తెలిపారు.

# రద్దయిన రెండువేల రూపాయల నోట్లు ఇంకా చెలామణిలోనే!

**ముంబయి, నవంబరు 2:** దేశంలో రద్దుచేసిన రూ.5,817 కోట్ల విలువైన రూ.2,000 కరెన్సీ నోట్లు ఇప్పటికీ చెలామణిలో ఉన్నాయి. 2023 మే 19న ఆర్బీఐ చెలామణి నుండి రూ.2,000 డినామినేషన్ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. కానీ, ఇంకా 2,000 రూపాయల నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతున్నాయి. 2023మే 19న కరెన్సీ నోటు ఉపసంహరణ ప్రకటించే నాటికి రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు చెలామణిలో ఉన్నాయి. 2025 అక్టోబర్ 31 వ్యాపారం ముగిసే సమయానికి రూ.5,817 కోట్లకు తగ్గిందని ఆర్బీఐ తెలిపింది. ఉపసంహరణ కారణంగా చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 98.37 శాతం తిరిగి వచ్చాయి అని ఆర్బీఐ వెల్లడించింది. 2,000 రూపాయల నోట్లను మార్చుకునే సౌకర్యం మే 19, 2023 నుండి 19 ఆర్బీఐ కార్యాలయాలలో అందుబాటులో ఉంది. 2023 అక్టోబర్ 9 నుండి ఆర్బీఐ కార్యాలయాలు వ్యక్తులు/సంస్థల నుండి వారి బ్యాంకు ఖాతాలలో డిపాజిట్ చేయడానికి రూ.2,000 నోట్లను కూడా అంగీకరిస్తున్నాయి. ఇంకా ప్రజలు దేశంలోని ఏ పోస్టాఫీసు నుండి అయినా ఇండియా పోస్ట్ ద్వారా రూ.2,000 నోట్లను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడానికి ఆర్బీఐ జారీ కార్యాలయాలలో దేనికైనా పంపవచ్చు. ఈ కార్యాలయాలు అహ్మదాబాద్ , బెంగళూరు , బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ , పాట్నా, తిరువనంతపురంల్లో ఉన్నాయి. రూ. 2,000 నోట్ల ఉపసంహరణ స్థితిని ఆర్బీఐ కాలానుగుణంగా సమీక్షిస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps